


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 127 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 19 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 127 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 19 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## 2029లో జమిలి ఎన్నికలు

## తెలంగాణలో 2028 ఎలక్షన్స్ ఉండవ్

- నిబంధనల మేరకే ఏలూరు ఎంపీ
- పుట్టా మహేశ్ యాదవు బెయిల్
- మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నా ప్రమేయం లేదు
- ఈ కేసు దర్యాప్తు కోసం సిట్ వేశాం
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్

పార్లమెంట్ ఆవరణలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నూతనంగా ఎన్నికైన ఎంపీ వేం నరేందర్ రెడ్డిని అభినందించిన ప్రియాంక గాంధీ

హైదరాబాద్ పెన్ పవర్:మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ కేసులో అరెస్టైన వారిలో ఎనిమిది మందికి నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రిగా తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు.ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశామని అన్నారు. ఏపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు నిబంధనల మేరకు స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. 2028లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు రాబోవని జోస్యం చెప్పారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందుగానే వస్తే సంతోషిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతకుముందు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఇతర నాయకులతో కలిసి ఆయన అధిష్ఠానం పెద్దలతో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు పరిచయం చేశారు.

## మూసీ ప్రాజెక్టు రూ.1.5 లక్షల కోట్ల స్కామ్



- ప్రాజెక్టులో పారదర్శకత లేదంటూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ వాకౌట్
- కేటీఆర్ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం.. తొలిదశకు రూ.7,000 కోట్ల అంచనా అని వెల్లడి
- డీపీఆర్ లేకుండా వేల ఇళ్లను ఎలా కూల్చివేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రభుత్వం ఏకంగా రూ. 1.5 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై శాసనసభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ వైఖరిలో పారదర్శకత లేదని నిరసిస్తూ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.ప్రశ్నోత్తరాల సమయంలో కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ నది పునరుజ్జీవనానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భారీ దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైతే, దానిని ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన

- మిగతా2లో

## రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.




- మిగతా2లో



## సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం మరో 3 నెలల పొడగింపు

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పదవి కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలలు పొడగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం (మార్చి 18) సమాచారం అందించింది. కాగా, రామకృష్ణారావు పదవి కాలం గతేడాది ఆగస్టులోనే ముగిసింది.

అయితే.. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఆయన పదవి కాలాన్ని కేంద్ర ప్రభుత్వం ఏడు నెలలు పొడగించింది. ఎక్స్?టెన్షన్ ప్రకారం రామకృష్ణ రావు పదవీకాలం 2026, మార్చి 31న ముగియనున్నది. ఈ క్రమంలో సీఎస్ పదవి కాలాన్ని మరో 3 నెలలు ఎక్స్?టెన్షన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కేంద్రాన్ని కోరింది.

- మిగతా2లో



## ఢిల్లీలో ఎదురుపడిన సీఎం రేవంత్ రెడ్డి, వైసీపీ నాయకురాలు రోజా

- ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి
- నితిన్ గడ్కరీని కలవడానికి పార్లమెంటుకు వచ్చిన రోజా
- పార్లమెంట్ భవనంలో ఎదురుపడిన రేవంత్ రెడ్డి, రోజా
- షేక్ హ్యాండ్ ఇచ్చి పరస్పరం పలకరింపు

హైదరాబాద్ పెన్ పవర్: :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా ఢిల్లీలో ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారు షేక్ హ్యాండ్ ఇచ్చుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో

- మిగతా2లో



## విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలపై అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన

- పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన అశ్వినీ వైష్ణవ్
- జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయినట్లు వెల్లడి
- జోన్ ప్రధాన కార్యాలయం భవనం పునాది పనులు పూర్తయ్యాయన్న కేంద్రమంత్రి

పెన్ పవర్ డెస్క్:రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఎంపీలు అడిగిన ప్రశ్నకు, ఆయన పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

- మిగతా2లో

## సౌదీ, ఖతార్, యూఏఈలోని చమురు, గ్యాస్ కేంద్రాలపై కొన్నిగంటల్లో దాడులు చేస్తాం

- ఇరాన్‌లోని అతిపెద్ద గ్యాస్ ఫీల్డ్ అయిన సౌత్ ఫార్స్ మౌలిక సదుపాయాలపై దాడి
- దీనికి ఇజ్రాయెల్, అమెరికా కారణమని ఇరాన్ ఆరోపణ
- ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్
- పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరికలు జారీ

పెన్ పవర్ డెస్క్:సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ లోని చమురు, గ్యాస్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. తమ ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులకు ప్రతికారం తీర్చుకుం టామని తెలిపింది. గల్ఫ్ దేశాల్లోని తమ కేంద్రాల నుంచి అమెరికా తమపై దాడులు చేస్తుండటంతో, పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ఆ దేశానికి చెందిన టెహ్రాన్ టైమ్స్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది.

- మిగతా2లో






## 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

- గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకున్న 'జగ్ లాడ్కీ'
- పుజైరాలోని పోర్టులో లోడ్ అయిన 'జగ్ లాడ్కీ'
- పుజైరాలో టెర్మినల్‌పై ఇరాన్ దాడి సమయంలో చమురు నింపుకుంటున్న 'జగ్ లాడ్కీ'

పెన్ పవర్ డెస్క్:భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కి' అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను పుజైరా పోర్టులో లోడ్ చేశారు. 'జగ్ లాడ్కి' మొత్తం

- మిగతా2లో

## కొత్త గవర్నర్ వచ్చిన సభకు రాడా.. బాధ్యత లేదా..?

### కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



- కొంతమంది ఇంకా తమను తాము రాజులుగా భావించుకుంటున్నారు: రేవంత్ రెడ్డి
- నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శ
- ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులు అన్న ముఖ్యమంత్రి
- కేసీఆర్ సభకు వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలని విజ్ఞప్తి

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# మాడభూషి జీవితం నేటి తరానికి ఆదర్శం

మాడభూషి అనంత శయనం అయ్యంగార్ ప్రముఖ న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా, అత్యుత్తమ పార్లమెంటు సభ్యుడిగా, వక్తగా, విశిష్ట పండితుడిగా, లోకసభ స్పీకర్‌గా, పాత తరానికి చెందిన జాతీయ నాయకులలో విశిష్ట స్థానం దక్కించు కున్నారు. అయ్యంగార్ 1891 ఫిబ్రవరి 4 న ఆంధ్రప్రదేశ్ లోని ఆధ్యాత్మిక పట్టణం తిరుపతి సమీపంలో తిరుచనూరులో జన్మించారు. తిరుపతిలోని దేవస్థానం ఉన్నత పాఠశాలలో ప్రారంభ విద్యను పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం మద్రాసుకు వెళ్లారు. మద్రాసులోని పచయ్యప్ప కళాశాల నుండి బిఎ పట్టా పొందిన తరువాత, 1913 లో మద్రాస్ లా కాలేజీ నుండి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1912 లో గణిత విషయ ఉపాధ్యాయుడిగా నియుక్తులై, 1915లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. స్వల్ప వ్యవధిలో, ఒక ప్రొఫెషనల్ న్యాయవాదిగా, అసాధారణ సామర్థ్యంతో ఖ్యాతిని పొందారు. జీవనోపాధిని సంపాదించే సాధనంగా మాత్రమే న్యాయవాద వృత్తిని చూడక, భారత ప్రజల అవసరాలకు అనుగుణంగా దేశ న్యాయ వ్యవస్థను మెరుగు పరచడంలో ఆసక్తి చూపారు. అయ్యంగార్ చాలా చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలోకి ప్రవేశించారు. తన సొంత రాష్ట్రంలోనే, బ్రిటిష్ వలస వాదానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రముఖ వ్యక్తులలో ఒకరిగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో ఉండి, పోరాడటమే లక్ష్యంగా, 1934 లో కేంద్ర శాసనసభ ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించు కున్నప్పుడు, అయ్యంగార్ అధిక మెజారిటీతో సభకు ఎన్నికయ్యారు. వాస్తవాలు మరియు గణాంకాలతో అతని సహజమైన చర్చా నైపుణ్యాల ద్వారా, అయ్యంగార్ త్వరలోనే అసెంబ్లీలో తన వాదనా పటిమతో తనదైన ముద్ర వేశారు. మొదట వ్యక్తిగత సత్యాగ్రహ ప్రచారంలో తరువాత 1942 'క్విట్ ఇండియా ఉద్యమంలో' పాల్గొన్నందుకు 1940, 1944 మధ్య అయ్యంగార్ దాదాపు మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. రాజకీయ స్వేచ్ఛ కోసం ఉద్యమంలో చురుకుగా పాల్గొనడమే కాకుండా, సమాజం లోని అణగారిన వర్గాల, సామాజిక విముక్తి దిశగా, నిర్దేశించిన వివిధ కార్యకలాపాలలో అయ్యంగార్ పాల్గొన్నారు. అంటరాని సామర్థ్యం వంటి సామాజిక చెడులతో పోరాడటానికి గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాల నుండి ప్రేరణ పొందిన అయ్యంగార్, హరిజనులకు ఆలయ ప్రవేశం, అంటరాని తనం నిర్మూలన కోసం ఉద్యమాలలో ముందంజలో ఉన్నారు. తరువాత, హరిజన్ సేవక్ సంఘ అధ్యక్షుడిగా తమ సామర్థ్యంలో, హరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు.

ఆయన మొట్టమొదటి సారిగా చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్ కు ఎన్నిక అయ్యారు. తరువాత, చిత్తూరు కో - ఆపరేటివ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఎంపిక అయినారు. 1946-47 మధ్య కాలంలో పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కూడా పని చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యునిగా పని చేశారు. జి.వి.మవలంకర్‌ను రాజ్యాంగ అసెంబ్లీ (శాసనసభ) స్పీకర్‌గా ఎన్నుకున్న నేపథ్యంలో, అయ్యంగార్‌ను దాని డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ స్టీరింగ్ కమిటీలో కూడా పని చేశారు. 1950-52 మధ్య కాలంలో అయ్యంగార్ తాత్కాలిక పార్లమెంటు డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు. 1950 లో తాత్కాలిక పార్లమెంట్ మొదటి అంచనా కమిటీకి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. సమావేశాలను నైపుణ్యంగా నిర్వహించారు. అయ్యంగార్ గొప్ప, సమర్థ వంతమైన పార్లమెంటు సభ్యుడని నిరూపించు కున్నారు. పార్లమెంటరీ నిబంధనలను నిలబెట్టడానికి కట్టుబడి ఉన్నారు. 1957 లో రెండవ లోక్‌సభ ఏర్పడినప్పుడు, అయ్యంగార్ ఐదేళ్లపాటు ఆయనను స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్టాండింగ్ కమిటీలు, కాలింగ్ అటెన్షన్ నోటీసులు మొదలైన వాటిపై అయ్యంగార్ పద్ధతి అనుసరణీయంగా మారింది. 1960 లో టోక్యోలో జరిగిన 49 వ ఇంటర్ పార్లమెంటరీ సమావేశానికి భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నాయకుడిగా పనిచేసిన ఆయన, భారతదేశం లోని శాసనసభల ప్రిసైడింగ్ అధికారుల సమావేశాల నిర్వహణలో ఆసక్తి చూపారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో అయ్యంగార్ మూడవ సారి లోక్‌సభకు ఎన్నికైనా, బీహార్ గవర్నర్‌గా పనిచేయడానికి వీలుగా ఆయన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాదాపు మూడు దశాబ్దాల విశిష్ట పార్లమెంటరీ జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ జీవితాన్ని విడిచిపెట్టిన తరువాత, హరిజన్ సేవక్ సంఘ్, రామ్ విలాస్ సభ, చిత్తూరు డ్రామాటిక్ అసోసియేషన్స్, కాన్స్టిట్యూషన్ క్లబ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ ఫెడరల్ గవర్నమెంట్ తదితర సామాజిక - సాంస్కృతిక, విద్యా సంస్థలతో సంబంధం కొనసాగించారు. పార్లమెంటరీ జీవితం తరువాత, తన జీవితాంతం అయ్యంగార్ ఫిలాసఫీ, సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి అధ్యయనం ప్రచారం పట్ల ఆయన ఎంతో ఆసక్తి చూపారు. కొంతకాలం సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యుడిగా, రిషికుల్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్‌గా పనిచేశారు. భారత పార్లమెంటుపై ఒక పుస్తకాన్ని కూడా రాశారు. మతాలు ప్రధానంగా మనిషికి, మనిషికి మధ్య ఉన్న తేడాలను తొలగించడానికి, మనిషిలో సోదర భావనను పెంపొందించ డానికి తద్వారా అతన్ని ఉద్ధరించడానికి సహాయపడతాయని నమ్మారు. అయ్యంగార్ ప్రకారం, ఉన్నత కులం లేదా తక్కువ కులం వంటివి ఏవీ లేవు, కానీ ఉన్నత చైతన్యం, తక్కువ చైతన్యం మాత్రమే ఉన్నాయి, ఈ రెండింటికి పుట్టుకతో సంబంధం లేదు. పుట్టుక ప్రాతిపదికన ఆరాధన హక్కును తిరస్కరించడం దైవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని నమ్మారు. ఈ నమ్మకమే హిందూ దేవాలయాల లోకి ప్రవేశించాలన్న దళితుల వాదనకు మద్దతు ఇవ్వడానికి అతన్ని ప్రేరేపించింది. బీహార్ గవర్నర్‌గా పూర్తికాలం పనిచేసిన తరువాత, శేష జీవితం గడపడానికి తన స్వగ్రామమైన తిరుపతికి తిరిగి వచ్చి, అయ్యంగార్ 1978 మార్చి 19 న తన 87 వ ఏట చివరి శ్వాస తీసుకునే వరకు సేవలు అందించారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు.

# మూసీ ప్రాజెక్టు రూ.1.5 లక్షల కోట్ల స్కామ్

- మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేశారు. డీపీఆర్ లేకుండానే వేల ఇళ్ల కూల్చివేతకు, భూసేకరణకు ఎలా సిద్ధమవుతారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేటీఆర్ ఆరోపణలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుపై ఎలాంటి దాపరికం లేదని, కేటీఆర్ ఆరోపణలు నిరాధారమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించిన డీపీఆర్ పూర్తయిందని, దాని అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7,000 కోట్ల వరకు ఉంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వల్ల 1,435 నిర్మాణాలు ప్రభావితం అవుతాయని, తుది గణన జరుగుతోందని తెలిపారు. బఫర్ జోన్‌లో ఉన్న వారికి బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు (టీడీఆర్) ఇస్తామని, భూసేకరణ, పునరావాసం 2013 చట్టం ప్రకారమే జరుగుతుందని హామీ ఇచ్చారు. అయితే, ప్రభుత్వ వాదనను కేటీఆర్ తోసిపుచ్చారు. ముఖ్యమంత్రి బహిరంగ సభల్లో రూ.1.5 లక్షల కోట్ల ప్రాజెక్టు అంటుంటే, సభలో మంత్రులు కేవలం రూ.7,000 కోట్లు అని చెప్పడంలోనే వైరుధ్యం కనిపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం 10,000 ఇళ్లు కూల్చివేస్తారని, 3,260 ఎకరాల భూమిని సేకరించనున్నారని పేర్కొన్నారు. సింగపూర్, పాకిస్థాన్ వంటి దేశాల్లో నిషేధానికి గురైన 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి డీపీఆర్ బాధ్యతలు ఎలా అప్పగించారని ఆయన ప్రశ్నించారు. 18 నెలలు పట్టే డీపీఆర్‌ను రెండు నెలల్లోనే ఎలా పూర్తి చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, స్పష్టమైన ప్రణాళిక కూడా లేదని, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి ఎలాంటి రుణం మంజూరు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెందని ఆయన, పారదర్శకత పాటించడం లేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

## కొత్త గవర్నర్ వచ్చిన సభకు రాడా.. బాధ్యత లేదా..?

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్?పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చిన కనీసం శుభాకాంక్షలు తెలిపేందుకైన ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ సభ రాడా.. సభకు రావాల్సిన బాధ్యత లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజులు పోయినా రాచరిక పోకడలు పోలేదని.. కొంతమంది ఇంకా రాజులుగా భావిస్తున్నారని పరోక్షంగా కేసీఆర్?ను విమర్శించారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని.. బీఆర్ఎస్?ను ఓడించి ప్రజలే తప్పు చేసినట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారం పోయినా ఇంకా అదే అహంకారంతో ఉన్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆయనకు ఉన్న అనుభవంతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తామని తెలిపారు. 4 కోట్ల ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉందని తమ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలతో ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై బుధవారం (మార్చి 18) సీఎం రేవంత్ రెడ్డి సమాధానం ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకం. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి విశిష్ట ప్రణాళిక. ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి హుందాగా ధన్యవాదాలు తెలుపుతుందని ఆశించాం. అభివృద్ధిలో కలిసి వస్తారని ఆశించాం.. కానీ అహంకారం ప్రదర్శించారు. 4 కోట్ల మంది ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉంది. రాజ్యాలు పోయినా రాచరిక పోకడలు పోలేదు. కొందరు ఇంకా తాము రాజులుగా భావిస్తున్నారు.

నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను పక్క దారి పట్టించారు. ప్రతిపక్షంలో కూర్చొబెట్టిన వాళ్ల తీరు మారలేదు. కొత్తగా వచ్చిన గవర్నర్ శుభాకాంక్షలు తెలపడానికి కూడా ప్రధాన ప్రతిపక్ష నేత రాలేదు. సభ సంప్రదాయాలను విపక్ష నేత గౌరవించకపోవడం రాష్ట్రానికి మాయని మచ్చ. ప్రతిపక్ష నాయకుడు ఇప్పటిదాకా కోటీ 6 లక్షలకు పైగా జీతభత్యాలు పొందారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలి" అని అన్నారు.

## సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం మరో 3 నెలల పొడగింపు

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనపై పాజిటివ్?గా స్పందించిన కేంద్రం సీఎస్ రామకృష్ణారావు పదవి కాలాన్ని మరో 3 నెలలు పొడగించింది. కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రామకృష్ణ రావు పదవి కాలాన్ని మూడు నెలలు పొడగిస్తున్నట్లు బుధవారం (మార్చి 18) డీవోపీటీ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది.

## రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు

- మొదటి పేజీ తరువాయి

కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.

## ఢిల్లీలో ఎదురుపడిన సీఎం రేవంత్ రెడ్డి, వైసీపీ నాయకురాలు రోజా

- మొదటి పేజీ తరువాయి

ఉన్న విషయం తెలిసిందే. అదే సమయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసేందుకు రోజా పార్లమెంటు భవనానికి వచ్చారు. ఈ సందర్భంగా ఇరువురు తారసపడ్డారు. రోజాను పలకరించిన రేవంత్ రెడ్డి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రేవంత్ రెడ్డితో వెంట ఉన్న నాయకులు ఏదో ప్రశ్నించగా, తాను పని మీద వచ్చానని ఆమె సమాధానం చెప్పారు. ఆ తర్వాత రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని రోజా పలకరించారు.

## విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలపై అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయినట్లు వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయం భవనం పునాది పనులు పూర్తయినట్లు తెలిపారు. అలాగే, ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వే లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని అన్నారు.

## అతడు బలహీనుడు, వెళ్లిపోవడం మంచిదే!.. కౌంటర్ టెర్రరిజం చీఫ్ రాజీనామాపై ట్రంప్ వ్యాఖ్యలు

### జో కెంట్ రాజీనామాపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### భద్రతా వ్యవహారాల్లో కెంట్ విఫలమయ్యారని ఆరోపణ

### ఇరాన్ విధానాలపై అమెరికా ప్రభుత్వంలో తీవ్ర విభేదాలు



'అతడొక బలహీనుడు, యుద్ధ వ్యూహాల విషయంలో పనికిరాడు! అలాంటి వ్యక్తి వైదొలగడం దేశానికి మంచిదే!" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తన ప్రభుత్వంలో అత్యంత కీలకమైన కౌంటర్ టెర్రరిజం చీఫ్ జో కెంట్ రాజీనామాపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ తీవ్ర వ్యాఖ్యలతో అమెరికా ప్రభుత్వంలో ఇరాన్ విధానాలపై నెలకొన్న అంతర్గత పోరు ఒక్కసారిగా బట్టబయలైంది. పశ్చిమాసియాలో ఇరాన్‌తో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, ట్రంప్ సర్కార్ అనుసరిస్తున్న దూకుడు విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ జో కెంట్ తన పదవికి రాజీనామా సమర్పించారు. ఇరాన్‌పై దాడులు, ఆ దాడుల్లో అమాయక పౌరుల మరణాలు, ప్రాంతీయ అస్థిరత వంటి అంశాలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు వైట్‌హౌస్ వర్గాల కథనం. వ్యూహాత్మక విభేదాలు తారస్థాయికి చేరడంతోనే ఆయన ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

**ట్రంప్ నిప్పులు..**

ఒక కీలక అధికారి రాజీనామాపై సంయమనం పాటించాల్సింది పోయి, ట్రంప్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. "జో కెంట్ రాజీనామాను నేను స్వాగతిస్తున్నాను. దేశ భద్రత విషయంలో మెతక వైఖరి అవలంబించే వారికి నా ప్రభుత్వంలో స్థానం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకునే ధైర్యశాలురే నాకు కావాలి. కెంట్ వంటి వారు ఇక్కడ సరిపోరు. అతడు వెళ్లిపోవడం చాలా మంచిదైంది" అని ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. సొంత అధికారిపై అధ్యక్షుడే ఈ స్థాయిలో విమర్శలు చేయడం అమెరికా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

**బయటపడ్డ భిన్నాభిప్రాయాలు..**

ఈ రాజీనామా, ఆ తర్వాత ట్రంప్ వ్యాఖ్యలతో ఇరాన్ విషయంలో వైట్‌హౌస్‌కు, భద్రతా, నిఘా వర్గాలకు మధ్య తీవ్రమైన అగాధం ఏర్పడినట్లు స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయి వాస్తవాలను, భవిష్యత్ పర్యవసానాలను భద్రతా అధికారులు వివరిస్తుంటే, రాజకీయ ప్రయోజనాల కోసం దూకుడుగా ముందుకు వెళ్లాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోందనడానికి ఈ ఘటనే నిదర్శనం. అయితే, తన దూకుడు తగ్గించే ప్రసక్తే లేదని, ఇరాన్‌కు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఈ పరిణామం అమెరికా అంతర్గత రాజకీయాల్లోనే కాకుండా, మధ్యప్రాచ్య భౌగోళిక రాజకీయాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సౌదీ, ఖతార్, యూఏఈలోని చమురు, గ్యాస్ కేంద్రాలపై కొన్నిగంటల్లో దాడులు చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

పొరుగున ఉన్న దేశాల్లోని చమురు, గ్యాస్ కేంద్రాలపై మరికొన్ని గంటల్లో దాడులు చేయనున్నట్లు తెలిపింది. ఇరాన్‌లోని అతిపెద్ద గ్యాస్ ఫీల్డ్ అయిన సౌత్ ఫార్స్ మౌలిక సదుపాయాలపై దాడి జరిగింది. దీనికి ఇజ్రాయెల్, అమెరికా కారణమని ఇరాన్ ఆరోపించింది. అలాగే ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల్లో ఇరాన్ నిఘా వ్యవహారాల మంత్రి ఇస్మాయిల్, సీనియర్ భద్రతా అధికారి అలీ లారిజానీ, బసీజ్ ఫోర్స్ అధిపతి జనరల్ గులాం రెజా సొల్మనీ మృతి చెందారు. తమ దేశానికి చెందిన కీలక నాయకులు మృతి చెందడంతో ఇరాన్ తీవ్ర హెచ్చరికలు చేస్తోంది.

## 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

- మొదటి పేజీ తరువాయి

పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. మార్చి 14న పుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. 'జగ్ లాడ్కి' అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది.

ఇప్పటికే శివాలిక్, నందాదేవి నౌకలు హర్మూజ్ జలసంధిని గుండా ప్రయాణించి సురక్షితంగా భారత్ చేరుకున్నాయి. ఈ నౌకలు ఎల్పీజీ గ్యాస్‌ను తీసుకువచ్చాయి. సముద్రమార్గంలో జరిగే చమురు రవాణాలో ఐదవ వంతు హర్మూజ్ జలసంధి ద్వారా ఉంటుంది.

## లాకప్‌లో నన్ను శారీరకంగా, మానసికంగా హింసకు గురి చేశారు

సత్తెనపల్లి, నల్లపాడు, పట్టాభిపురం పోలీస్ స్టేషన్లలో తనపై నమోదైన అక్రమ కేసుల విషయంలో పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లతో తనను 18 రోజుల పాటు సెంట్రల్ జైల్లో ఉంచేలా పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఇది సుప్రీంకోర్టు గత తీర్పులకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేశ్ చెబితేనే తనను కోర్టులో ప్రవేశ పెట్టారని మండిపడ్డారు.

తనను లాకప్‌లో ఉంచిన సమయంలో పోలీసులు శారీరక, మానసిక హింసకు గురిచేశారని, దీనిపై న్యాయపోరాటం చేస్తానని అంబటి అన్నారు. తన నివాసం, వాహనాల మీద ఏడు గంటల పాటు దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోకుండా ప్రేక్షక పాత్ర వహించారని, కానీ దాడి చేసిన వారికి మాత్రం వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది కేవలం పవన్ కల్యాణ్ కి మాత్రమే పరిమితమైందని... సామాన్య ప్రజలకు, ప్రతిపక్షాలకు ఇది 'ఆటవిక పాలన'గా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, పోలీసు వ్యవస్థను మేనేజ్ చేస్తే ఏమైనా చేయొచ్చనే అరాచక వాతావరణం నెలకొందని అంబటి దుయ్యబట్టారు. న్యాయవ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, ఎంతదూరమైనా వెళ్లి పోరాడతానని స్పష్టం చేశారు.

# ప్రతి రోజు. ఉదయం 9.30 లోపు రోడ్లన్నీ క్లీన్ కావాల్సిందే





**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో ప్రతి రోజు 9 గంటల 30 నిమిషాల లోపు ప్రధాన రహదారులన్నీ క్లీన్ చెయ్యాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 10 గంటల తర్వాత రోడ్లపై ఎక్కడా క్లీనింగ్ పనులు కనిపించకూడదని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారుల శుభ్రతపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఏవైనా లోపాలు జరిగితే.. ఆ పూర్తి బాధ్యత డిప్యూటీ కమిషనర్లు, డీఈఈ లదేనని కమిషనర్ తేల్చి చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రీన్ వేస్ట్ తొలగింపు బాధ్యతను సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగానికి అప్పగించారు. నిర్మాణ వ్యర్థాలు , పాత చెత్తను తొలగించడానికి అదనపు వాహనాలను ఏర్పాటు చేయాలని

- మిగతా 4లో...

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# ఉగాది వెనుక విశేషాలెన్నో...

## నేడు ఉగాది పర్వదినం

ఉగాది పండుగ హిందువులకు తొలి పండుగగా భావిస్తారు. పాడి పంటలతో కళకళలాడుతూ అందరి ఇంట సౌభాగ్యాలు వర్ధిల్లాలని ఉగాది పండుగను శుభ సూచకంగా భావిస్తారు. తెలుగు సంవత్సరాలు 60 ఉన్నాయి. ప్రభవా విభవతో పాటు ప్రతి సంవత్సరం ఒక నామముతో ఉగాది పండుగ ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరం పరాభవ నామ సంవత్సరం యొక్క విశిష్టతను వివరిస్తూ ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాస పండగలకు ప్రతిరూపంగా షడ్రుచులకు వేదికగా ఉగాది పండుగ పర్వదినం జరుపుకుంటారు. భారతదేశంలో తెలుగు వారి పండుగలో ఉగాదికి ఒక ప్రత్యేక స్థానం కల్పించింది. ఇది కేవలం క్యాలెండర్ మారే రోజు మాత్రమే కాదు.





### పరాభవ నామ సంవత్సరం వైఫల్యం నుంచి వైభవం వైపు ప్రయాణం

### హిందూ సంప్రదాయం ప్రకారం తొలి పండుగ

### నేడు ఉగాది పండుగ పర్వదినంపై ప్రత్యేక కథనం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు వారి పండుగల చిట్టాలో ఉగాది ముఖ్యమైనది. పూర్వ కాలంలో దీనినే 'యుగాది'గా పిలిచేవారు. అంటే యుగానికి ఆదిగా దీనికి నిర్వచనం. ఆంగ్ల సంవత్సరాది జనవరి ఒకటిన ప్రారంభం అవుతుండగా, మన తెలుగు సంవత్సరాది చైత్ర మాసంలో ప్రారంభమవుతుంది. సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో వచ్చే ఈ పండుగతో కొత్త సంవత్సరం ప్రారంభం కావడంతో పాటు వరుసగా పర్వదినాలు వస్తాయి. రానున్న సంవత్సరాన్ని పరాభవ నామ సంవత్సరంగా వ్యవహరిస్తారు. శిశిరంలో మోడైపోయిన చెట్లన్నీ వసంతంలో చిగుళ్లు తొడిగి కొత్త సింగారాలొలుకుతుంటాయి. రుతువుల్లో మొదటిదైన వసంతం మనోహరమైనదీ, ఆహ్లాదకరమైనదీ. వసంత రుతువు తానే అన్నాడు శ్రీకృష్ణుడు. అలాంటి వసంతంలో వచ్చే తొలి మాసం చైత్రం. తిథుల్లో తొలి గౌరవం పాడ్యమిది. బ్రహ్మ సృష్టి ఆరంభించినది ఈ చైత్ర శుద్ధ పాడ్యమి నాడే అంటోంది బ్రహ్మపురాణం. రామ పట్టాభిషేకం జరిగిందీ, శ్రీకృష్ణుడు తన అవతారాన్ని చాలించిందీ, కలియుగం ప్రారంభమైందీ ఆ రోజేనని పండితులు చెబుతారు.

-4లో



ప్రకృతి పచ్చని చీర కట్టుకున్న వసంత కాలంలో.. కోయిల కుహు కుహూ రాగాల మధ్య ఆనందోత్సాహాలతో, సంప్రదాయ బద్ధంగా జరుపుకొనే పండుగ ఉగాది. అడుగడుగునా తెలుగువారి సంప్రదాయ రీతులు ప్రతిబింబిస్తూ కొత్త సంవత్సరం ఆరంభానికి స్వాగతం పలుకుతుంది. ప్రకృతి పరంగా కూడా ఎన్నో నిగూఢ విశేషాలు దాగిఉన్నాయి. మార్చి 19వ తేదీ గురువారం రోజు మరో కొత్త ఏడాదిలోకి అడుగు పెడు తోన్న శుభవేళ ఉగాది పండుగ వెనుక విశేషాలేంటో తెలుసుకుందాం.. తెలుగు సంవత్సరాది అనగానే వెంటనే గుర్తొచ్చేది ఉగాది పచ్చడి. షడ్రుచులు కలగలిపిన ఆ అమృత పదార్థం మనిషి జీవితంలోని సుఖదుః ఖాలకు ప్రతీక. ఉగాది పచ్చడికి ఎన్నో ఔషధగుణాలూ ఉన్నాయి. అందుకే, ఆ ఆరు రుచుల మేలు కలయిక పండుగ ప్రసాదమైంది.

## హిల్ట్ పాలసీపై ఈడీ, సీబీఐ ఏ విచారణకైనా సిద్ధం సీఎం రేవంత్

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 2029లో... ఎట్లా గెలుస్తారో చూస్తా..

## ఇదే నా సవాల్.. రాసిపెట్టుకోండి..



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావుపై సీఎం రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ.. నేను అల్లాటప్పాగా అధికారంలోకి రాలేదని.. 2023లో మీ నెత్తిమీద కాలు పెట్టి తొక్కి ఇక్కడి వరకు వచ్చానన్నారు. 2029లో కూడా మిమ్మల్ని తొక్కి నిలబడతానని.. మీరంతా కట్టగట్టుకుని వచ్చిన నిలబడతా గుర్తు పెట్టుకోండని అన్నారు. 2029లో బరాబర్ మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2029లో మీరు ఎలా గెలుస్తారా చూస్తానని.. మిమ్మల్ని మళ్లీ తొక్కకపోతే చూడండి.. ఇదే నా సవాల్ అని హాట్ కామెంట్స్ చేశారు. నేను స్వశక్తితో ఎదిగినవాడినని.. మీరు నా కాలి గోటికి కూడా సరిపోరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వారసత్వంగా వస్తున్న సీఎం పదవి రాకపోవడంతో విషం కక్కుతున్నారని కేటీఆర్?ను విమర్శించారు. తెలంగాణ ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చి పదేళ్ల ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకు తిన్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పరివారానికి తెలంగాణ పరిహారంగా మారిందన్నారు. సొంత ఇంటి ఆడబిడ్డ మాటలను కూడా చాటుగా విన్నారని నిప్పులు చెరిగారు.

గత ప్రభుత్వంలో బతుకమ్మ చీరల కొనుగోళ్లలో మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు మహిళలు వ్యాపారాలు చేయలేదని.. గత ప్రభుత్వంలో మహిళలను అవమానించారని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పేదేండ్లు సభలో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు అవకాశం కూడా ఇవ్వలేదని.. కానీ మేం అందరికీ మాట్లాడేందుకు ఛాన్స్ ఇస్తున్నామని తెలిపారు.

# అసభ్యకర కామెంట్స్ చేస్తే కఠిన చర్యలు..

## సైబర్ క్రైమ్ పోలీసుల హెచ్చరిక.

**హైదరాబాద్ పెన్ పవర్:** సోషల్ మీడియా ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చిన ఈ వేదిక ఇప్పుడు కొందరు ఆకతాయిల చేతిలో అస్త్రంగా మారుతోంది. ఇన్ స్టా గ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్ వేదికగా మహిళలను వేధింపులకు గురి చేస్తున్న ఘటనలపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారుసాధారణ మహిళల నుంచి సెలబ్రిటీల వరకు ఎవరినీ వదలకుండా అసభ్యకరమైన పదజాలంతో కామెంట్స్ చేస్తూ ఇబ్బంది పెడుతున్న కేటుగాళ్లపై సైబరాబాద్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెర వెనుక ఉండి గుట్టుచప్పుడు కాకుండా తప్పుడు కామెంట్స్ చేసే వారిని సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నామని ఆయన వెల్లడించారు. వేధింపులకు పాల్పడుతున్న వారిలో మైనర్లు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. అలాంటి వారికి సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇస్తున్నారని చెప్పారు. మైనర్ల విషయంలో కేవలం పిల్లలకే కాకుండా, వారి తల్లిదండ్రులను సైతం పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఏం చేస్తున్నారో గమనించాలని సూచించారు. ఒకసారి కౌన్సిలింగ్ ఇచ్చినా మారకుండా, పదే పదే తప్పుడు కామెంట్స్ పోస్ట్ చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు.



# ఉగాది వెనుక విశేషాలెన్నో..

-3 పేజి తరువాయి

ఖగోళ, జ్యోతిష శాస్త్రవేత్త వరాహమిహిరుడి అంచనాల ప్రకారం చైత్రమే తొలి మాసం. ఆ రోజే తొలి పంచాంగాన్ని జనజీవన స్రవంతికి అంకితం చేశాడాయన. విక్రమార్కుడూ, ఆంధ్రరాజుల చక్రవర్తి శాలివాహనుడూ సింహాసనాన్ని అధిష్ఠించిందీ ఈ చైత్ర శుద్ధ పాడ్యమినాడే. ఇన్ని ప్రత్యేకతలున్నాయి కాబట్టే చాంద్రమానాన్ని అనుసరించే తెలుగు, కన్నడ, మహారాష్ట్ర ప్రజలు చైత్ర శుద్ధ పాడ్యమినే నూతన సంవత్సర ఆరంభ దినంగా, కొత్తదనానికి ప్రారంభంగా భావించి పండగ జరుపుకొంటారు. ఉత్కంఠ గొలిపే సంవత్సర ఫలితాలను, కందాయ ఫలాలను పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకోవడం ఉగాది నాటి ముఖ్య వేడుక. కొత్త చిగుళ్లతో, రంగురంగుల పూలతో, పరిమళాల పన్నీరుతో కొమ్మకొమ్మకీ మామిడి తోరణాలు, కోయిల పాటలు వసంతానికి పచ్చని గురుతులై ప్రాణికోటికి శుభం పలుకుతున్నాయి. షడ్రుచుల ప్రసాదం కోసం మామిడి పిందెలు, వేపపూతలు సిద్ధంగా ఉన్నాయి.

అన్ని రుచులు సమానంగా ఆస్వాదించాలనీ, అన్ని అనుభవాలు కలిస్తేనే సంపూర్ణ జీవితమనే సందేశాన్ని ఉగాది పచ్చడి మానవాళికి అందిస్తోంది. సంవత్సరమంతా జీవితంలో ఏర్పడే కష్టనష్టాలు, సుఖ సంతోషాలను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలనే తాత్విక సందేశం ఉగాది పండుగలో ఉంది.

**ఉగాది పండుగ నాడు తప్పక ఆచరించాల్సినవి...!**

ఉగాది.. తెలుగు ప్రజల కొత్త ఏడాదికి ప్రారంభం. చైత్ర మాస శుద్ధ పాడ్యమి రోజున జరుపుకునే ఈ పండుగను ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఈ రోజున చేసే పనులు ఏడాది మొత్తం జీవితంపై ప్రభావం చూపిస్తుందని పెద్దలు, పండితులు చెప్తారు. అందుకే ఉగాది రోజు కొన్ని శుభకార్యాలు చేయడం ఆచారంగా ఉంది. అవేంటో ఇప్పుడు చూద్దాం.

ఉగాది రోజున కొన్ని ప్రత్యేకమైన పూజలు, సాంప్రదాయాలు చేయడం వల్ల ఆ ఏడాది మొత్తం శుభంగా ఉంటుందనేది భక్తుల నమ్మకం.

ప్రభాత వేళే మేల్కొనడం – బ్రహ్మ ముహూర్తంలో లేచి, తైలస్నానం (నువ్వుల నూనెతో స్నానం) చేయడం శ్రేయస్కరం.

కొత్త బట్టలు ధరించడం – కొత్త ఆరంభానికి సంకేతంగా, ఈ రోజు అందరూ కొత్త బట్టలు ధరించి ఉగాదిని ఆహ్వానిస్తారు.

వేప పచ్చడి సేవించడం – తీపి, చేదు, కారం, పులుపు, వగరు, ఉప్పు వంటి షడ్రుచులను కలిపి తయారుచేసిన ఉగాది పచ్చడి జీవితంలోని అనేక అనుభవాలను సూచిస్తుంది. ఇది ఆరోగ్యానికి మంచిది.

పంచాంగ శ్రవణం – ప్రతి ఉగాది రోజున కొత్త సంవత్సర ఫలితాలను తెలుసుకునేందుకు పండితుల ద్వారా పంచాంగ శ్రవణం చేయడం ఉత్తమం.

మినపప్పు , కందిపప్పు, శెనగపప్పుతో చేసిన పదార్థాలు స్వీకరించాలి, స్వయంపాకంగా దానం ఇవ్వాలి.

**బ్రాహ్మణులకు దానము ఇవ్వాలి.**

కుదిరితే అన్నదానం చేయాలి. జలదానం చేయాలి.

తల్లిదండ్రులకు భక్తితో నమస్కరించాలి, భార్యను ప్రేమతో చూచి కుదిరితే గాజులు కొనిచ్చి /కొనిపెట్టి , కుంకుమ బొట్టు పెట్టి ఆమెను దేవతగా భావించాలి. తద్వారా పార్వతీదేవి యొక్క ఆశీస్సులు పొందగలము.

గురువునకు ఉగాదినాడు 3 ప్రదక్షిణలు చేసినవారు, 3 సార్లు భూప్రదక్షిణ చేసిన ఫలితం పొందుతారు.

లక్ష్మీదేవిని పూజించి వ్యూహలక్ష్మీ మంత్రమును జపించుకోవటం, ఈశ్వరునికి అభిషేకం చేసుకోవటం శ్రేష్ఠం.

పంచాంగ శ్రవణం చేయండి, కుదిరితే పంచాంగం లేక మంచి పుస్తకాలు దానం చేయడం మరింత ఉత్తమం. ఆలా చేస్తే పిల్లల యొక్క విద్య వృద్ధి చెశీదుతుంది.

**పసుపు కుంకుమలు దానం ఇవ్వండి.**

బూరెలతో కూడిన భోజనము చేస్తే భూరి సంపదలు ఇస్తాడు పరమాత్మ.

కోపం వదిలి, అన్నీ మంచి పలుకులు పలుకుదాము, ఈ నూతన సంవత్సరం సకల శుభాలను పొందుదాం...

ఇవేగాక చాలామంది ఉగాది పండుగ నాడు ఇంటిపై కాషాయ ధ్వజం ఎగురవేయడం వంటివి చేస్తుంటారు. ఇలా ఎందకు చేస్తారు దాని వెనుక ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక రహస్యాలు ఏంటంటే.

**విజయ ప్రతీకగా..**

నూతన సంవత్సర ఆరంభం (విజయ ప్రతీక)... తెలుగు రాష్ట్రాలలో ఉగాదిని నూతన సంవత్సరంగా జరుపుకుంటాం. పురాణాల ప్రకారం, ఈ రోజే బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించాడని నమ్ముతారు. కాషాయ రంగు త్యాగానికి, పవిత్రతకు, ధర్మానికి చిహ్నం. కొత్త సంవత్సరం అంతా ధర్మబద్ధంగా, విజయవంతంగా సాగాలని కోరుకుంటూ ఇంటిపై ధ్వజాన్ని ఎగురవేస్తారు.

**చారిత్రక నేపథ్యం (విజయ సంకల్పం)...**

చారిత్రక కోణంలో చూస్తే, ఈ రోజును విజయ దినంగా కూడా భావిస్తారు. శాలివాహన చక్రవర్తి శకులను జయించి 'శాలివాహన శకం' ప్రారంభించిన శుభసందర్భం ఇది. ధ్వజం అనేది విజయానికి గుర్తు. ప్రతి ఇంటిపై ఈ జెండాను ఉంచడం ద్వారా ఆ కుటుంబం రక్షణ, ఐక్యతను చాటుతారు.

ఆధ్యాత్మిక అర్థం... కాషాయం అంటే సూర్యోదయ కిరణాల రంగు. ఇది చీకటిని (అజ్ఞానాన్ని) తొలగించి వెలుగును (జ్ఞానాన్ని) ప్రసాదించే రంగు. హిందూ సంప్రదాయంలో జెండాను 'కేతువు' అని పిలుస్తారు. ఇంటి పైన జెండా ఎగురవేయడం వల్ల దుష్టశక్తులు దరిచేరవని, దైవ రక్షణ ఉంటుందని భక్తుల నమ్మకం.

**పండుగ అలంకరణలో భాగం...**

సాధారణంగా ఉగాదినాడు గుమ్మాలకు మామిడి తోరణాలు, వేప రెమ్మలతో పాటు ఇంటి కప్పు పైన లేదా బాల్కనీలో కాషాయ జెండాను కడతారు. ఇది ఇంటికి ఒక పవిత్రమైన రూపాన్ని ఇస్తుంది. ధ్వజం కట్టేటప్పుడు జెండా శుభ్రంగా, చిరగకుండా ఉండాలి.

సాధారణంగా దీనిపై 'ఓం' కారము లేదా హనుమంతుడి చిహ్నం ఉంటుంది. జెండాను ఎత్తైన ప్రదేశంలో గాలికి రెపరెపలాడేలా కట్టడం శుభప్రదంగా భావిస్తారు.

# హిల్ట్ పాలసీపై ఈడీ, సీబీఐ ఏ విచారణకైనా సిద్ధం





**హైదరాబాద్ పెన్ పవర్:** హిల్ట్ పాలసీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ.. హిల్ట్ పాలసీపై కేటీఆర్, హరీష్ రావు లేఖ రాస్తే బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన పాలసీ, తమ పాలసీపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని సీఎం రేవంత్ అన్నారు. గతంలో, ఇప్పటి హిల్ట్ పాలసీపై సీబీఐ, సిట్, ఈడీ ఏ విచారణకైని సిద్ధమని అన్నారు. అలాగే టీడీఆర్, బదిలీలపైనా విచారణకు సిద్ధమన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు పంపించేందుకే హిల్ట్ పాలసీ తెచ్చామని స్పష్టం చేశారు.

**అసలు హిల్ట్ పాలసీ ఏంటి..?**

హైదరాబాద్ సిటీ లోపల ఉన్న కాలుష్య కారక, అవుట్ డేటెడ్ టెక్నాలజీతో నడుస్తున్న పరిశ్రమలను అవుటర్ రింగ్ రోడ్డు( ఓఆర్ఆర్) అవతలకు తరలించేందుకు తెలంగాణ రాష్ట్ర సర్కార్ కసరత్తు ప్రారంభించింది. బాలానగర్, కాటేదాన్, కూకట్?పల్లి, ఉప్పల్, జీడిమెట్ల, చర్లపల్లి తదితర 22 ఇండస్ట్రియల్ ఏరియాల్లోని భూములను ఇతర అవసరాలకు వాడుకునేలా కొత్త పాలసీ రూపొందించింది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ ( హెచ్ఐఎల్టీపీ)ని నవంబర్ 17న కేబినెట్ ఆమోదించి నవంబర్ 22న జీవో నెం.27ను తీసుకొచ్చింది. దీని ప్రకారం 22 ఇండస్ట్రియల్ ఏరియాలోని 9,292.53 ఎకరాల భూములలో ఖాయిలాపడి మూతపడి ఉన్న పరిశ్రమల భూములు, కాలుష్య కారకాలకు సంబంధించిన పరిశ్రమల భూములు ఉన్నవి. ఇప్పటికే కొంతభాగం భూములు ఇతర అవసరాలకు వాడుతున్నందున, మిగిలిన భూములను కూడా అదేవిధంగా వాడుకునేందుకు మార్చుకునేలా అవకాశం కల్పించింది. ఈ మొత్తం భూములు 4,740.14 ఎకరాలని ప్రభుత్వం పేర్కొంది.

**జనసాంద్రత మధ్య ఉన్న పరిశ్రమలను తరలించాలి**

ప్రస్తుతం ఈ పారిశ్రామిక ప్రాంతాలు నగరం మధ్యలో ఉండి కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. సమీప ప్రాంతాలు బాగా అభివృద్ధి చెంది జన సాంద్రతను సంతరించుకున్నాయి. ఉమ్మడి రాష్ట్రం 2013లోనే రెసిడెన్షియల్ జోన్?లో ఉన్న కాలుష్య కారకాల పరిశ్రమలన్నింటినీ

ఓఆర్ఆర్ అవతలికి తరలించాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయించి జీవో 20ని తీసుకొచ్చింది. దాని ప్రకారం కొన్ని కాలుష్య పరిశ్రమలు ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలించాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కొన్ని కాలుష్య పరిశ్రమలను మూసివేసి ఓఆర్ఆర్ అవతలికి పంపించింది. మిగిలిన కొద్దిపాటి పరిశ్రమలు పాత సాంకేతికతనే కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన నగరంలో భాగంగా మారిన ఆనాటి పారిశ్రామికవాడల నుంచి పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు పంపాలని గతంలో పాలకులు అనేక ప్రయత్నాలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఆ దిశగా ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలించేందుకు ప్రయత్నిస్తోంది.

# ప్రతి రోజు. ఉదయం 9.30 లోపు రోడ్లన్నీ క్లీన్ కావాల్సిందే

-3 పేజి తరువాయి

సూచించారు. పారిశుద్ధ్యంపై మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులకు , ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందేలా చూడాలని కమిషనర్ సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్లు, డీసీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తూ నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడమే తమ ప్రాధాన్యతని కమిషనర్ కర్ణన్ స్పష్టం చేశారు.

# రహస్య సమావేశాల కలకలం

**హైదరాబాద్, మార్చి 18, పెన్ పవర్:**

అధికార పార్టీ ఎమ్మెల్యేల రహస్య సమావేశం. పైగా మంత్రి పదవి రాలేదన్న అసంతృప్తితో.. రగిలిపోతున్న ఓ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన సీక్రెట్ మీటింగ్. ఇప్పుడీ వార్త. తెలంగాణ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. మొత్తం 15 మంది ఎమ్మెల్యేలకు ఆహ్వానం. 9 మంది ఎమ్మెల్యేలు హాజరు. వచ్చిన వాళ్లతో సీక్రెట్ డిన్నర్ మీటింగ్. అవును..తెలంగాణ రాజకీయాల్లో ఇదే ఇప్పుడు పొలిటికల్ సెన్సేషనల్ టాపిక్. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహచర ఎమ్మెల్యేలతో రహస్య సమావేశం నిర్వహించారన్న టాక్ అధికార కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. మంత్రి పదవి రాలేదని తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న రాజగోపాల్ రెడ్డి..ఎమ్మెల్యేలతో సీక్రెట్ మీటింగ్ వెనుక ఆంతర్యం ఏమై ఉంటుందన్న ఉత్కంఠ నెలకొంది. చాలా కాలంగా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న రాజగోపాల్ రెడ్డి..అమాత్య యోగం దక్కకపోవడంతో ఎప్పటికప్పుడు తన అసంతృప్తిని వెళ్లగక్కుతూ వస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడల్లా తనకు క్యాబినెట్‌లో చోటు దక్కుతుందని భావించినా నిరాశే ఎదురవుతూ వస్తోంది. దీంతో తనకు మంత్రి పదవి రాకుండా సీఎం రేవంత్ రెడ్డే అడ్డు కాలు వేస్తున్నారని ఆగ్రహంగా ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. పబ్లిక్ డయాస్ అయినా..మీడియాతో ఆఫ్ ది రికార్డులో మాట్లాడినా బ్లాస్టింగ్ కామెంట్స్ చేస్తూ..చర్చకు, రచ్చకు తెరలేపుతున్నారాయన. మునుగోడు ప్రజల ఆశీర్వాదంతో త్వరలోనే తనకు మంత్రి పదవి వస్తుందని ఆశిస్తున్నట్లు ఈ మధ్యే చెప్పారు రాజగోపాల్ రెడ్డి. ఒకవేళ మంత్రి పదవి రాకపోతే డైరెక్టుగా సీఎం అవుతానంటూ వ్యాఖ్యనించారు. ఇచ్చిన మాట ప్రకారం తనకు మంత్రి పదవి ఇవ్వాలని పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. తాను ఇంకా వేచి చూస్తానని..పదవి కోసం తన బాధ కాదని అన్నారు. అభివృద్ధే తన లక్ష్యమని..తనను మంత్రిని చేయకపోతే సీఎం కావటమే తన టార్గెట్ అని కుండబద్దలు కొట్టి చెప్పారు. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ కామెంట్స్ గత కొన్ని రోజులుగా రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. ఇలాంటి సిచ్యువేషన్‌లో ఇప్పుడు సీక్రెట్ డిన్నర్ మీటింగ్ అధికార కాంగ్రెస్‌లో కలకలం రేపుతుంది. నాలుగు రోజుల క్రితం రాజగోపాల్ రెడ్డి పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రహస్యంగా సమావేశం అయ్యారని తెలుస్తోంది. మొత్తం 15 మంది ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపగా 9 మంది ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి మీటింగ్‌కు హాజరైనట్లు చెబుతున్నారు. మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 9 మంది ఎమ్మెల్యేలతో ఆయన సీక్రెట్‌గా భేటీ అయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో జరిపిన సీక్రెట్ డిన్నర్ మీటింగ్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏం మాట్లాడారన్నదే ఇంట్రెస్టింగ్‌గా మారింది. మంత్రి పదవి ఇవ్వకపోతే తానే ముఖ్యమంత్రి అవుతానన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు, 9 మంది ఎమ్మెల్యేలతో రహస్య సమావేశానికి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణంలో రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇది సాధారణ సమావేశమేనా లేదంటే కొత్త రాజకీయ సమీకరణాలకు కేంద్ర బిందువు కాబోతోందా అన్న సందేహాలకు తావిస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి పార్టీని వీడబోతున్నారన్న ప్రచారం జరుగుతున్న వేళ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రహస్య మీటింగ్ పెట్టడం ఆ పార్టీలో కాక రేపుతోంది. మంత్రి పదవి దక్కితేనే రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి చల్లారే పరిస్థితి ఉందంటున్నారు లీడర్లు. ఆయనకు అమాత్యయోగం కల్పిస్తే ప్లస్ ఎంత మైనస్ ఎంత బేరీజు వేసుకుంటున్నారట హస్తం పార్టీ పెద్దలు. ఇలాంటి నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి సీక్రెట్ మీటింగ్ ఎజెండా ఏంటి..అందులో ఏయే అంశాలపై చర్చించారనేది ప్రస్తుతానికి అయితే ఉత్కంఠగా కొనసాగుతోంది. తేడా వస్తే ఎంతకైనా సిద్ధమని చెప్పేందుకే ఈ మీటింగ్ కోమటిరెడ్డి పెట్టారా అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. ఈ మీటింగ్ కు వెళ్లిన ఎమ్మెల్యేలెవరని అటు ఇంటెలిజెన్స్..ఇటు మిగతా ఎమ్మెల్యేలు ఆరా తీస్తున్నారట.

## నిరుపయోగంగా ఉపాధి హామీ నీటి తొట్లు

**నల్లగొండ, మార్చి 18 పెన్ పవర్:** నల్గొండ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన నీటి తొట్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. గతంలో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన ఈ తొట్లకు సరైన నిర్వహణ లేకపోవడంతో కొన్ని శిథిలావస్థకు చేరాయి, మరికొన్ని నిలిచిపోయాయి. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని, నిరుపయోగంగా ఉన్న ఈ నీటి తొట్లలో నీటిని నింపి అందుబాటులోకి తేవాలని పశు పోషకులు, కాపరులు కోరుతున్నారు. ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కాంగ్రెస్‌పాలన మాఫియాను తలపిస్తోంది

**మిర్యాలగూడ, మార్చి 18పెన్ పవర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మాఫియాను తలపిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. చండూరు మండల కేంద్రంలో భాజపా నాయకులపై కాంగ్రెస్ నాయకులు ఇటీవల దాడిచేశారు. ఈ ఘటనలో గాయపడి, నల్గొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని రామచంద్రరావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భాజపా నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తున్నా పోలీసులు వారిపై నామమాత్రపు కేసులు పెడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతోన్న పరిణామాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేశామన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు 'శుద్ధజలం'



**మునుగోడు, మార్చి 18పెన్ పవర్:** అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పూర్వ ప్రాథమిక విద్యాకేంద్రాల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు రకాల కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని హంగులతో సొంత భవనాలు నిర్మిస్తున్నారు. పిల్లలు నిత్యం కేంద్రాలకు వచ్చేలా ఆహ్లాదకర వాతావరణం, ఆకర్షణీయమైన గదులుండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తున్నారు. వీటితోపాటు ఈ సంవత్సరం శుద్ధజల కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది.

## బ్రహ్మకుమారీస్ 90ఏళ్ల సేవలు చరిత్రాత్మకం

**దేవరకొండ, మార్చి 18పెన్ పవర్:** ప్రపంచ శాంతి కోసం భారతీయ ధ్యాన విజ్ఞానం ద్వారా బ్రహ్మకుమారీస్ సంస్థ కృషి అభినందనీయమని వక్తలు ప్రశంసించారు. బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్‌లోని బ్రహ్మకుమారీస్ సైలెన్స్ రిట్రీట్ సెంటర్ మూడో వార్షికోత్సవం, బ్రహ్మకుమారీస్ సంస్థ 90 వసంతాల వేడుకలను సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ అదనపు అధ్యక్షురాలు రాజయోగిని బీకే జయంతి దీదీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## అధిక వడ్డీ ఆశ చూపి మోసం!

**నాగార్జునసాగర్, మార్చి 18పెన్ పవర్:** పేదల అమాయకత్వాన్ని పెట్టుబడిగా పెట్టి పలువురిని నమ్మబలికించి మోసం చేసిన భీమానాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగార్జునసాగర్ సీఐ శ్రీనునాయక్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దవూర మండలం పాల్తితండాకు చెందిన పాల్తి కోటేష్ ఈనెల 7న తాను డబ్బులు చెల్లించి మోసపోయినట్లు పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మోసం వెలుగులోకి వచ్చింది. డిండి మండలం హజ్యతండాకు చెందిన భీమానాయక్ తన అనుచరులు శేఖర్‌బాబు, రమేష్, సురేష్‌లతో ఒక టీంను ఏర్పాటు చేసుకొని హైదరాబాద్‌లో ఎస్‌బీవీ గ్రీన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్, బీకాయిన్ వరల్డ్ డెవలపర్స్ పేర్లతో నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ వెబ్‌సైట్ ఏర్పాటు చేశారు. కొంతకాలంగా వ్యాపారం కొనసాగిస్తూ రూ.40కోట్ల వరకు మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది.

## వారం వడ్డీ ముఠా గుట్టురట్టు

**కామారెడ్డి, మార్చి 18పెన్ పవర్:** వారం వడ్డీ పేరుతో నిరుపేదలను మోసం చేస్తున్న ముఠా ఆగడాల గుట్టును కామారెడ్డి పట్టణ పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని సత్తి సాయిరామ్, తలారి రాజు అనే ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా పోలీసు కార్యాలయం పేరిట ఓ ప్రకటన విడుదల చేశారు. వీరిద్దరూ బ్యాంకుల వద్ద మాటు వేసి అత్యవసరంగా రుణాలు కావాల్సిన ఆటోడ్రైవర్లను, నిరుపేదలను, రైతులను లక్ష్యంగా చేసుకొని అప్పులు ఇస్తామంటూ ఆశచూపుతారు. ముందస్తుగానే వడ్డీ పేరుతో నగదును వసూలు చేస్తూ.. ఈ ముఠా వంచనకు పాల్పడుతోంది. వీరు కామారెడ్డిలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సైతం ఈ వడ్డీ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

## పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**ఆర్మూర్, మార్చి 18 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ప్రశాంత వాతావరణం, భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, విద్యార్థుల హాజరు శాతం వంటి అంశాలపై ఆరా తీశారు.

## విదేశీ లింకులతో డ్రగ్స్ నెట్‌వర్క్ !

**కుత్బుల్లాపూర్, మార్చి 18పెన్ పవర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు డ్రగ్స్ దందాపై ప్రత్యేక దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో సుమారు 76.77 గ్రాముల కొకైన్, 200 గ్రాముల ఓజి కుష్ (హైబ్రీడ్ గంజాయి)తో పాటు ఒక ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇంజోత్ సింగ్ నగపాల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**సికింద్రాబాద్, మార్చి 18 పెన్ పవర్:** సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జెమిని (19) అనే ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం, జగదీష్ అనే యువకుడు తన కుమార్తెను వేధిస్తున్నాడని, ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు దాడి చేశాడని ఆరోపించారు. ఈ సంఘటనతో భయపడి జెమిని ఆత్మహత్య చేసుకుందని ఆమె పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదించి పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాత్రిపూట యాడ్లపై జరాభద్రం

**హైదరాబాద్, మార్చి 18, పెన్ పవర్:**
అమాయక ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు రకరకాల పన్నాగాలు పన్నుతున్నారు. టెక్నాలజీ పెరిగిన కొద్దీ అప్‌గ్రేడ్ అవుతూ.. సరికొత్త పద్ధతుల్లో మోసాలు చేస్తున్నారు. ఇక పెళ్లి కాని యువకులు, మహిళల బలహీనత ఉన్న వారే టార్గెట్‌గా ప్రస్తుతం సైబర్ కేటుగేళ్లు కొత్త కొత్త మార్గాల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మహిళల పేరుతో వల వేసి.. దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఒంటరిగా ఉండే యువకులే లక్ష్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)సాయంతో మహిళలు మాట్లాడుతున్నట్లుగా వీడియోలు విడుదల చేసి.. పురుషులను బుట్టలో పడేసి డబ్బులు దండుకుంటున్నారు. ఇలాంటి మోసాల పట్ల హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలోనే గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న యాడ్ మోసాలపై సజ్జనార్ క్లారిటీ ఇచ్చారు. యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఊరించి.. అకౌంట్లు ఖాళీ చేస్తారని హెచ్చరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ ఎక్స్ వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం.. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు.“ అంటూ సోషల్ మీడియాలో ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్న ఈ యాడ్స్ వెనుక ఉన్నది తీయటి మాటలు కాదు.. నిలువునా దోచేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు.యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళు పన్నుతున్న హనీట్రాప్ ఇది. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదు. అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలు. మాయమాటలకు బుట్టలో పడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చుకున్నట్లే. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయిఇక రాత్రిపూట సరదాగా మాట్లాడుదమని వీడియో కాల్ చేస్తే.. అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారు. ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ బ్లాక్‌మెయిలింగ్ సెక్స్‌టార్షన్ కు దిగుతారు. పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయం. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్
తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు కారు.. ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువు లాగేసే భారీ కుట్ర దాగి ఉందని గ్రహించాలి. క్షణికావేశంలో గుర్తుతెలియని ఫేక్ డేటింగ్, వీడియో కాలింగ్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దు. రాత్రి వేళల్లోనే ఈ యాడ్స్ దర్శనమిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండండి. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా ఇలాంటి సైబర్ వలలో చిక్కుకుంటే, పరువు పోతుందేమో అని భయపడకండి. వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయండి లేదా http://cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి. బీ అలర్ట్‘ అని సజ్జనార్ ట్వీట్ చేశారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నేలకొరిగిన మొక్కజొన్న పంట

**నర్సాపూర్, మార్చి 18 పెన్ పవర్:** మెదక్ జిల్లా, పెద్ద శంకరంపేట మండలం కొలపల్లిలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతలను తీవ్రంగా నష్టపరిచాయి. కోత దశకు చేరుకున్న మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరగడంతో రైతులు ఆర్థికంగా చితికిపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పంట నష్టాన్ని అంచనా వేసి, ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ఈ అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి.

## పంట పొలాలకు నీళ్లు విడుదల చేయాలని రైతుల నిరసన

**మక్తల్, మార్చి 18 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం మాగనూరు మండలం కోల్పూరు గ్రామంలోని మూడమల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు నీళ్లు తరలించాలని బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ప్రాజెక్టు కింద 5 గ్రామాల్లోని 1700 ఎకరాలకు నీళ్లు అందుతాయని, యాసంగి పంటకు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయని, వెంటనే ప్రాజెక్టులోకి నీళ్లు తరలించి పంటలకు తాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు.

## జిల్లా కేంద్రంలో భారీ ట్రాఫిక్ జామ్.!

**గద్వాల, మార్చి 18 పెన్ పవర్:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బుధవారం పాత బస్టాండ్ నుంచి డికే అరుణమ్మ బాంగ్లా వరకు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీనితో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు చొరవ తీసుకుని ట్రాఫిక్ నియంత్రించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

## కురుమూర్తి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

**దేవరకద్ర, మార్చి 18 పెన్ పవర్:** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి స్వామి ఆలయం అమావాస్య, ఉగాది పర్వదినాల నేపథ్యంలో బుధవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, దాసంగాలు, మొక్కులు సమర్పించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. రేపు కూడా భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉంది.

## పిడుగుపడి పాడి ఆవు మృతి!

**జడ్చర్ల, మార్చి 18 పెన్ పవర్:** మహబూబ్ నగర్ జిల్లాలో బుధవారం పిడుగుపాటుతో ఒక పాడి ఆవు మృతి చెందిన విషాదకర సంఘటన చోటు చేసుకుంది. జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామపంచాయతీ పరిధిలోని కిచ్య నాయక్ తండా గ్రామానికి చెందిన పాట్లవత్ మోహన్ అనే రైతుకు చెందిన ఆవు ఈ దుర్ఘటనలో మరణించింది. సాయంత్రం తన పొలంలో కట్టేసి ఇంటికి వెళ్లిన రైతు, ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా, పిడుగు పడి ఆవు చనిపోయి ఉండటాన్ని గమనించాడు. ఈ ఘటన ఆ రైతును తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**నాగర్‌కర్నూల్, మార్చి 18 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన జమ్ముల తిరుపతయ్య గత కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ. 44వేల నగదు మంజూరైంది. ఈ చెక్కును బుధవారం జూపల్లిలో జిల్లా ఉపాధ్యక్షుడు నాకినమోని వెంకటయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధితుడికి అందజేశారు.

## మైభారత్ వాలంటీర్ల భర్తీకి పచ్చజెండా




**మహబూబ్‌నగర్, మార్చి 18 పెన్ పవర్:** కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైభారత్ వాలంటీర్ల నియామకానికి అనుమతి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో వాలంటీర్ల నియామకం ఆగిపోవడంతో మూడేళ్లుగా యువజన సంఘాల కార్యకలాపాలు సాగడం లేదు. యువశక్తిని వినియోగించుకొని దేశప్రగతిలో భాగస్వాములు చేసేందుకు భారత ప్రభుత్వం ప్రతి జిల్లాలో మైభారత్ కేంద్రాలు నిర్వహిస్తోంది. వాలంటీర్ల ద్వార గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యువజన సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సామాజిక రుగ్మతలను పారదోలి ప్రజలను చైతన్యం చేసేందుకు వీరు వివిధ కార్యక్రమాలు చేపట్టాలి. యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది.

## నిరుద్యోగ యువతకు రాయితీ రుణాలు

**వనపర్తి, మార్చి 18 పెన్ పవర్:** మహబూబ్‌నగర్ జిల్లాలో యువతకు రాయితీ రుణాలు అందించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ప్రణాళిక సిద్ధం చేసింది. 2025 -26 ఏడాదికి షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగులకు చేయూతనందించి వారు ఆర్థిక పురోగతి సాధించే లక్ష్యంతో పలు రకాల యూనిట్లు అందించనుంది. అయితే సంబంధిత బ్యాంకుల నుంచి అనుమతి పత్రాలు (బ్యాంకు లింకేజీ) సమర్పించాల్సి ఉంటుంది. వారికే ఈ రాయితీ యూనిట్లు మంజూరవుతాయి.

# డ్రగ్స్ కథా చిత్రమ్... రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు.. మత్తు పార్టీలు!

**హైదరాబాద్, మార్చి 18, పెన్ పవర్:**
హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ కేసు కొత్త మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో డ్రగ్స్ పాజిటివ్‌గా తేలిన వారికి గతంలోనూ డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఆయన స్నేహితుడు నమిత్‌శర్మలకు ఇటీవల నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో పార్టీలో వాడిన కొకైన్‌తో పాటు మరికొన్ని డ్రగ్స్ అవశేషాలు లభించడం సంచలనం రేపుతోంది. దాంతో వీరికి గతంలోనే డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉందని డ్రగ్స్ రిపోర్ట్ బలపరుస్తున్నాయి. దాంతో వీరి డ్రగ్స్ అలవాటుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పార్టీలో పాల్గొన్న 11 మందిలో ఆరుగురికి డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ శాంపిల్స్ లోనూ యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ లభించాయి. ముఖ్యంగా పోలీసులపై కాల్పులు జరిపిన నమిత్‌శర్మ నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు గుర్తించారు. శనివారం నాటి పార్టీలో కేవలం కొకైన్ మాత్రమే వాడినట్లు ప్రాథమికంగా తేలినప్పటికీ, వీరి రక్తంలో ఇతర డ్రగ్స్ ఆనవాళ్లు ఉండటం చూస్తుంటే, వీరు గతంలోనూ ఇతర డ్రగ్స్ సేవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.మరోవైపు, బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి తాను శిమ్లా నుంచి రూ. 15 వేల విలువైన కొకైన్ తెచ్చానని ఒప్పుకున్నాడు. అయితే, పోలీసులు స్వాధీనం 0.26 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ పాజిటివ్ గా తేలిన వారు అప్పటికే కొకైన్ వాడారని, కౌశిక్ రవి చెప్పిన దానికంటే ఎక్కువ మొత్తంలోనే డ్రగ్స్ తెచ్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అయితే శిక్ష నుంచి తప్పించుకునేందుకు తక్కువ మోతాదులో డ్రగ్స్ తెచ్చినట్లు తెలుస్తోంది. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు పాత రికార్డులను పరిశీలిస్తున్నారు. ఒకరు బెంగళూరుకు చెందిన లాయర్, మరొకరు రాజస్థాన్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఏలూరు ఎంపీ, తాండూరు మాజీ ఎమ్మెల్యే ఇలా పలు రాష్ట్రాలు, పలు వృత్తుల్లో ఉన్నవారు మత్తు పార్టీలతో ఫ్రెండ్స్ అయినట్లు పోలీసుల విచారణలో తేలింది. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో ఓ మహిళ సహా 11 మందిని మొదట అదుపులోకి తీసుకున్నారు. అయితే వీరంతా వేరే ప్రొఫెషన్ లో ఉన్నప్పటికీ రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్ల కోసమే తరచూ కలుస్తుంటారని, ఈ క్రమంలో డ్రగ్స్ పార్టీకి ప్లాన్ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో మొత్తం 11
మందిని నిందితులుగా చేర్చారు. ఇందులో ఏ-1గా నమిత్ శర్మ కాగా, ఏ-2గా రోహిత్ రెడ్డి, ఏ-3గా రితేష్ రెడ్డి సహా మొత్తం నిందితులపై ఎన్డీపీఎస్ చట్టంతో పాటు ఆర్మ్స్ యాక్ట్, తెలంగాణ ఎక్సైజ్ చట్టం, భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మార్చి 14 తెల్లవారుజామున నిందితులను అరెస్ట్ చేయగా 8 మంది బెయిల్ రావడంతో విడుదలయ్యారు. రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్ గూడ జైలుకు తరలించారు.

# జగ్గారెడ్డికి పీసీసీ సాధ్యమేనా

**హైదరాబాద్, మార్చి 18, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అంతర్గత పరిణామాల్లో ఎప్పుడూ ఏదో ఒక ఆసక్తికర చర్చ జరుగుతూనే ఉంటుంది. తాజాగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. టీపీసీసీ అధ్యక్ష పదవికి జగ్గారెడ్డి సరైన అభ్యర్థి అని, ఆయనకు ఆ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు.అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. “జగ్గారెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించాలి. ఆయన ఒక మాస్ లీడర్. ప్రజల్లో ఉంటూ, ప్రజల కష్టాలను తీర్చే నాయకుడు” అని ఆయన పేర్కొన్నారు. కేవలం కోమటిరెడ్డే కాకుండా, మరో సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గతంలో జగ్గారెడ్డిపై ప్రశంసలు కురిపించడం గమనార్హం.జగ్గారెడ్డిని కోమటిరెడ్డి 'మరో పీజేఆర్' అని అభివర్ణించారు. హైదరాబాద్ రాజకీయాల్లో పీజేఆర్ ఎలాగైతే పేదల పెన్నిధిగా పేరు తెచ్చుకున్నారో, జగ్గారెడ్డి కూడా అదే తరహాలో ఆపదలో ఉన్నవారికి తక్షణమే స్పందిస్తారని కోమటిరెడ్డి చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉండేవారికి ప్రజలతో మమేకమయ్యే గుణం ఉండాలని, అది జగ్గారెడ్డిలో పుష్కలంగా ఉందని ఆయన వాదన.జగ్గారెడ్డికి పీసీసీ పగ్గాలు అప్పగిస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా 100 సీట్లు వస్తాయని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కేడర్‌ను ఉత్సాహపరచడంలో, ప్రత్యర్థులపై గట్టిగా విరుచుకుపడటంలో జగ్గారెడ్డికి ప్రత్యేక శైలి ఉంది. ఈ దూకుడు



స్వభావం పార్టీకి క్షేత్రస్థాయిలో మేలు చేస్తుందని సీనియర్ నేతలు భావిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు కొత్తేమీ కాదు. అయితే, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి ఉద్ధండులు జగ్గారెడ్డి పేరును ప్రతిపాదించడం వెనుక ఒక వ్యూహం కనిపిస్తోంది. సీనియర్లందరినీ కలుపుకుని పోయే సత్తా, అదే సమయంలో అధిష్టానం వద్ద గట్టిగా మాట్లాడగలిగే చొరవ జగ్గారెడ్డికి ఉన్నాయని వారు నమ్ముతున్నారు.పీసీసీ అధ్యక్షుడి ఎంపిక అనేది పూర్తిగా ఏఐసీసీ పరిధిలోని అంశం. పైగా ఇటీవలే మహేశ్ కుమార్ గౌడ్ కు పీసీసీ పగ్గాలు అప్పగించింది అధిష్టానం. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యే వరకూ పీసీసీ పీఠం రేవంత్ రెడ్డి దగ్గర ఉండేది. ఆ తర్వాత మహేశ్ గౌడ్ కు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పీసీసీని మారుస్తారని ఆశించడం అత్యాసే అవుతుంది. అయితే కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లాంటి నేతలు జగ్గారెడ్డి కోసం ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతోంది.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు వరకూ ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకించారు జగ్గారెడ్డి. ఆయనపై ఎన్నోసార్లు నేరుగా విమర్శలు కూడా గుప్పించారు. అలాంటి వ్యక్తికి రేవంత్ రెడ్డి సీఎంగా ఉండగా పీసీసీ బాధ్యతలు అప్పగిస్తారా అనేది అనుమానమే.పైగా సీఎం సీట్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉన్నప్పుడు, పీసీసీని మరో రెడ్డి ఇస్తారని ఆశించడం కూడా అత్యాశే. కాబట్టి ఇప్పటికిప్పుడు పీసీసీలో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. కాలం కలిసొస్తే జగ్గారెడ్డికి ఎమ్మెల్సీ లేదా సలహాదారు పదవి లాంటివి ఇవ్వొచ్చేమో కానీ పీసీసీ మాత్రం దక్కకపోవచ్చు.మొత్తానికి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త చర్చకు తెరలేపాయి. జగ్గారెడ్డిని 'మానవత్వం ఉన్న మనిషి'గా, 'ధైర్యవంతుడైన నాయకుడి'గా చిత్రించడం ద్వారా ఆయనకు పార్టీ పగ్గాలు అప్పగించాలనే డిమాండ్‌ను కోమటిరెడ్డి బలంగా వినిపించారు. అయితే.. ఇప్పట్లో ఆయన కోరిక నెరవేరకపోవచ్చు.

# ఫేజ్ 1కు 7వేల కోట్ల అంచనా

**హైదరాబాద్, మార్చి 18, పెన్ పవర్:**
మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ నదిపై తొమ్మిది వంతెనలను నిర్మిస్తుంది. ఇప్పటికే ఉన్న ఐదు వంతెనలను అప్‌గ్రేడ్ చేస్తుంది. అలాగే ప్రణాళిక ఫేజ్ 1లో భాగంగా మూడు నీటి నిలుపుదల బ్యారేజీలను నిర్మిస్తుందని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో పేర్కొంది. ఫ్రంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహ రెడ్డి సమర్పించిన ప్రతిపాదనలు.. ఓఆర్ఆర్ పరిమితుల్లోని నది ప్రతిపాదిత 55 కిలోమీటర్ల విస్తీర్ణంలో 21 కిలోమీటర్లను రెండు జోన్ లుగా విభజించాయి. కొన్ని నిర్మాణాలు తక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు అని, వీటిని పైకి ఎత్తాల్సిన అవసరం ఉందని, దానిని కూడా ప్రాజెక్ట్ కింద తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.ఉస్మాన్‌సాగర్ నుండి తూర్పు వైపు ఉత్తర ఒడ్డున ఉన్న జోన్ 1బీ, కొత్త నిర్మాణాలలో ఎక్కువ భాగాన్ని కలిగి ఉంది. ఇందులో ఆరు వంతెనలు ఉన్నాయి. గండిపేట వంతెన రిజర్వాయర్ అంచున నిర్మిస్తారు. గోశాల నుండి గ్రేహౌండ్స్‌కు క్రాసింగ్ వంతెన, నర్సింగ్గి వద్ద ఓఆర్ఆర్‌పై వంతెన, జోన్ మధ్య భాగంలో బైరాగిగూడ వంతెన, రామ్‌దేవ్‌గూడ వంతెన, మూసా సమీపంలోని గాంధీ సరోవర్ వద్ద వంతెన పనులు జరుగుతున్నాయి.జోన్ 1డీ లోని రెండు వంతెనలను అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదించారు: ఒకటి మంచిరేవుల వద్ద మరియు మరొకటి ఇబ్రహీం చెరువు వద్ద, ఇవి తక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు. హిమాయత్‌సాగర్ వైపున ఉన్న దక్షిణ కారిడార్ అయిన జోన్ 1ా లో, దిగువ ా== స్ట్రెచ్ వెంబడి బుద్వేల్ వద్ద, మధ్య జోన్ వద్ద గాంధీ సరోవర్ వద్ద, ఈ కారిడార్ తూర్పు చివరన బాపు ఘాట్ సమీపంలో కొత్త వంతెనలు ప్రతిపాదించారు. జోన్ 1ఏ లోని మూడు వంతెనలు అప్‌గ్రేడేషన్ కోసం నిర్ణయించారు. ఇందులో వెస్ట్ సైడ్ ఓఆర్ఆర్ వంతెన, ఉప్పర్‌పల్లి, కిస్మత్‌పూర్ వద్ద నిర్మాణాలు ఉన్నాయి.ఈ వంతెనలు వాహన, మల్టీమోడల్, పాదచారుల రాకపోకలను తీసుకెళ్లడానికి రూపొందించారు. డీపీఆర్ కారిడార్ అంతటా వర్తించే ఒకే ప్రామాణిక డిజైన్ కంటే వివిధ క్రాసింగ్‌లకు సరిపోయే వంతెన రకాల కలయికను వివరిస్తుంది. వంతెనల నుండి వేరుగా మూడు నీటి నిలుపుదల బ్యారేజీలను కూడా ప్రతిపాదించారు. ఈ బ్యారేజీలు ఏడాది పొడవునా నీటిని నిలుపుకునేలా రూపొందించారు. 'ఈ నది వెంట నీరు ఎల్లప్పుడూ ఉంటుంది. ఇది పర్యాటకాన్ని మెరుగుపరుస్తుంది, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తుంది, కార్యకలాపాలను మెరుగుపరుస్తుంది.
ఈ ప్రత్యేక ప్రాంతంలోని ప్రతిదానినీ పెంచుతుంది.‘ అని నరసింహ రెడ్డి అన్నారు.ఈ బ్యారేజీలు వంతెన నెట్‌వర్క్ పక్కన పనిచేయడానికి ఉంచారు. ఒకటి కిస్మత్‌పూర్-బుద్వేల్ స్ట్రెచ్ వద్ద, మరొకటి జోన్ 1ఏ లోని బాపు ఘాట్ వంతెన దగ్గర ఉంటాయి. జోన్ 1బీలో ఇది మంచిరేవుల వంతెన దగ్గర ప్రతిపాదించారు. 21 కిలోమీటర్ల ఫేజ్ 1 స్ట్రెచ్ అన్ని భాగాలలో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.6,500 కోట్ల నుండి రూ.7,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా

# కాకలుతీరిన కమ్యూనిస్టు యోధుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** నంబూద్రిపాద్ భారతీయ కమ్యూ నిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రాజకీయవేత్త, సిద్ధాంతకర్త. దేశ చరిత్ర లో గుర్తింపు పొందిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు. భారత దేశంలో కాంగ్రెసేతర సంబంధిత కమ్యూనిస్టు పార్టీ పక్షాన ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా వినుతి కెక్కారు. మార్క్సి వాద సూత్ర బద్ధుడు, విప్లవవాది, రచయిత, చరిత్ర కారుడు. మార్క్సి వాద కమ్యూనిస్టు పార్టీ ఆచరణ వాదిగా, క్రియా శీలక నేతగా, 14 యేళ్ళ పాటు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన తీసుకున్న చొరవ, ముందు చూపు గల నిర్ణయాలవలనే దేశంలో ఈనాడు జాతీయ స్థాయి సంకీర్ణ ప్రభుత్వ రాజకీయాలకు భూమిక అయిందన్న మాట వాస్తవం. నంబూద్రిపాద్ కేరళలో శ్రీకారం చుట్టిన మౌలికమైన భూ సంస్కరణలు, విద్యా సంస్కరణ లను అనుకరించే ప్రయత్నాలు ఈ నాటికి ఇతర భారతీయ రాష్ట్రా లలో జరుగుతూనే ఉన్నాయి. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం కలిగి ఉన్నా, భూస్వామి కుటుంబంలో పుట్టినా శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై శ్రామిక విప్లవ ఉద్యమంలో అగ్ర నాయకుడిగా ఎదిగారు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ బహు ముఖ ప్రజ్ఞాశాలి, మార్క్సిస్టు రుషి, నిరంతర క్రియాశీలి. అవిశ్రాంత కలం యోధులు. సాహితీ విమర్శ కులు. సాంస్కృతిక సైనికుడు. పాలనా చతురులు. సిద్ధాంత, ఆచరణల సంగమం. విప్లవ మేధావి. భావితరాలకు చెరగని ఆదర్శం. ఒకనాటి భారత రాష్ట్ర పతి కెఆర్ నారాయణన్ అభివర్ణించి నట్లుగా 20వ శతాబ్దపు మహోన్నత వ్యక్తి. ఇ.ఎం.ఎస్. అనే పేరుతో ప్రసిద్ధి కెక్కిన ఏలాంకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్, (1909 జూన్ 13 ? 1998 మార్చి 19) 1909 జూన్ 13 నాడు, ప్రస్తుత మలప్పురం జిల్లా పెరింతాళ్ మన్న తాలూకా ఏలాంకుళం గ్రామంలోని అగ్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తండ్రి పేరు పరమేశ్వరన్ నంబూద్రిపాద్. విద్యార్థి దశనుంచే శాస్త్రీయ భావాలు అలవరుచు కున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. చిన్న వయసులోనే ఆయన వి.టి.భట్టాద్రిపాద్ మొదలయిన పెద్దవారికి చేయూతగా, కేరళ నంబూద్రి కుటుంబాలలో పాతుకు పోయిన కులవివక్ష, సాంప్రదాయ వాదం ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు. చదువుకునే రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ సహ చర్యంతో స్వాతం త్ర్య సంగ్రామంలో తీవ్ర కృషి చేసారు. 1931 లో కాలేజీని వదిలి స్వాతం త్ర్య పోరాటంలో చేరారు. సత్యా గ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అప్పటినుంచి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన కాంగ్రెస్ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారు. కేరళలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకరుగా వున్నారు. 1934 లో ఆయన కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు పార్టీ అఖిల భారత ఉమ్మడి కాలంలో కాంగ్రెస్ పార్టీకి, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మార్క్సిజంతో పరిచయం చేశారు. 1936 లో కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపక బృందాన్ని ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల్లో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ కేరళలో ఒక శక్తివంతమైన కమ్యూనిస్ట్ ఉద్య మం అభివృద్ధికి పునాదులు వేశా రు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం. రెండు పోరాటాలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. కేరళను ఏకీకృత భాషా రాష్ట్రంగా ఏర్పర్చడానికి దారితీసిన ఐక్య కేరళ ముఖ్య ప్రతిపాదకులలో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ మొట్టమొదట 1939 లో మద్రాసు ప్రొవిన్షియల్ శాసనసభకు ఎన్నికయ్యారు. కమ్యునిస్ట్ పార్టీని విస్తృత పరచడానికి ఆయన తన వాటగా వచ్చిన ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చాడు. అతను 1939–42 మరియు 1948–50 మధ్య అజ్ఞాతం లోకి వెళ్ళారు. ఆయన 1941 లో భారత కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. డిసెంబరు, 1950 లో సిపిఐ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెక్రటేరియట్ సభ్యునిగా పనిచేశారు. 1957 లో కేరళ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి ఎన్నిక లలో కమ్యూనిస్ట్ పార్టీ మెజారిటీ సాధించడంతో 1957 ఏప్రిల్ 5 నాడు కేరళ రాష్ట్ర ప్రథమ ముఖ్య మంత్రిగా పగ్గాలు చేపట్టి భారత దేశంలో మొట్టమొదటి కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. త్వరలోనే భూ సంస్కరణల చట్టాన్ని, విద్యా చట్టాన్ని తీసుకు వచ్చారు. వివాదాస్పదమైన పరిస్థి తుల్లో 1959 లో కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం లోని 356 వ ప్రకరణం అనుసరించి రాష్ట్రపతి పాలన విధిస్తూ ఆ ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. కేరళ శాసన సభకు 1960–64, తిరిగి 1970–77 కాలం లో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహ రించారు. 1967 లో రెండవసారి ముఖ్యమంత్రి కావడానికి నంబూ ద్రిపాద్ ముస్లిమ్ లీగ్ తో సహా 7 పార్టీల మద్దతు స్వీకరించారు. 1964 లో సిపిఐ (ఎం) ను స్థాపించిన తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అందులో చేరారు. 1964 లో జరిగిన అఖిల భారత మహాసభలో పార్టీలో కేంద్ర కమిటీ మరియు పార్టీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆయన మరణం వరకు ఈ పదవిలో కొనసాగారు. 1977 లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా పదవిని చేబట్టి 1992 వరకు ఆ బాధ్యతలను నిర్వహిం చారు. అన్ని వామపక్ష, ప్రజాస్వా మ్య, లౌకిక శక్తులను సమీకరిం చడంలో ఆయన నాయకత్వం అమూల్యమైనది.

ఒక తెలివైన మార్క్సిస్ట్ సిద్ధాంత కర్తగా, భారతీయ సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం – లెనినిజం అన్వయించడంతో పాటు భారతీ య విప్లవం యొక్క వ్యూహానికి అనుగుణంగా సాగించాల్సిన, సాగించిన కృషిని ఆయన రచించారు. ఆయన వ్రాసిన పలు గ్రంథాలలో కేరళ చరిత్ర అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. భూమి సంబంధాలు, కేరళ, సమా జం, రాజకీయాలు, మార్క్సిస్టు తత్వశాస్త్రం, సాహిత్యం మరియు చరిత్రలపై ఆయన వ్రాసిన రచనల తో ఆయన్ను దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రభావ వంతమైన కమ్యూనిస్టు ఆలోచనా పరులలో ఒకరిగా గుర్తించ బడ్డాయి. విశిష్ట మార్క్సిస్ట్ సూత్రవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఆయన ముందు చూపుకు నిజాయితీ నిబద్ధతలకు కేరళ సాధించిన అభివృద్ధే తార్కాణం. ప్రజల యోజన ద్వారా కేరళలో అధికార, వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యతా ఉద్యమానికి కృషి చేసారు. ఆంగ్ల, మలయాళ భాషల్లో అనేక పుస్తకాలు రచించిన నంబూద్రిపాద్ పత్రికా విలేఖరిగా కూడా సుపరిచితుడే. ఈ నాటికీ కేరళలో ఆయన పేరు, ఒకప్పటి ఈయన ప్రభుత్వ పనితీరుల గుఱించి దినదినం గొప్పగా చెప్పుకుంటూనే ఉంటారు. నంబూద్రిపాద్ 1998 మార్చి 19 న మరణించారు.

# యువతి మృతి..ప్రేమోన్మాది దాడని కుటుంబికుల ఆరోపణ

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రేమోన్మాది ఘాతుకానికి మరో యువతి బలైన ఘటన సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీనివాస్ నగర్ లో నివాసం ఉంటున్న రమాదేవి, కోటేశ్వరరావు కూతురు జెనీమా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. అయితే ఇటీవల పరిచయమైన జగదీష్ అనే యువకుడు తన కూతురును వేధించడని తల్లి రమాదేవి తెలిపింది. వేధింపులతో ఆగకుండా ఈ రోజు ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న తన కుతురుపై దాడి చేశాడని తెలిపింది. మళ్ళీ తన దగ్గరకు వచ్చి తన కూతురు ఇంట్లోకి వెళ్లి తలుపు పెట్టుకుంది తలుపులు తీయడం లేదని ఇంటికి తీసుకు వచ్చాడని చెప్పింది. ఇంట్లోకి ప్రవేశించి ఉరి వేసుకొని వేలాడుతున్నా తమ కుతురును కిందకు దించి సిపీఆర్ చేశామని పేర్కొంది. అప్పటికి బ్రతికే ఉందని అంబులెన్స్ రావడం ఆలస్యం అవ్వడంతో స్థానికుల సహాయంతో ఆటోలో గాంధీకి తరలించామని కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని వెల్లడించింది. తన కూతురును జగదీష్ విపరీతంగా కొట్టిన గాయాలు శరీరంపై ఉన్నాయని తెలిపింది. తన ఒక్కగానొక్క కూతురును మృతికింకారణమైన జగదీష్ పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.


# కేసీఆర్ వస్తేనే అసెంబ్లీలో రేవంత్‌కు అసలు సవాల్ !






**హైదరాబాద్, మార్చి 18, పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ ప్రజాస్వామ్య చర్చలు జరుగుతున్నా..ఏదో లోటు కనిపిస్తోంది. సమఉజ్జీల మధ్య పోరు సాగితేనే ఆసక్తికరంగా ఉంటుంది. హరీష్ రావు, కేటీఆర్ వంటి వారికి కాంగ్రెస్ మంత్రులు జోరుగా సమాధానం ఇస్తున్నారు. హరీష్ కు గతంలో రేవంత్ సమాధానం ఇచ్చేవారు కానీ.. కేటీఆర్ ఇంకా మంత్రుల దాడినికూడా తట్టుకోలేకపోతున్నారు. అసలు హోరాహోరీ పోరు అనేది కేసీఆర్ సభకు వచ్చినప్పుడే ఉంటుంది. ఆయన ప్రసంగాలు.. రేవంత్ కౌంటర్లు.. చూస్తే పాత కాలం గుర్తుకు వస్తాయి. కానీ కేసీఆర్ రావడం లేదు. తెలంగాణ అసెంబ్లీ అంటేనే ఒకప్పుడు మేధోమథనం, చురకలు, గంభీరమైన ప్రసంగాలకు నిలయం. కేసీఆర్ మార్కు రాజకీయ వ్యూహాలు సభలో ప్రత్యేకం. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో హరీష్ రావు, కేటీఆర్ వంటి హేమాహేమీలు ప్రతిపక్షం నుంచి గళమెత్తుతున్నప్పటికీ, ఎక్కడో ఒక వెలితి స్పష్టంగా కనిపిస్తోంది. హరీష్ రావు వేసే ప్రశ్నలకు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు ధీటుగానే బదులిస్తున్నా, సభలో ఉండాల్సిన ఆ హోరాహోరీ పోరు మాత్రం మిస్ అవుతోంది. కేటీఆర్ సైతం మంత్రుల సమిష్టి దాడిని తట్టుకోవడంలో అప్పుడప్పుడూ ఇబ్బంది పడుతుండటం గమనార్హం. నిజానికి సభలో అసలైన సమరమంటే.. అది కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డి అన్నట్లుగా ఉండాలి. వీరిద్దరి మధ్య సాగే వాదోపవాదాలు, పరస్పర కౌంటర్లు పాత రోజుల్లోని దిగ్గజ నేతల మధ్య పోరును గుర్తుకు తెస్తాయి. కేసీఆర్ తనదైన శైలిలో గణాంకాలను వల్లెవేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, దానికి రేవంత్ రెడ్డి అంతే వేగంగా గన్ మార్క్ సమాధానం ఇవ్వడాన్ని అందరూ కోరుకుంటారు. సమఉజ్జీల మధ్య పోరు సాగితేనే ప్రజాస్వామ్య చర్చలు ఆసక్తికరంగా ఉంటాయన్నది కాదనలేని వాస్తవం. రోజులు గడుస్తున్న కొద్దీ కేసీఆర్ రాకపై అంచనాలు కూడా మసకబారుతున్నాయి. ప్రారంభంలో ఆయన ఎప్పుడు వస్తారా అని ఎదురుచూసిన రాజకీయ వర్గాలు, ఇప్పుడు ఆయన గైర్హాజరీని ఒక అలవాటుగా మార్చుకున్నాయి. కేసీఆర్ రావడం లేదనే విషయాన్ని అధికార పక్షం లైట్ తీసుకుంటుండగా, ప్రతిపక్షం కూడా ఆయన లేకుండానే నెట్టుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. ప్రజాస్వామ్యంలో పదునైన విమర్శలు, అంతకంటే పదునైన సమాధానాలు ఉన్నప్పుడే శాసనసభ గౌరవం పెరుగుతుంది. ఇప్పుడు మంత్రులు జోరు చూపిస్తున్నా, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అక్కడ లేకపోవడం వల్ల చర్చలు ఏకపక్షంగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేసీఆర్ మళ్లీ సభలో అడుగుపెట్టి తన గంభీర స్వరంతో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్ప, తెలంగాణ అసెంబ్లీకి ఆ పాత కళ రాదనేది విశ్లేషకుల మాట. మరి ఈ నిశ్శబ్ద విరామం ఎప్పుడు ముగుస్తుందో, ఆ హోరాహోరీ పోరు మళ్లీ ఎప్పుడు మొదలవుతుందో వేచి చూడాలి.

# బీఆర్ఎస్ పాఠాలు నేర్చుకోదా?




**హైదరాబాద్, మార్చి 18, పెన్ పవర్:**
బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం అలసత్వంతో తనకు తాను చిక్కులు కొని తెచ్చుకుంటోంది. పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో అడ్డంగా దొరికినా మీన మేషాలు లెక్కపెడుతూ ఈరోజు షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఆ పార్టీ ప్రజల్లో పలుచనగా మారిందనే చెప్పాలి. మొయినా బాద్ ఫామ్ హౌస్ అనేది పైలట్ రోహిత్ రెడ్డిది. అక్కడ పోలీసులపై కాల్పులు జరపడమే కాకుండా డ్రగ్స్ వాడారని నిర్ధారణ అయింది. ఈ డ్రగ్స్ కేసులో ఆరోపణలను ఎదుర్కొంటున్న పుట్టా మహేశ్ కు తెలుగుదేశం పార్టీ వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కానీ బీఆర్ఎస్ నేడు నింపాదిగా నోటీసులు ఇవ్వడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న బీఆర్ఎస్ అగ్రనాయకత్వం వెంటనే చర్యలు తీసుకుని ఉంటే ఈ అపవాదును ఎదుర్కొనే అవకాశం ప్రత్యర్థులకు ఇచ్చి ఉండదు. పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ పార్టీ ఉదంతం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. మొయినాబాద్ ఫామ్ హౌస్ ఘటనలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పట్టుబడటం బీఆర్ఎస్ పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. ఈ వ్యవహారంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఇది రాజకీయ కుట్ర అని అభివర్ణించడం సొంత పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు పార్టీలు తమ ప్రతిష్టను కాపాడుకోవడానికి నిందితులను దూరం పెడతాయి. కానీ, రోహిత్ రెడ్డి విషయంలో బీఆర్ఎస్ చూపుతున్న సాఫ్ట్ కార్నర్ వెనుక ఉన్న అసలు కారణాలేమిటన్నది ఇప్పుడు రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అసలే కవితతో రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ పార్టీ ఇటువంటి విషయాల్లో ఏమాత్రం వేచి చూసి ఉండకూడదు. ఈ పరిణామాలను కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకుంది. రోహిత్ రెడ్డికి, బీఆర్ఎస్ అగ్రనేతలకు మధ్య ఉన్న అంతర్గత సంబంధాల వల్లే పార్టీ ఆయనను వెనకేసుకొస్తోందని కాంగ్రెస్ బలంగా ప్రచారం చేస్తోంది. చివరకు ఏడురోజుల సమయం ఇచ్చి షోకాజ్ నోటీసు ఇచ్చినప్పటికీ అది కంటితుడుపు చర్యేనంటూ కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేస్తుండటం బీఆర్ఎస్ ను మరింత ట్రబుల్ లోకి నెట్టినట్లయింది.

## సాహితీ సేవలకు లెనిన్ శ్రీనివాస్‌కు స్వర్ణనంది పురస్కారం

**పాలేరు, మార్చి 18 పెన్ పవర్:** ఖమ్మం జిల్లాకు చెందిన సాహితీ వేత్త లెనిన్ శ్రీనివాస్‌కు 2026 ఉగాది సందర్భంగా స్వర్ణనంది పురస్కారం ప్రకటించారు. బాల, యువ కవులను ప్రోత్సహించినందుకు మోగిలి మరియు నాగసాయి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందజేస్తున్నాయి. ఈ నెల 22న రామగిరి ఫంక్షన్ హాల్‌లో పురస్కారం అందజేయనున్నారు. తనను ఎంపిక చేసిన నిర్వాహకులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

## పాము కాటు తో పసి పాప మృతి

**నర్సంపేట, మార్చి 18పెన్ పవర్:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని లావుడ్య వాగ్యానాయక్ తండా శివారు భక్య తండాలో బుధవారం 3 సంవత్సరాల పసిపాప పాము కాటుతో మృతి చెందింది. ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో పాము కాటు వేయడంతో, తల్లి గమనించేలోపే పాప అచేతనంగా పడిపోయింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషాద సంఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

## చేపలవేటకు వెళ్లి మల్లేశం మృతి

**స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 18పెన్ పవర్:** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని కంచనపల్లి గ్రామ శివారు దోనబండలో చేపలు పట్టడానికి వెళ్లిన మత్స్యకారుడు ఇలబోయిన మల్లేశం చెరువులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారులు ఉన్నారు. ఈ ఘటనతో దోనబండలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వరంగల్ కోర్టుకు బాంబు బెదిరింపు.. ముమ్మర తనిఖీలు

**వరంగల్ ఈస్ట్, మార్చి 18పెన్ పవర్:** వరంగల్ నగరంలో 5 చోట్ల మధ్యాహ్నం 2 గంటలకు బాంబు పేలుళ్లు జరుగుతాయని ఒక అజ్ఞాత ఈ–మెయిల్ జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఈ సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు, ముఖ్యంగా వరంగల్ కోర్టు పరిసరాల్లో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్స్‌తో బుధవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గతంలోనూ ఇలాంటి నకిలీ బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. సుదీర్ఘ తనిఖీల అనంతరం ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## ఉద్యాన పంటలు పథకాలపై అవగాహన సదస్సు

**భూపాలపల్లి, మార్చి 18పెన్ పవర్:** మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో ఉద్యాన పంటలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. సర్పంచ్ ఎల్పుల సరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యాన శాఖ అధికారి వై. మణి రైతులకు అవగాహన కల్పించారు. మహాదేవ్‌పూర్ డివిజన్‌లో సుమారు 250 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతోందని తెలిపారు.

## అన్వరీ బేగం అనే మహిళపై కుక్క దాడి

**వరంగల్ వెస్ట్, మార్చి 18పెన్ పవర్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుక్కల బెడద తీవ్రమవుతోంది. పాపయ్య పేట చమన్ రాజీవ్ కాలనీలో అన్వరీ బేగం అనే మహిళ బుధవారం కిరాణా షాపుకు వెళుతుండగా కుక్క ఆమె చేతిని కొరికింది. స్థానికులు ఆమెను రక్షించి, చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అధికారులు ఈ సమస్యపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## టేకుమట్లలో వృద్ధుడి అస్థిపంజరం

**వర్ధన్నపేట, మార్చి 18పెన్ పవర్:** టేకుమట్ల మండలంలోని బూర్నపల్లి శివారులో స్థానికులు ఒక వృద్ధుడి అస్థిపంజరాన్ని గుర్తించారు. మూడు నెలల క్రితం కనిపించకుండా పోయిన పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల మొట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిదిగా షర్ట్ ఆధారంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. అయితే, పోలీసులు ఈ విషయాన్ని ఇంకా ధ్రువీకరించలేదు. అస్థిపంజరం కోసం ఎవరూ పిటిషన్ ఇవ్వలేదని, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి నిర్ణయం తీసుకుంటామని ఎస్సై అమూల్య తెలిపారు.

## ఆగి ఉన్న పాఠశాల బస్సును ఢీకొన్న ట్యాంకర్

**మెదక్, మార్చి 18పెన్ పవర్:** ఆగి ఉన్న స్కూల్ బస్సును సిమెంట్ లోడుతో వెళ్తోన్న ట్యాంకర్ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 9మంది విద్యార్థులతోపాటు ఒక ఉపాధ్యాయురాలికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిన్నకోడూరు మండలంలోని ఇబ్రహీంనగర్‌లో రాజీవ్ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేటు పాఠశాల బస్సు విద్యార్థులను ఎక్కించుకోవడానికి ఇబ్రహీంనగర్ చౌరస్తా వద్ద ఆగింది. ఈ క్రమంలో అతివేగంతో వస్తోన్న సిమెంట్ ట్యాంకర్ బస్సును వెనక నుంచి ఢీ కొట్టింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థిని సరళకు తీవ్ర గాయాలయ్యాయి. మేడిపల్లికి చెందిన ఉపాధ్యాయురాలు కేశబోయిన మనూషతో పాటు మరికొందరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

## ఘనంగా నాచగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**సిద్ధిపేట, మార్చి 18పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని నాచగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీ సమేతుడైన నరసింహస్వామి వారిని రథంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మహిళల కోలాటాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఛైర్మన్ రవీందర్ గుప్తా, ఈవో రంగాచారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సాక్షమ్ వెలుగులు



**గజ్వేల్, మార్చి 18పెన్ పవర్:** అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు త్వరలో మారనున్నాయి. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను, గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించే ఈ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని అంగన్‌వాడీలను సాక్షమ్ కేంద్రాలుగా ఉన్నతీకరించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్రానికి రూ. 30.04 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. దశల వారీగా నిధులు విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందనున్నాయి.

# తడిసిన కంది పంటను కొనుగోలు చేయాలి

**బోథ్, మార్చి 18 పెన్ పవర్:** జైనథ్ మార్కెట్ యార్డులో బుధవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి రైతుల కంది పంట తడిసిపోయింది. బీఆర్ఎస్ నాయకులు యార్డును సందర్శించి, నష్టపోయిన రైతులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత పిడుగు స్వామి యాదవ్ మాట్లాడుతూ, ఎలాంటి ఆంక్షలు లేకుండా తడిసిన కందిపంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మినీ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేస్తా:

**నిర్మల్, మార్చి 18 పెన్ పవర్:** నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం అభివృద్ధికి మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి హామీ ఇచ్చారు. బుధవారం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్, కౌన్సిలర్లను సన్మానించారు. ఈ సందర్భంగా, వాకర్స్ కోసం లైటింగ్ ఏర్పాట్లు చేస్తామని, క్రీడాకారులను ప్రోత్సహించడానికి మరో స్టేడియం ఏర్పాటు కోసం ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తానని తెలిపారు.

## ప్రతిభ కనబర్చిన నిర్మల్ జిల్లా విద్యార్థులు

**ముథోల్, మార్చి 18 పెన్ పవర్:** విడుదలైన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండలకేంద్రంలోని ఓ పాఠశాల విద్యార్థి అవదుత్‌వార్ గణేశ్ కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యారు. అదేవిధంగా, మరొక పాఠశాలకు చెందిన శ్రీబిందు, సొప్పరి పూజ కూడా నవోదయ విద్యాలయంలో చదివేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## అవినీతి కేసులో ఎక్సైజ్ సీఐ రాము అరెస్ట్

**కరీంనగర్, మార్చి 18 పెన్ పవర్:** అవినీతి ఆరోపణలపై కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ రామును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. గతంలో సిరిసిల్లలో పనిచేస్తున్నప్పుడు అవినీతికి పాల్పడినట్లు ఏసీబీకి ఆధారాలు లభించాయి. ఈ నేపథ్యంలోనే సీఐ రామును అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## కరీంనగర్ లో ఎస్సై భార్య ఆత్మహత్య

**మానకొండూరు, మార్చి 18 పెన్ పవర్:** కరీంనగర్ టూ టౌన్ లో ఎస్సైగా పనిచేస్తున్న చంద్రశేఖర్ భార్య దివ్య, ఇంట్లో గన్నేరు పప్పు దంచి తిని ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఆరోగ్యం విషమించడంతో ఆమెను కరీంనగర్ ఆసుపత్రికి తరలించి, అనంతరం హైదరాబాద్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా మరణించారు. దివ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి:

**హుజూరాబాద్, మార్చి 18 పెన్ పవర్:** కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ చిత్ర మిశ్రా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంలో సీపీ గౌస్ ఆలంతో కలిసి ఆమె మాట్లాడుతూ, పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలోని యాంటీ డ్రగ్ కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపారు. అనంతరం, ఈనెల 15 నుంచి చార్జ్ ఆఫీసర్లు, అడిషనల్ చార్జి ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ అడిషనల్ సెన్సెస్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న అవగాహన తరగతులను పరిశీలించారు.

## అంగన్వాడి విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ



**చొప్పదండి, మార్చి 18 పెన్ పవర్:** గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హుజురాబాద్ మునిసిపల్ పరిధిలోని గణేష్ నగర్ అంగన్వాడిలో చదువుతున్న 20 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, అంగన్వాడి టీచర్ కొలిపాక అంజలి, వార్డు కౌన్సిలర్ చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ గతంలో కూడా ఈ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు అందించారని, మధురమ్మ ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత, సోషల్ మీడియా ఆర్గనైజర్ తులసి లక్ష్మణమూర్తి, రిటైర్డ్ టీచర్ కోయల్ కార్ దుర్గాజి, కొలిపాక స్వప్న పాల్గొన్నారు.

## అధికారుల పొరపాటు:


## వృద్ధురాలు మృతి చెందినట్లు నమోదు !

**సిరిసిల్ల, మార్చి 18 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన వృద్ధురాలు మాదాసు నర్సవ్వ, భర్త మరణానంతరం ప్రభుత్వ వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్ళగా, అధికారులు ఆమె మరణించినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పింఛన్ నిలిచిపోయింది. ఎనిమిదేళ్ల క్రితం భర్త మరణించాడని, తాను బతికే ఉన్నానని నిరూపించుకోవడానికి సాక్ష్యాలు చూపినా అధికారులు పట్టించుకోవడం లేదని, వయస్సు, ఆర్థిక ఇబ్బందులతో కుంగిపోతున్నానని, కలెక్టర్ గరిమా అగర్వాల్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంటోంది.

## వెలుగుమట్ల బాధితులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**ఖమ్మం, మార్చి 18 పెన్ పవర్:** ఖమ్మం వెలుగుమట్లలో ఇటీవల గాజాను తలపించేలా విధ్వంసం జరిగిందని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. బుధవారం శాసనమండలిలో మాట్లాడుతూ, పేదలకు ఇళ్లు కట్టిస్తానన్న ప్రభుత్వమే నిర్ధాక్షణంగా పేదల ఇళ్లను కూల్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఆందోళనతో ప్రభుత్వం దిగివచ్చి, కూల్చిన చోటే పట్టాలు ఇస్తానని చెప్పడం, చంపినవాడే సంతాప సభ పెట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు. బాధితులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ డ్రైవ్



**మధిర, మార్చి 18 పెన్ పవర్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామ పంచాయతీలో క్లీన్ అండ్ గ్రీన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది జేసీబీ సహాయంతో వ్యర్థాలను తొలగించి, ప్లాస్టిక్, చెత్తాచెదారం లేకుండా గ్రామాన్ని శుభ్రపరిచారు. అటవీ శివార్ల నుండి వ్యర్థాలను తొలగించి, సహజ పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## షాద్ నగర్ ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ




**షాద్‌నగర్, మార్చి 18 పెన్ పవర్:** షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని, వారు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు చేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందని, ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో పేద ముస్లింలకు ప్రభుత్వం తరపున తోఫాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# భద్రాద్రి రామయ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సన్నద్ధం

"శ్రీరామ చంద్రః శ్రితపారిజాతః సమస్త కళ్యాణ గుణాభిరామః।
సీతా ముఖాంభోరుహ సంచరీకో నిరంతరం మంగళ మాతనోతు॥"

**హైదరాబాద్ పెన్ పవర్:** అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తర్వాత రాష్ట్రంలో ఆరు పెద్ద దేవాలయాలు ఉండేవి... అవి దేవాదాయ శాఖచే 6ఏ టెంపుల్స్ గా గుర్తింపు పొందాయి. శ్రీశైలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయ వాడ కనక దుర్గమ్మ, భద్రాచలం, వేములవాడ దేవాలయాలను 6ఏ టెంపుల్స్ అని పిలిచే వారు. 6ఏ అంటే ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ అని అర్ధం. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ లో వేములవాడ, భద్రాచలం తెలంగాణ లోకి రావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, భద్రాచలం మండలం లోని రెవెన్యూ గ్రామం భద్రాచలం. ఇక్కడ భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము కలిగిన గోదావరి నది దక్షిణ తీర పుణ్యక్షేత్రం. దీనిని భద్రాద్రి, శ్రీరామ దివ్యక్షేత్రం అనే పేర్లుతో కూడా పిలుస్తారు. పూర్వపు జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉంది. పూర్వం భద్రుడు అను భక్తుడు శ్రీ రాముడుకి తపస్సు చేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీ రాముడు వెలసే విధంగా వరం పొందాడని అంటారు. ఆ కొండకు భద్రుడు పేరు మీద భద్రగిరి అని తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం (భద్ర + అచలం) అని పేరు స్థిరపడింది. గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచల ప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న పని చేసే వాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వా నికి జమ చెయ్యకుండా,1645 - 1680 మధ్య కాలంలో భద్రగిరిపై శ్రీ రాముడు వెలసిన ప్రదేశ మందు రామాలయాన్ని నిర్మించాడు. సీతా రామచంద్ర స్వాములకు రకరకాల నగలు - చింతాకు పతకం, పచ్చల పతకం మొదలైనవి చేయించాడు. ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా, ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి గోపన్న ప్రార్థించాడు. ఆ సందర్భంలో రామునిపై రచించి, పాడిన పాటలే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు తన్మయత్వం చెందిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగిం చిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి, గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. అలా కంచెర్ల గోపన్నకు రామదాసు అనే పేరు వచ్చింది. దేవాలయ మందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామ చంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువు తీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానం లోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్సవానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్స వానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించడం సాంప్రదాయం. ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. రామ దాసు చేయించిన వివిధరకాల నగలు దేవస్థానపు ప్రదర్శన శాలలో ప్రదర్శనకు ఉంచారు. భద్రాచలం లోని శ్రీరాముడిని వైకుంఠ రాముడు అని అంటారు. ఇక్కడి రాముడు వైకుంఠమునకు వెళ్ళిన తరువాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్ర పర్వతంపై నిలిచాడు. భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి కల్యాణ బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చాంద్రమాన పరాభవ నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం నుండి చైత్ర శుద్ధ పూర్ణిమ గురువారం వరకు 19-03-2026 నుండి 02-04-2026 వరకు పంచ రాత్ర ఆగమ శాస్త్రోక్త విధానంగా వైష్ణవ సాంప్రదాయ రీతిలో పొడిచేటి సీతా రామానుజాచార్యులు, అమరవాది విజయ రాఘవన్ తదితర ఆచార్యుల ఆధ్వర్యంలో వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమీ తిరుకళ్యాణ బ్రహ్మోత్సవములు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇప్పటికే భద్రాచలం పట్టణాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే అధికారులు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వేడుకల నిర్వహణపై పలుమార్లు దేవస్థాన ఈవో కె. దామోదర్ రావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో తలమునక లయ్యారు. శ్రీ చాంద్రమాన పరాభవ నామ సంవత్సరాది 'ఉగాది' పండుగ సందర్భంగా ఉదయం ఉగాది ప్రసాద వితరణ ఉ.9-00 నుండి ఉత్సవారంభం - ఋత్విక్ వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, సా. మృత్సం గ్రహణము, తిరువీధి సేవ (కల్పవృక్ష వాహనం) నూతన పంచాంగ శ్రవణము అంకురార్పణమ్ తో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 12-04-2025న ఉ. చక్రతీర్థం, సా.గం. 6.00లకు పూర్ణాహుతి, శేషవాహన సేవ, ధ్వజావరోహణము, దేవతోద్వాసనము, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు, శ్రీ పుష్పయాగం బ్రహ్మోత్సవముల సమాప్తి జరుగనుంది.

# రాజకీయ అనుభవశాలి కృపలానీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆచార్య జె. బి. కృపలానీ (1888-1982) సుప్రసిద్ధ భారతీయ రాజకీయ నాయకుడు, గాంధేయవాది, సోషలిస్టు, పర్యావరణవేత్త , స్వాతంత్ర్య సమరయోధుడు, చరిత్రకారుడు, పండితుడు, ఉపాధ్యాయుడు, రచయిత, మహాత్మా గాంధీ తొలి సహచరులు. గాంధీకి అత్యంత సన్నిహితులలో ఒకనిగా పేరు గాంచారు. 1947 భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్షునిగా ఉన్నారు. 1951, 1957, 1963, 1967 లో లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. కృపలానీ ఆపద్ధర్మ భారత ప్రభుత్వము (1946-1947) లోనూ, భారత రాజ్యాంగ సభలోనూ పనిచేశారు. ఆచార్య కృపాలనీ నాటి సింధు (నేటి పాకిస్తాన్) ప్రాంతంలోని హైదరాబాదులో 1888లో జన్మించారు. అతని పూర్వీకులు గుజరాతీ , సింధీ సంతతులకు చెందినవారు. కరాచి డి.జె.సైన్సు కళాశాలలో, ఆయన రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటున్నందుకు కళాశాల నుంచి బహిష్కరించారు. కృపలానీ పూణేలోని ఫెర్గూసన్ కాలేజీ నుండి చరిత్ర, ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేసి 1912 లో బోధన ప్రారంభించారు.గాంధీ దక్షిణ ఆఫ్రికా నుండి వచ్చిన తరువాత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.ఉపాధ్యాయులుగా ఉన్న సమయం లోనే ఆయనకు మొదటి సారి గాంధీని కలిశారు. గాంధీని కలిసిన తరువాత కృపాలని కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుజరాత్, మహారాష్ట్ర, బీహార్లలో గాంధీ ఆశ్రమాలలో పని చేశారు.కృపలానీ 1920వ దశకపు తొలి నాళ్ళలో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. గుజరాత్, మహా రాష్ట్ర లోని గాంధీ ఆశ్రమాలలో సంఘ సంస్కరణ , విద్యా సంబంధ విషయాలపై కృషి చేశారు. ఆ తరువాత ఉత్తర భారత దేశంలోని బీహార్ , సంయుక్త రాష్ట్రాలలో అదే తరహా ఆశ్రమాలు స్థాపించి బోధించడానికి వెళ్ళారు. పౌర నిరసనోద్యమం లోనూ , ఇతర అనేక చిన్న సందర్భాలలోనూ బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలను నిర్వహించిన, ఉద్రేకపూరిత సాహిత్యాన్ని ప్రచురించిన అనేక సందర్భాలలో కృపలానీ జైలుకు వెళ్ళారు.

1922 నుండి 1927 వరకు గాంధీ స్థాపించిన అహ్మదాబాద్‌లోని గుజరాత్ విద్యాపీఠ్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఆచార్య అనే బిరుదును పొందారు.కృపలానీ అఖిల భారత కాంగ్రెసు కమిటీలో చేరి 1928-29లో దాని ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఒక దశాబ్దము పైగా కాంగ్రెస్ పార్టీ అత్యున్నత స్థాయి కార్య కలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమ నిర్వహణలో ప్రధానపాత్ర పోషించారు. 1934-1935 మధ్య కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కూడా పని చేశారు. తరువాత 1946 లో పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సైద్ధాంతికంగా వల్లభ్ భాయి పటేల్‌తోనూ, జవహర్ లాల్ నెహ్రూ తోనూ విరుద్ధముగా ఉన్నప్పటికీ, కృపలానీ 1947లో భారత స్వాతంత్ర్యానికి అటునిటు క్లిష్టమైన సంవత్సరాలలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1948 జనవరిలో గాంధీ హత్య తర్వాత, అన్ని ప్రభుత్వ నిర్ణయాలలో పార్టీ యొక్క అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకోవాలన్న కృపలానీ కోరికను నెహ్రూ తోసిరాజన్నారు. నెహ్రూ, పటేల్ మద్దతును కూడగట్టుకొని, "పార్టీకి విస్తృతమైన మార్గ దర్శకాలు, మూల సూత్రాలను నిర్దేశించే అధికారము కలిగి ఉన్నా, ప్రభుత్వ దైనందిన వ్యవహారాలలో కలుగ జేసుకొనే అధికారాన్ని పార్టీకి ఇవ్వలేమని" కృపలానీకి సమాధాన మిచ్చారు. సదరు పూర్వ ప్రమాణమే ఆ తర్వాత దశాబ్దాలలో ప్రభుత్వము , పాలక పార్టీ యొక్క సంబంధానికి కేంద్ర హేతువు అయ్యింది.

గాంధీ ఆశయమైన గ్రామ స్వరాజ్యానికి తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణతో కాంగ్రెస్ పార్టీని విడిచి, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ యొక్క సంస్థాపకుల్లో ఒకరైనారు. ఆ పార్టీ ఆ తరువాత సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమై ప్రజా సోషలిస్టు పార్టీగా అవతరించింది. కృపలానీ తన రాజకీయ శేష జీవితమంతా ప్రతిపక్షము.లోనే గడిపారు. 1938 నుండి ఆయన భార్య సుచేతా కృపలానీ, కాంగ్రెసు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రివర్గములో అనేక మార్లు మంత్రి పదవులతో సహా అనేక ఉన్నత పదవులు పొందారు. ఆమె దేశము లోనే మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉత్తర ప్రదేశ్ లో ప్రమాణ స్వీకారం చేశారు. కృపలానీ 1963 ఆగస్టులో భారత - చైనా యుద్ధం ముగియగానే నెహ్రూ ప్రభుత్వముపై లోక్ సభలో మొట్ట మొదటి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమాజిక , పర్యావరణ విషయాలపై పనిచేస్తూ కృపలానీ జీవితాంతము నెహ్రూ, ఇందిరల పాలనా, విధానాల విమర్శకునిగా మిగిలి పోయారు.

క్రియాశీలక ఎన్నికల రాజకీయాల్లో కొనసాగుతూనే, కృపలానీ క్రమేణ రాజకీయ నాయకుడిగా కంటే కమ్యూనిస్టుల ఆధ్యాత్మిక గురువుగా పరిణతి చెందారు. ముఖ్యంగా వినోబా భావేతో పాటు కృపలానీని అంతరించి పోతున్న గాంధేయవాదుల వర్గానికి నాయకులుగా భావిస్తారు. 1970 లలో వినోబా భావేతో పాటు ఈయన అనేక పరిరక్షణ , సంరక్షణా కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కూతురు ఇందిరా గాంధీ పాలనలను విమర్శించారు. ఆయా పాలనకు గ్రామీణ గణతంత్రాల, గాంధేయ ఆదర్శానికి విరుద్ధంగా ఉందని భావించారు. 1972-73లో, కృపలానీ, జయ ప్రకాశ్ నారాయణ్‌లు ఇందిరా గాంధీ పాలన నియంతృత్వంగా, ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ఉందని భావించి, ప్రధాని ఇందిర పాలనపై నిరసన ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ యంత్రాగాన్ని ఉపయోగించు కుందన్న అభియోగము న్యాయ స్థానములో నిర్ధారణ కావడంతో, రాజకీయ ప్రతిపక్షాలు ఆమెకు వ్యతిరేకంగా మరింత ముందుకు సాగాయి.జయప్రకాష్ నారాయణ్‌తో పాటు, 1972-73లో ఇందిరా గాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అహింసాత్మక నిరసన, శాసనోల్లంఘనను కోరుతూ కృపాలని భారతదేశంలో పర్యటించారు. 1975లో అత్యయిక పరిస్థితిని విధించినప్పుడు పెద్ద ఎత్తున నిరసన రేపడానికి కారకులు అయినారనే నెపంతో, జూన్ 26, 1975 రాత్రి అరెస్టు చేయబడిన మొట్ట మొదటి ప్రతిపక్ష నాయకుల్లో 80 యేళ్ళ పైబడిన కృపలానీ ఒకరు. ఎమర్జెన్సీ అంతం కావడం, 1977 ఎన్నికల్లో జనతా పార్టీ గెలుపొంది స్వాతంత్ర్యానంతరం మొట్ట మొదటి సారిగా ఒక కాంగ్రెసేతర ప్రభుత్వం నెలకొల్పటం చూడటానికి కృపలానీ జీవించే ఉన్నారు. లోహియా గాంధేయ తత్వ శాస్త్రాలపై కొన్ని పుస్తకాలు కూడా రాశారు; "అహింసా విప్లవం", "గాంధేయ వే", "ది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్", "ది ఫేట్ఫుల్ ఇయర్స్", "ది పాలిటిక్స్ ఆఫ్ చక్ర", "ది ఫాదర్ ఆఫ్ ది కాంగ్రెస్", "గాంధేయ విమర్శ" ముఖ్యమైనవి. కృపలానీ 94 యేళ్ళ వయసులో 1982, మార్చి 19న మరణించారు.

# షర్మిల షాకింగ్ కామెంట్స్.. బాబాయ్ హత్యకు అసలు కారణం ఇదే..

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కడప ఎంపీ టికెట్ విషయంలోనే వివేకా హత్య జరిగిందని షర్మిల ఆరోపించారు. కడప ఎంపీ పదవికి అవినాశ్ రెడ్డి సరైన వ్యక్తి కాదని బాబాయ్ వివేకానందరెడ్డి తనతో స్వయంగా చెప్పారని షర్మిల వివరించారు. బాబాయ్ ఎంత చెప్పినా, అవినాశ్ కే జగన్ టికెట్ ఇచ్చారన్నారు. బాబాయ్ బతికి ఉంటే తనకు ఎప్పటికైనా అడ్డేనని ఎంపీ అవినాశ్ భావించారని షర్మిల వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా షర్మిల విశాఖ జిల్లాలో పర్యటించారు. వివేకా హత్యపై పీసీసీ చీఫ్ షర్మిల తాజాగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. వివేకానందరెడ్డి ఏడో వర్ధంతి రెండు రోజుల క్రితమే ముగిసింది. అయినా ఈ హత్య కేసుపై పెద్దగా పురోగతి లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దర్యాప్తు సంస్థ సరిగా వ్యవహరించలేదని, ఇంకా కొందరి పాత్రపై అనుమానాలను నివృత్తి చేయలేదని వివేకా కుమార్తె వైఎస్ సునీతారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తు కొనసాగించమని ఆమె చేస్తున్న న్యాయపోరాటం విఫలయత్నమే అవుతోంది. ఈ నేపథ్యంలో వివేకా హత్య కేసుపై షర్మిల మరోసారి నోరు విప్పడం సంచలనంగా మారింది. వివేకా హత్యకు సంబంధించి ఆయన కుమార్తె, తన సోదరి వైఎస్ సునీత చేస్తున్న పోరాటానికి తొలి నుంచి షర్మిల మద్దతు చెబుతున్నారు. ఈ విషయమై పలుమార్లు బహిరంగంగా షర్మిల వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ తోపాటు కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి టార్గెట్ గా షర్మిల తరచూ చేస్తున్న విమర్శలు రాజకీయంగా పెను దుమారం రేపుతున్నాయి. వివేకాను హత్య చేసిన వారిని తాను అన్నా అని పిలిచిన వారే కాపాడుతున్నారని గతంలో



షర్మిల ఆరోపించారు. పరోక్షంగా మాజీ సీఎం జగన్మోహనరెడ్డిని టార్గెట్ చేశారని అంటున్నారు. ఇక తాజాగా కడప ఎంపీ అవినాశ్ రెడ్డిని పేరు ప్రస్తావిస్తూ షర్మిల చేసిన విమర్శలు కాకరేపుతున్నాయి. కడప ఎంపీ టికెట్ కోసమే హత్య జరిగిందంటూ షర్మిల వ్యాఖ్యానించడంతో వైసీపీని మాజీ సీఎం జగన్ ను మరోమారు ఈ వ్యవహారంలోకి షర్మిల లాగారాని చెబుతున్నారు. హత్య కేసులో సాక్షులు చనిపోతున్నారని, సునీత ప్రాణాలకు కూడా రక్షణ లేదని ఆమె గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. తన చిన్నాన్న కుమార్తె సునీతారెడ్డి పోరాటానికి మద్దతుగా ఉంటానని, న్యాయం జరిగే వరకు వదిలిపెట్టబోమని అప్పట్లో స్పష్టం చేశారు. అయితే హత్య కేసు దర్యాప్తును ముగించినట్లు సీబీఐ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన తర్వాత సునీత ఆందోళన వ్యక్తం చేయడం, ఇప్పుడు షర్మిల కూడా ఆమెకు బాసటగా నిలుస్తున్నట్లు మాట్లాడటం రాజకీయ ప్రాధాన్యాంశంగా చెబుతున్నారు. నిందితులను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలనే ఆలోచనతో షర్మిల ఇలాంటి విమర్శలు చేస్తున్నారని అనుమానిస్తున్నారు.

# వ్యవసాయిరెడ్డి ....చేరేది ఆ పార్టీలోనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయసాయిరెడ్డి కాస్తా వ్యవసాయిరెడ్డి అయిపోయారు. ఆయన 2025 జనవరి 25న తన ఎంపీ పదవికి వైసీపీకి రాజకీయానికి కూడా కలిపి ఒకేసారి వీడ్కోలు పలికేశారు. ఇప్పటికి పదిహేను నెలలు అయింది. ఈ మధ్యలో విజయసాయిరెడ్డి మీడియా ముందు హాట్ కామెంట్స్ చేస్తూ వచ్చారు తప్పించి రాజకీయంగా అయితే యాక్టివ్ గా లేరు. ఏ పార్టీలో కూడా చేరుతున్నట్లుగా హింట్ ఇచ్చినదీ లేదు. లేటెస్ట్ గా చూస్తే ఆయన వ్యవసాయం చేస్తూ కనిపించారు ఒక సామాన్య రైతుగా మారి సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పిక్స్ బయటకు వచ్చాయి.

**డెడ్ లైన్ దగ్గరలో :**

ఇక ఈ మధ్యనే విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను తిరిగి రాజకీయాల్లోకి వస్తున్నట్లుగా చెప్పారు. తాను జూన్ తరువాత రాజకీయంగా యాక్టివ్ అవుతాను అని కూడా ప్రకటించారు. అయితే ఏ పార్టీ అన్నది మాత్రం సస్పెన్స్ లో పెట్టారు. మరి విజయసాయిరెడ్డి ఏ పార్టీ తీర్థం పుచ్చుకుంటారు అన్నది చర్చగా మారింది. ఆయన ఆ మధ్యన మరో మాట అన్నారు. అవసరం అయితే తానే కొత్తగా ఒక ప్రాంతీయ పార్టీ పెడతాను అని. దాంతో ఆయన జూన్ నాటికి తన రాజకీయ భవిష్యత్తు మీద ఏమైనా తేల్చుకుంటారా అన్నది అంతా ఆసక్తిగా చూస్తున్నారు.

**వైసీపీకి దూరంగానే :**

ఇక వైసీపీకి విజయసాయిరెడ్డి దూరంగానే ఉండొచ్చు అని అంటున్నారు. ఆయన ఆ మధ్య ప్రెస్ మీట్ లో వైసీపీ మీద కొంత వ్యతిరేకంగా మాట్లాడారు, దాంతో పాటుగా జగన్ మళ్ళీ సీఎం అయ్యేది కష్టమని కూడా జోస్యం చెప్పారు. ఆ దిశగా వైసీపీలో వ్యూహాలు కూడా ఏవీ అమలు చేయడం లేదని అన్నారు. కూటమి పార్టీలు విడిపోక పోతే వైసీపీ తిరిగి అధికారంలోకి రావడం కష్టమని కూడా విజయసాయిరెడ్డి విశ్లేషించి చెప్పారు. దాంతో వైసీపీకి సహజంగానే కోపంగా ఉంటుంది. ఇక విజయసాయిరెడ్డి ఈ పరిణామాలు అన్నీ ఆలోచించిన మీదటనే వైసీపీ మీద ఈ తరహా కామెంట్స్ చేసారు అని అంటున్నారు.

**రాజకీయం మారుతుందా :**

ఇక చూస్తే జూన్ నాటికి ఏపీలోనూ దేశంలోనూ రాజకీయం మారుతుందా అన్న చర్చ కూడా సాగుతోంది. దేశంలో ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలకు ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో బీజేపీకి కచ్చితంగా దక్కేది అస్సాం మాత్రమే కనిపిస్తోంది అని అంటున్నారు. అది కాకుండా బీజేపీ అనుకున్నట్లుగా పశ్చిమ బెంగాల్ లో గెలిచి తమిళనాడులో పాగా వేస్తే దేశ రాజకీయం వేరే విధంగా ఉండొచ్చు లేకపోతే ఇంకో విధంగా ఉంటుంది. ఇక బీజేపీ కూడా భవిష్యత్తు ఆలోచనలు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. దాంతో జూన్ తరువాత జాతీయ ముఖ చిత్రం మారుతుందని అంటున్నారు. ఇవన్నీ ఆలోచించే విజయసాయిరెడ్డి జూన్ ని డెడ్ లైన్ గా పెట్టారా అన్న చర్చ సాగుతోంది.

**కమలం చెంతనేనా :**

విజయసాయిరెడ్డికి బీజేపీ పెద్దలతో మంచి రిలేషన్స్ ఉన్నాయని చెబుతున్నారు. ఇక రేపటి రోజున బీజేపీ వారికి కూడా కీలక నేతల అవసరం పడవచ్చు అని అంటున్నారు. ఇలా అన్నీ ఆలోచించినపుడు విజయసాయిరెడ్డి బీజేపీలోకి వెళ్ళే చాన్సెస్ ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతానికి ఆయన వ్యవసాయిరెడ్డి ఆ తరువాత రాజకీయ వ్యవసాయం చేస్తారు అన్న మాట గట్టిగా వినిపిస్తోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# పదవి దిగిపోతూ జేసీ హాట్ కామెంట్స్ !

**హైదరాబాద్ పెన్ పవర్:** తాడిపత్రి మునిసిపాలిటీకి చైర్మన్ గా జేసీ ప్రభాకర్ రెడ్డి 2021లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆ పదవిలోకి వస్తారు అని ఎవరూ అనుకోలేదు. ఎందుకంటే ఆయన 2014లో తాడిపత్రి ఎమ్మెల్యేగా నెగ్గారు. ఎమ్మెల్యేగా పనిచేసిన వారు చైర్మన్ పదవిని ఎలా చేపడతారు అని అనుకోవచ్చు. కానీ జేసీ ప్రభాకర రెడ్డి రూటే సెపరేట్ కదా. అందుకే ఆయన తానే స్వయంగా పదవిలో ఉంటే తప్ప తాడిపత్రి పొలిటికల్ గా లైన్ లోకి రాదని వేసిన సూపర్ ప్లాన్ ఇది. దాంతో తన స్థాయిని తగ్గించుకుని మరీ చైర్మన్ అయ్యారు. తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి గుండె కాయ లాంటి చైర్మన్ పదవిని జేసీ చేపట్టడం వల్లనే టీడీపీ అక్కడ మళ్ళీ పుంజుకుంది. అది 2024 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బాగా కనిపించింది. జేసీ ప్రభాకర్ రెడ్డి తనయుడు పవన్ రెడ్డి ఎమ్మెల్యే అయిపోయారు.

**దేశంలోనే నంబర్ వన్ :**

దేశంలోనే తాడిపత్రి నంబర్ వన్ అంటూ తన చైర్మన్ పదవి విరమణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేసీ హాట్ కామెంట్స్ చేశారు. తాను ఒక చైర్మన్ గా కాకుండా తాడిపత్రి మునిసిపాలిటీని తన సొంత ఇల్లుగా చేసుకుని పాలన చేశాను అన్నారు. ఇంట్లో వారి కోసం ఎలా కష్టపడతామో అలాగే తాను మునిసిపాలిటీ అభివృద్ధి కోసం కష్టపడ్డామని అన్నారు. మునిసిపాలిటీ ఆస్తులను అన్నీ రిజిస్ట్రేషన్ చేయించామని అలాగే ఖాళీగా ఉన్న స్థలాలను కబ్జా కానీయ కుండా గూగుల్ మాపింగ్ చేయించామని చెప్పుకొచ్చారు.

**రెండు వేల కోట్ల ఆస్తి :**

ఈ రోజున చూస్తే తాడిపత్రి మునిసిపాలిటీ రెండు వేలకు పైగా



కోట్ల ఆస్తులతో ఉంది అంటే దానికి కారణం తన పనితనం అని జేసీ చెప్పారు. వేరే ఎవరు ఉన్నా ఈ విధంగా చేసే వారు కాదని ఆయన అన్నారు. తాను తాడిపత్రిని అభివృద్ధి పథంలోకి తెచ్చాను అని చెప్పారు. అధికారులు సహా ఎవరూ కూడా తన జోరుకు స్పీడ్ కి అసలు మ్యాచ్ కారంటూ జేసీ హాట్ కామెంట్స్ చేశారు.

**బాధ్యత లేదంటూ :**

బాధ్యత గురించి మాట్లాడుతూ జేసీ ప్రభాకరరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. చాలా మందికి బాధ్యత లేకుండా పోతోందని ఎంత సేపూ తమ కుటుంబం తాము అన్నట్లుగానే ఉంటున్నారని జేసీ విమర్శించారు. కానీ తాను అలా కాదని అందుకే ఆస్తులు తాను మునిసిపాలిటీకి కూడబెట్టాను అన్నారు. మునిసిపాలిటీ ఆస్తులను ఎవరూ ఏమీ చేయకుండా చట్టబద్ధంగా ఏమి చేయాలో అన్నీ చేశాను అన్నారు. అంతటితో ఆగకుండా ఆయన అధికారుల మీద సెటైర్లు వేశారు. కమిషనర్ ని సైతం ఆటపట్టిస్తూ ఆయన బుర్ర గట్టిది అని కామెంట్స్ చేశారు.

**రిటైర్ అయినట్లేనా :**

జేసీ ఎమ్మెల్యే చేశారు, తిరిగి చైర్మన్ చేశారు, ఇపుడు ఆయన ఏమి చేయబోతున్నారు అని అంతా చర్చించుకుంటున్నారు. ఏడున్నర పదుల వయసులో ఉన్న ప్రభాకర్ రెడ్డి తన

వారసుడిగా పవన్ ని ముందు పెట్టారు. తాను చైర్మన్ గా అనాడు చేయడం వెనక కూడా రాజకీయ వ్యూహం ఉంది. ఇపుడు ఏజ్ ఫ్యాక్టర్ వల్ల ఆయన రిటైర్ అవుతారా లేక మరోసారి చైర్మన్ గా పనిచేసేందుకు సిద్ధపడతారా అన్నది పార్టీలో చర్చ సాగుతోంది. పదవీ విరమణ వేళ కూడా ఎక్కడా తన తగ్గకుండా హాట్ కామెంట్స్ చేస్తూ వచ్చిన జేసీ రాజకీయం ఇప్పట్లో ఆగేలా లేదని కూడా అంటున్నారు. మొత్తానికి చూస్తే జేసీ ప్రభాకరరెడ్డి ఒక విలక్షణమైన నాయకుడిగానే చెప్పాల్సి ఉంది.

# విశాఖకు రింగ్ రోడ్డు...భారీ గిఫ్ట్ !




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సిటీస్ లో విశాఖ ముందు వరసలో ఉంది. దానికి భౌగోళికమైన పరిస్థితులు కారణం. విశాఖకు అతి పెద్ద తీర ప్రాంతం ఉంది. పచ్చని కొండలు ఉన్నాయి. ప్రకృతి రమణీయత ఉంది. అలాగే రూరల్ అర్బన్ రెండూ కలగలసిన నేపథ్యం ఉంది. సీ పోర్టు ఎయిర్ పోర్టు రైల్వే రోడ్ కనెక్టివిటీ ఉండడంతో ఏపీలో ప్రస్తుతం అతి పెద్ద నగరంగా ఉంది. విశాఖను ఎవరూ విస్మరించలేని విధంగా సిటీ ప్రగతి ఉంది. ఐటీ హబ్ గా పారిశ్రామిక ముఖ్య కేంద్రంగా విశాఖ అవతరిస్తోంది. భోగాపురం ఎయిర్ పోర్టు ఆపరేషన్స్ మొదలైతే కనుక విశాఖ అభివృద్ధి మరింతగా జోరు అందుకుంటుంది అన్న మాట సైతం గట్టిగా వినిపిస్తోంది.

**రింగ్ రోడ్ ప్లాన్ తో :**

విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రింగ్ రోడ్ కి ప్లాన్ చేస్తున్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి రాంబిల్లి నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్ బేస్ వరకూ దాదాపుగా 70 కిలోమీటర్ల మేర ఉన్న ప్రాంతం వరకూ రింగ్ రోడ్ ని నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది అని అంటున్నారు. ఈ రింగ్ రోడ్ పరిధిలోకి భోగాపురం, ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం రాంబిల్లి వస్తాయి.

**ట్రాఫిక్ ని కంట్రోల్ చేయాలంటే :**

భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి విశాఖ రావాలంటే హెవీ ట్రాఫిక్ ఉంది. దాంతో గంటన్నరకు పైగా సమయం పడుతోంది. దాంతో ఈ ట్రాఫిక్ ని కంట్రోల్ చేయాలంటే రింగ్ రోడ్ అవసరం అని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో కొత్తగా ప్లాన్ చేస్తున్న రింగ్ రోడ్ అంతా రూరల్ రూట్ లో సాగుతుంది. దాంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి పథంలోకి వస్తాయని అంటున్నారు. ఉత్తరాంధ్రా జిల్లాలు సైతం అభివృద్ధి చెందేందుకు ఈ విధంగా అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ రింగ్ రోడ్ ప్రగతికి అతి పెద్ద కీలకమైన మలుపుగా ఉంటుందని కూడా భావిస్తున్నారు.

**రియల్ బూమ్ సైతం :**

ఇక ఈ రింగ్ రోడ్ డిజైన్ చేసిన తీరుని బట్టి చూస్తే రూరల్ సెక్టార్ అంతా మహర్దశను అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అంతే కాదు రానున్న రోజులలో మారు మూలన ఉన్న ప్రాంతాలు సైతం మెయిన్ జంక్షన్లుగా మారుతాయని అంటున్నారు. అలా రియల్ బూమ్ ఊపందుకుంటుంది అని లెక్క వేస్తున్నారు. అదే సమయంలో పారిశ్రామిక అభివృద్ధికి కూడా వీలు కల్పిస్తుందని అంటున్నారు. ఒక విధంగా ట్రాఫిక్ ని కంట్రోల్ చేసే ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్ ని డెవలప్ చేయడానికే ఈ రింగ్ రోడ్ పరిమితం కాదని బహుముఖంగా అభివృద్ధికి బాటలు వేస్తుందని భావిస్తున్నారు.

**భోగాపురం టూ రాంబిల్లి :**

భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి రాంబిల్లి దాకా రింగ్ రోడ్ ద్వారా కనెక్టివిటీ ఇవ్వడం వల్ల రాంబిల్లి ప్రాంతంలో ఉన్న రక్షణ కేంద్రాలు అలాగే పారిశ్రామిక సంస్థలకు కూడా ఎయిర్ పోర్టుని అనుసంధానించినట్లు అవుతుందని చెబుతున్నారు. అంతే కాదు ఐటీ ఫార్మా సెక్టార్ తో పాటు పారిశ్రామిక రంగానికి ఈ రింగ్ రోడ్ అతి పెద్ద బూస్ట్ ఇస్తుందని చెబుతున్నారు. అపుడు విశాఖ నగరం వైపు ట్రాఫి తగ్గి రింగ్ రోడ్ మెయిన్ రూట్ అవుతుందని ఆ విధంగా సిటీ మీద ఒత్తిడి తగ్గుతుందని కూడా అంటున్నారు. మొత్తానికి చూస్తే విశాఖకు రింగ్ రోడ్ రూపంలో ఒక భారీ గిఫ్ట్ ని కూటమి ప్రభుత్వం రెడీ చేస్తోంది అని చెబుతున్నారు.

# పుట్టా విషయంలో టీడీపీ అంతర్మధనం...కిం కర్తవ్యం ?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీకి అతి పెద్ద రాజకీయ కుదుపుగా ఏలూరు ఎంపీ టీడీపీ యువ నేత పుట్టా మహేష్ వ్యవహారం తయారైంది అని అంటున్నారు. హైదరాబాద్ లో జరిగిన వీకెండ్ పార్టీకి పుట్టా అటెండ్ కావడం ఆ సమయంలో డ్రగ్స్ తీసుకున్నాడని ఆరోపణలు రావడం ఇవన్నీ కూడా టీడీపీకి అతి పెద్ద తలనొప్పిగా మారాయి. ఈ నేపథ్యంలో పుట్టాకి ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ పల్లా శ్రీనివాస్ ద్వారా షోకాజ్ నోటీసులు అయితే ఇప్పించారు. కానీ ఏమి చేయాలి అన్నది మాత్రం టీడీపీలో అంతర్మథనం సాగుతోంది అని అంటున్నారు.

**పార్టీని ఇబ్బందులో నెడుతున్నారు:**

పార్టీని ఇబ్బందులో నేతలు కొంతమంది నెడుతున్నారు అని టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టా మహేష్ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు అని ప్రచారం సాగుతోంది. బాబు తిరుపతి జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు అలాగే ఇంచార్జి మంత్రితో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు అని చెబుతున్నారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా విషయం చర్చకు వచ్చినట్లుగా తెలుస్తోంది. ఇక బాబు ఈ నేపథ్యంలోనే హాట్ కామెంట్స్ చేశారు అని అంటున్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న ఫ్యామిలీ నుంచి వచ్చారని టికెట్ ఇచ్చి అవకాశం కల్పించామని బాబు చెప్పారని అంటున్నారు. కానీ అవకాశాన్ని ఈ విధంగా తీసుకోవడమేంటి అని బాబు ఆవేదన వ్యక్తం చేశారు అంటున్నారు. అసలు అలాంటి పార్టీలకు వెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చింది అని బాబు ప్రశ్నించారు అని అంటున్నారు. పార్టీని ఇబ్బందుల పాలు చేసే నేతలను మోయలా అని బాబు ప్రశ్నించారు అని అంటున్నారు. క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపైన గతంలో కఠిన చర్యలు తీసుకున్నామని బాబు చెప్పుకొచ్చారు అంటున్నారు. క్రమశిక్షణతో పాటు విలువలు పాటించకుండా ఎవరు రాజకీయం చేసినా తప్పే అని బాబు అన్నట్లుగా చెబుతున్నారు.

**యాక్షన్ ఉంటుందా :**

బాబు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే పుట్టా మహేష్ ఎపిసోడ్ లో టీడీపీ కఠినంగా వ్యవహరించే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. ఎందుకంటే ఈ ఇష్యూని ఆధారంగా చేసుకుని వైసీపీ రచ్చ చేస్తోంది. నో యాక్షన్ అంటూ జగన్ తాజాగా చంద్రబాబు మీద సెటైర్లు వేశారు. దాంతో పాటు ప్రజలలో కూడా ఈ అంశాలు చర్చకు వస్తే అది ఇబ్బందిగా మారుతుందని అంటున్నారు. అందుకే ఈ ఎపిసోడ్ కి ఎక్కడో ఒక చోట ఫుల్ స్టాప్ పెట్టాలని చూస్తున్నారు అని అంటున్నారు.

**తర్జన భర్జన :**

అయితే పుట్టా మహేష్ కేవలం ఎంపీ మాత్రమే కాదు, ఆయన బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నేత. బిగ్ బిజినెస్ షాట్. అలాగే సీనియర్ మోస్ట్ నేత యనమల రామక్రిష్ణుడికి అల్లుడు, ఇక మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్న పుట్టా సుధాకర్ ఆయనకు తండ్రి. ఇలా బలమైన రాజకీయ సామాజిక నేపథ్యంతో పాటు ఆర్థిక నేపథ్యం కూడా ఉంది. దాంతో షోకాజ్ నోటీసుతో సరిపెట్టి వదిలేస్తారా లేక ఇంకా కఠిన చర్యలకు వెళ్తారా అంటే దీని మీదనే తర్జన భర్జన పడుతున్నారు అని అంటున్నారు. ఏది ఏమైనా టీడీపీకి ఇపుడు ఈ విషయాలు అన్నీ కొంత కలవరం కలిగిస్తున్నాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇరాన్‌పై అమెరికా భారీ దాడులు..

**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలముకున్నాయి. ఇరాన్ లక్ష్యంగా అమెరికా బలగాలు బుధవారం భారీ వైమానిక దాడులకు దిగాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న భూగర్భ క్షిపణి స్థావరాలను ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో సుమారు 2,268 కిలోల బరువుండే అత్యంత శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను ఉపయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ బాంబులు భూగర్భంలోని కాంక్రీట్ కట్టడాలను ఛేదించుకుని వెళ్లి, అక్కడ దాచి ఉంచిన నౌకా విధ్వంసక క్షిపణులను పూర్తిగా నాశనం చేశాయని తెలిపింది. అంతర్జాతీయ నౌకాయానానికి ఈ క్షిపణుల నుంచి ముప్పు పొంచి ఉందన్న కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అయితే, ఈ విషయంలో మిత్రదేశాల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. "మాకు ఎవరి సహాయం అవసరం లేదు, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కోగలం" అని ఆయన స్పష్టం చేశారు. ఫ్రాన్స్ వంటి దేశాలు ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనడానికి నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు.

## న్యూమెక్సికోలోని అమెరికా వైమానిక దళ స్థావరంలో కాల్పులు

**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూమెక్సికోలోని అమెరికా వైమానిక దళ స్థావరంలో జరిగిన కాల్పులు జరిగినట్లు సైనిక అధికారులు మంగళవారం తెలిపారు. ఈ ఘటనలో ఒకరు మరణించగా, మరొకరు గాయపడ్డారని అన్నారు. వివరాల ప్రకారం.. దక్షిణ న్యూ మెక్సికోలోని అలమోగోర్డో సమీపంలో ఉన్న హోలోమన్ వైమానిక దళ స్థావరంలో కన్వీనియన్స్ స్టోర్ సమీపంలో ఒక దుండగుడు కాల్పులు జరుపుతున్నాడని సమాచారం వచ్చిందని అన్నారు. సాయంత్రం సుమారు 5.30గంటలకు ఆ స్థావరాన్ని లాక్‌డౌన్ చేసినట్లు 49వ వింగ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. గాయపడిన వ్యక్తిని వైద్య చికిత్స కోసం తరలించినట్లుగా పేర్కొంది. స్థావరం సురక్షితంగా ఉందని, లాక్‌డౌన్‌ను ఎత్తివేశారని భద్రతా అధికారులు ధృవీకరించారు. తదుపరి ప్రకటన వెలువడే వరకు కన్వీనియన్స్ స్టోర్‌ను మూసివేసినట్లు బేస్ యాజమాన్యం తెలిపింది. సుమారు 93 చదరపు మైళ్ల విస్తీర్ణం కలిగిన ఈ వైమానిక స్థావరంలో 49వ వింగ్ ఉంది. ఇది జాతీయ భద్రతా కార్యకలాపాలకు మద్దతు ఇస్తుంది. దీనిలో యుద్ధానికి అవసరమైనవైమానిక సిబ్బంది, సంరక్షకులు ఉంటారు.

## హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు


**హైదరాబాద్ పెన్ పవర్:** హోర్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ తీరప్రాంత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా సైన్యం దాడులు నిర్వహించినట్లు ప్రకటించింది. ఇరాన్ క్షిపణి స్థావరాలపై 5,000 పౌండ్ల బరువున్న లోతైన ఛేదక క్షిపణులను అమెరికా ప్రయోగించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా తెలిపింది.ఇదిలా ఉండగా, హోర్ముజ్ జలసంధి గుండా నౌకా రవాణాను ఇరాన్ అనుమతిస్తుంది. అయితే ఇది తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ ఇటీవల రోజుల్లో ఈ సంఖ్య "దాదాపు రెట్టింపు"గా ఉన్నది. సముద్ర నిఘా సంస్థ విండ్ వార్డ్ వెల్లడించిన వివరాల ప్రకారం, సోమవారం రోజున ఎనిమిది నౌకలు మాత్రమే ఈ మార్గంలో గుర్తించబడ్డాయి. ఇవి ప్రధానంగా ఇరాన్ జెండా మినహా ఇతర దేశాలకు చెందినవే. ఈ జలసంధి ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్ దేశాల మధ్య ఉంది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదవ వంతు ఈ మార్గం గుండా వెళ్తుండగా, అమెరికా–ఇరాన్–ఇజ్రాయిల్ ఉద్రిక్తతల నేపథ్యంలో రాకపోకలు 95 శాతం వరకు తగ్గినట్లు సమాచారం. ఈ నెల ప్రారంభంలో, ఈ మార్గంలో ప్రయాణించే ఏ నౌకనైనా దాడి చేస్తామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతినిధి హెచ్చరించగా, తాజాగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి "జలసంధి తెరిచి ఉంది, కానీ శత్రువులకు మూసివేయబడింది" అని వ్యాఖ్యానించారు.ఇక మరో నౌకా ట్రాకింగ్ సంస్థ మెరైన్ ట్రాఫిక్ గణాంకాల ప్రకారం, గత రెండు రోజుల్లో ఐదు ప్రయాణాలు నమోదవగా, ఆది, సోమవారాలలో తొమ్మిది ప్రయాణాలు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. జలసంధి గుండా రవాణా తగ్గిపోవడంతో, బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు పైగా చేరుకుంది. యుద్ధం ప్రారంభానికి ముందు ధరలతో పోలిస్తే ఇది 40 శాతం కంటే ఎక్కువ పెరుగుదలగా నమోదైంది. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, ప్రపంచ వాణిజ్యం, చమురు సరఫరాపై దీని ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అలీ లారిజానీ మృతిని ధృవీకరించిన ఇరాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ భద్రతా మండలి అధిపతి అలీ లారిజానీ వైమానిక దాడిలో మరణించినట్లు ఇరాన్ ధృవీకరించింది. ఈ వైమానిక దాడిలో ఇరాన్ బసీజ్ కమాండర్ ఘోలం రెజా సులేమానీ కూడా మరణించారని ప్రకటించింది. 'ఇరాన్ పురోగతి, ఇస్లామిక్ విప్లవం కోసం జీవితాంతం కృషి చేసిన ఆయన, చివరికి తన కోరికను నెరవేర్చుకున్నారు. ఆయన గర్వంగా అమరులయ్యారు' అని భద్రతా మండలిని ఉటంకిస్తూ మెహర్ ఏజెన్సీ నివేదించింది. ఇరాన్ సైనిక నాయకత్వంలో లారిజానీ అత్యంత కీలకమైన వ్యక్తి. ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతోల్లా ఖమేనీ హత్య తర్వాత, లారిజానీ దేశ భద్రతా బాధ్యతలు చేపట్టారు. ఇరాన్ సర్వోన్నత నాయకుడు ఖమేనీ హత్య తర్వాత యుద్ధంలో మరణించిన అత్యంత సీనియర్ ఇరాన్ నాయకుడు ఈయనే. ఇరాన్ రాజకీయాల్లో కీలక వ్యక్తి అయిన లారిజానీ జరిపిన దాడుల్లో మరణించారని ఇజ్రాయిల్ ఇంతకుముందు తెలిపింది. ఇరాన్‌లోని క్షిపణి తయారీ కేంద్రాలు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని టెహ్రాన్, షిరాజ్, తబ్రిజ్‌లలో ఏకకాలంలో వైమానిక దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ గతంలో ప్రకటించింది. ఈ దాడిలో బసిజ్ ప్రతిఘటన దళం అధిపతి ఘోలమ్రెజా సోలేమానీ, ఇతర సీనియర్ బసిజ్ అధికారులు కూడా లక్ష్యంగా ఉన్నారని వార్తలు వచ్చాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌తో సంబంధం ఉన్న లారిజానీతో సహా 10 మంది అధికారుల గురించిన సమాచారం అందించిన వారికి అమెరికా 10 మిలియన్ డాలర్ల బహుమతిని ప్రకటించింది.

## మొజ్తాబా ఎక్కడున్నా వెంబడించి, అంతం చేస్తాం:



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ ఎక్కడ ఉన్నా వెంబడించి అంతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తమ దేశానికి ముప్పుగా ఉన్నవారు ఎప్పుడూ తమ టార్గెట్‌లోనే ఉంటారని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించింది. అయితే ప్రస్తుతం ఖమేనీ ఎక్కడున్నారనే దానిపై తమ వద్ద సమాచారం లేదని మీడియా అడిగిన ప్రశ్నకు ఐడీఎఫ్ ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ సమాధానం ఇచ్చారు. "ఆయన ఎక్కడున్నారన్న దానిపై మావద్ద ప్రస్తుతం సమాచారం లేదు. కానీ మా దేశానికి ముప్పుగా పరిణమించిన వారిని వెంబడించడం మాత్రం ఆపం. మాకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు మా నుంచి తప్పించుకోలేరు. వారిని తరిమి, తరిమి అంతం చేస్తాం. ఎప్పుడు, ఎక్కడ అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పలేకపోయినా.. మా టార్గెట్ మాత్రం మిస్ కాదు" అని డెఫ్రిన్ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, దాడుల్లో గాయపడిన ఖమేనీని చికిత్స కోసం రష్యాకు తరలించినట్లు వచ్చిన వార్తలను ఇరాన్ ఖండించింది. "ఇదొక కొత్తతరహా మానసిక యుద్ధం. ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన, షెల్టర్లలో దాక్కోవాల్సిన అవసరం లేదు.

# ఇరాన్ నుంచి ఎలాంటి ముప్పూ లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో అమెరికా యుద్ధం నేపథ్యంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌తో యుద్ధానికి వెళ్లాలన్న ఆయన విధానాన్ని ప్రశ్నిస్తూ ఒక ఉన్నత స్థాయి అధికారి రాజీనామా చేశారు. యూఎస్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ (ఎన్‌సీటీసీ) డైరెక్టర్ జో కెంట్ తన పదవి నుంచి వైదొలుగు తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన ఒక కీలక పోస్ట్ చేశారు. "నా మనస్సాక్షి ప్రకారం ఇరాన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి నేను మద్దతు ఇవ్వలేను. ఇరాన్ నుంచి మన దేశానికి తక్షణ ముప్పు ఏమీ లేదు. ఇజ్రాయిల్ , దాని శక్తివంతమైన అమెరికన్ లాబీ ఒత్తిడితోనే మనం ఈ యుద్ధాన్ని ప్రారంభిం చామన్నది స్పష్టం" అని ఆయన పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నిరంతరం పెరుగుతున్న తరుణంలో కెంట్ రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఇరాన్ యుద్ధం కారణంగా ట్రంప్ యంత్రాంగంలో జరిగిన అత్యంత ప్రముఖ నిష్క్రమణలలో జో కెంట్ రాజీనామా ఒకటి కావటం విశేషం. కౌం టర్ టెర్రరిజం సెంటర్ డైరెక్టర్‌గా జో కెంట్ ఒక కీలకమైన యూఎస్ ఇంటె లిజెన్స్ ఏజెన్సీకి నాయకత్వం వహించారు. దేశానికి ఎదురయ్యే తీవ్రవాద ముప్పులను గుర్తించి, విశ్లేషించడం ఆయన పని. అయితే, ఇరాన్ ప్రస్తుతం అమెరికాకు ఎలాంటి ముప్పునూ కలిగించడం లేదని అదే అధికారి పేర్కొ నడం గమనార్హం. జో కెంట్ వ్యాఖ్యలతో ట్రంప్ యుద్ధోన్మాదం స్పష్టంగా బయటపడినట్టయ్యిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఆయన డైరెక్టర్‌గా వ్యవహ రించిన ఈ అమెరికా ఏజెన్సీ చాలా కీలకమైంది. ఇది అమెరికా ప్రభుత్వంలోని ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ, పెంటగాన్, చట్ట అమలు సంస్థలతో సహా వివిధ విభాగాల మధ్య ఉగ్రవాద నిరోధక నిఘాను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చాలా ఆలోచించిన తర్వాతనే తాను రాజీనామా నిర్ణ యాన్ని తీసుకున్నట్టు జో కెంట్ ట్రంప్‌నకు రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు. దానిని జో కెంట్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ లేఖలో జో తన రాజీనామా వెనుక గల కారణాలను వివరించారు.

# ఇరాన్‌కు శాశ్వత నష్టం తప్పదు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇజ్రాయెల్–అమెరికా సంయుక్త దాడుల వల్ల ఇప్పటికే ఇరాన్ భారీగా నష్టపోయింది. ఓవైపు కీలక నేతలు వరుసగా ప్రాణాలు కోల్పోతుండగా.. మరోవైపు అణు స్థావరాలు, పౌర నివాసాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడులు ఇంకా ముగియలేదని.. ఆ దేశానికి శాశ్వత నష్టం కలిగించడానికి అగ్రరాజ్యం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పుడే యుద్ధాన్ని ఆపేసినా ఆ దేశాన్ని పునర్నిర్మించుకోవడానికి అక్కడి పాలకులకు 10 ఏళ్ల సమయం పడుతుందని అన్నారు. కానీ మళ్లీ కోలుకోలేనివిధంగా ఇరాన్‌కు నష్టం కలిగించాలన్నదే తమ లక్ష్యమని వెల్లడించారు. మరో అధ్యక్షుడు ఇటువంటి తప్పు చేయకుండా ఇరాన్ (ఎతీజీని)కు తగిన బుద్ధి చెబుతామని ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంపై తాము చేపట్టిన ఆపరేషన్ సరైన దిశలోనే వెళుతోందన్నారు. భవిష్యత్తులో ఇరాన్ నుంచి ఎవరికీ అణుముప్పు కలగకుండా చూడటమే తమ లక్ష్యమన్నారు. మరో రెండు వారాల పాటు ఈ యుద్ధం కొనసాగే అవకాశం ఉందన్నారు. తాము ముందస్తు దాడులను ప్రారంభించకపోయి ఉంటే ఇరాన్ ఇప్పటికే పలు అణ్వాయుధాలను

అభివృద్ధి చేసేదని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపడానికి నాటోతో పాటు మిత్రదేశాలు నిరాకరించడంపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో నాటో తెలివితక్కువగా ప్రవర్తిస్తోందన్నారు. హర్మూజ్ జలసంధి (ౚబితీజీతిబి ౘట ఊనీతీఎబీళి)ని తెరిపించాల్సిన అవసరం ఉన్నప్పటికీ తమ మిత్రదేశాలు ముందుకురావట్లేదన్నారు. అయినప్పటికీ వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు. తమది ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశమని..అత్యంత శక్తిమంతమైన సైన్యం తమకు ఉందని పునరుద్ఘాటించారు.

# విబి గ్రామ్‌జి గ్రామీణ పేదలపై ప్రత్యక్ష దాడి




**హైదరాబాద్ పెన్ పవర్:** వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి, జీవనోపాధుల పథకం (విబి గ్రామ్‌జి) ఒక బూటకమని, ఇది గ్రామీణ పేదలపై మోడీ సర్కార్ సాగిస్తున్న ప్రత్యక్ష దాడి అని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికుల పొట్టగొట్టే ఈ పథకాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామీణ కుటుంబానికీ ఉపాధిని కనీసం 200 రోజులకు పెంచాలని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడిక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఎంపీలు, ఆర్థికవేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఉపాధి హామీ కార్మికులతో వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు, ఎన్‌ఆర్‌ఇజిఎ సంఘర్ష్ మోర్చా ఐక్య వేదిక ఆధ్వర్యాన విధానాలపై చర్చ నిర్వహించింది. ఇటీవల ప్రవేశపెట్టిన విబి గ్రామ్‌జి ? 2025 దృష్ట్యా భారత గ్రామీణ ఉపాధి హామీ పథకం భవిష్యత్తుపై చర్చించింది. ఈ సందర్భంగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, లోక్‌సభ ఎంపీ అమ్రారామ్ మాట్లాడుతూ? మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసిన విబి గ్రామ్‌జిలో 125 రోజుల పని ఇస్తామన్న వాగ్దానం డొల్ల అని విమర్శించారు. కనీసం వంద రోజుల పని కూడా కల్పించలేని వారే 125 రోజుల పని కల్పిస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రూ.15 లక్షలు ఇస్తామని చేసిన వాగ్దానం లాగే ఇది కూడా ఒక వట్టి హామీ అని అమ్రారామ్ అన్నారు. రాజ్యసభ ఎంపీ వి శివదాసన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని తొలగించడంతో వారు (కేంద్రం) గాంధీ ఆలోచనలను నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశ గ్రామీణ పేదల జీవనాధారమైన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కొనసాగిస్తున్న దాడులను సమావేశం ఖండించింది.

# ఎనిమిది మంది ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేత



**హైదరాబాద్ పెన్ పవర్:** లోక్‌సభలో ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేశారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఎంపీలపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తేశారు. మంగళవారం కాంగ్రెస్ చీఫ్ విప్ కె.సురేశ్ మాట్లాడుతూ ఎంపీలపై నిషేధాన్ని ఎత్తివేయాలని స్పీకర్‌ను కోరారు. ఎంపీ సురేశ్ ప్రతిపాదనకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) నేత ధర్మేంద్ర యాదవ్ మద్దతు ఇచ్చారు. ట్రెజరీ బెంచ్‌లు కూడా హుందాగా వ్యవహరించాలని ధర్మేంద్ర యాదవ్ అన్నారు. సభా వ్యవహారాలను సజావుగా నడిపేందుకు లక్ష్మణ రేఖ గీయాల్సి వస్తుందని మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. సభా వ్యవహారాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని, ప్రతిపక్షాలకు కూడా సమాన అవకాశం ఇవ్వాలని సురేశ్ కోరారు. అయితే ఆ సమయంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ ప్లకార్డులను ప్రదర్శించరాదని, కృత్రిమ మేధ (ఏఐ) జనరేటెడ్ ఫొటోలను వాడవద్దని సభ్యులను బిర్లా కోరారు. ఎనిమిది మందిపై సస్పెన్షన్ రద్దు తీర్మానాన్ని సభ ఆమోదించింది.

సస్పెన్షన్ రద్దు అయిన ఎంపీల్లో సీపీఐ(ఎం)కు చెందిన ఎస్.వెంకటేశన్, కాంగ్రెస్ ఎంపీలు గుర్జీత్ సింగ్ ఔజ్లా, హిబ్బి ఈడెన్, సి. కిరణ్ కుమార్ రెడ్డి, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మానికం ఠాగూర్, ప్రశాంత్ పడోల్, డీన్ కురియకోస్ ఉన్నారు. సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత ఆ ఎనిమిది మంది ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్దకు వెళ్లి నివాళి అర్పించారు. దీంతో బడ్జెట్ సమావేశాల మొదటి విడతలో ఫిబ్రవరి 3న సస్పెన్షన్‌కు గురైన ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలు 43 రోజుల తర్వాత బడ్జెట్ సమావేశాల రెండో విడత సమావేశాలకు హాజరుకానున్నారు.

# బీమా రంగంలో ఎఫ్‌డిఐలను పెంచుతాం..

భారత బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచుతామని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఆరోగ్య బీమా కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. 2033 నాటికి అందరికీ బీమా లక్ష్యాన్ని చేరుకుంటామని మంగళవారం మంత్రి రాజ్యసభలో ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సీతారామన్ మాట్లాడుతూ.. బీమా రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఆర్థిక సంవత్సరం 2024-25లో ఇప్పటికే 58 కోట్ల మందికి బీమా రక్షణ లభించిందని వెల్లడించారు. బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచడం ద్వారా మార్కెట్‌ను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో తలసరి బీమా ప్రీమియం కేవలం 97 డాలర్లుగా ఉందన్నారు. ఇది ప్రపంచ సగటు 943 డాలర్ల కంటే చాలా తక్కువని మంత్రి వివరించారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించడానికి జిఎస్‌టి మినహాయింపులు, గ్రామీణ ప్రాంతాల్లో బీమా విస్తరణ వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలోని పేద ప్రజల కోసం పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన వంటి పథకాలు కేవలం రూ.436 వార్షిక ప్రీమియంతో రూ.2 లక్షల రక్షణ కల్పిస్తున్నాయని, ఆయుష్మాన్ భారత్ పథకం కింద 12 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల వరకు చికిత్స సౌకర్యం అందుతోందన్నారు. వినియోగదారులను మోసం చేసే లేదా నిబంధనలను ఉల్లంఘించే బీమా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. గత మూడేళ్లలో రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ వంటి దిగ్గజ సంస్థలకు రూ.1 కోటి నుండి రూ.2 కోట్ల వరకు జరిమానాలు విధించినట్లు ఆమె సభకు వివరించారు. ఐఆర్‌డిఎఐ పర్యవేక్షణలో రంగ బీమా కంపెనీలు పారదర్శకంగా పనిచేసేలా చూస్తున్నామన్నారు. తప్పుదోవ పట్టించే వాగ్దానాలు చేస్తే బీమా నియంత్రణ సంస్థ ఉపేక్షించదని ఆమె హెచ్చరించారు.




# అమెరికా ఉత్పత్తులకు రెడ్‌కార్పెట్



ట్రంప్ ఆంక్షలకు తలొగ్గిన మోడీ సర్కార్ అమెరికా ఉత్పత్తులకు రెడ్‌కార్పెట్ వేస్తోంది. దీంతో ఆ దేశం నుంచి భారీగా దిగుమతులు జరగడంతో భారత వాణిజ్య లోటు పెరిగి.. ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌ల ప్రభావం భారత ఎగుమతులపై స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో అమెరికాకు జరిగిన ఎగుమతులు 12.88 శాతం పతనమై 6.88 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇదే సమయంలో అమెరికా నుండి దిగుమతులు 36.53 శాతం పెరిగి 4.48 బిలియన్ల డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు అమాతం దాదాపు 30 బిలియన్ డాలర్లకు చేరడం తీవ్ర ఆందోళకరం. మరోవైపు చైనా నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లోనే చైనాతో వాణిజ్య లోటు 102.01 బిలియన్లకు చేరుకుని.. తొలిసారి 100 బిలియన్ల మైలురాయిని దాటేసింది. చైనాకు ఎగుమతులు పెరిగినప్పటికీ.. దిగుమతులు ఏకంగా 119.55 బిలియన్లకు చేరడం అధిక లోటుకు కారణమైంది. ఇతర దేశాల విషయానికి వస్తే.. స్విట్జర్లాండ్ నుండి బంగారం దిగుమతులు ఏడు రెట్లు పెరిగి 2.71 బిలియన్లకు చేరగా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలకు ఎగుమతులు వృద్ధిని నమోదు చేశాయి. అయితే బ్రిటన్, సౌదీ అరేబియా, సింగపూర్ వంటి కీలక మార్కెట్లకు ఎగుమతులు క్షీణించాయి.

ఫిబ్రవరి 2026లో స్థూల ఎగుమతులు ఆశించిన స్థాయిలో పుంజుకోకపోగా.. దిగుమతులు ఏకంగా 21.61 శాతం ఎగబాకి 80.09 బిలియన్ డాలర్లకు చేరడం గమనార్హం. మరోవైపు సరుకుల ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే 11 శాతం క్షీణించి 36.61 బిలియన్ డాలర్లకు పడిపోవడంతో వాణిజ్య లోటు పెరిగింది. ఎగుమతులు పడిపోయి, దిగుమతుల భారం పెరగడం వల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది రూపాయి విలువపై ఒత్తిడి పెంచడమే కాకుండా, విదేశీ మారక నిల్వలపై కూడా ప్రతికూల ప్రభావం చూపనుంది. మరోవైపు.. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారత వాణిజ్య రంగానికి మరిన్ని కష్టాలను తెచ్చిపెట్టొచ్చని నిపుణులు హెచ్చరించారు.

# ఏటా రూ.2 లక్షల కోట్లు!
# దేశంలో మౌలిక వసతులపై అదానీ పెట్టుబడులు



దేశంలో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఏటా రూ.2 లక్షల కోట్ల చొప్పున వచ్చే అయిదేళ్ల పాటు పెట్టుబడులు పెడుతున్నట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది. ఇంధన భద్రత కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని, తద్వారా భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ప్రభావం మనదేశంపై తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొంది. 'అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల, ఇంధన ధరలు ఉన్నట్లుండి పెరుగుతున్నాయి. అందుకే ఈ విషయంలో స్వయం సమృద్ధి తప్పనిసరి అవసరంగా మారిందని దేశాలు గుర్తిస్తున్నాయ'ని అదానీ గ్రూప్ వివరించింది. ఇంధనం, లాజిస్టిక్స్ మౌలిక ఆస్తులను బలోపేతం చేసుకుంటే అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావం పెద్దగా పడదని పేర్కొంది. ఏ వసతులపై ఎంత పెట్టుబడులంటే..: దేశ ముడి చమురు అవసరాల్లో 88%, సహజ వాయువు అవసరాల్లో 50% దిగుమతులే తీరుస్తున్నాయి. ఈ సమస్య తగ్గాలంటే, 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మనదేశం లక్ష్యంగా చేసుకుంది. ఇందులో 10 శాతాన్ని అందించాలని అదానీ గ్రూప్ భావిస్తోంది. 2030 కల్లా 50 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించేందుకు

రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపింది. విద్యుత్తు ఉత్పత్తితో పాటు సరఫరా కూడా కీలక అంశమే. అందువల్ల హైఓల్టేజీ ట్రాన్స్‌మిషన్ వసతులపై రూ.1.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాలని అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ భావిస్తోంది. సంప్రదాయ వనరుల నుంచి పూర్తిగా మారడం కంటే, సమతౌల్య ఇంధన మిశ్రమాన్ని కలిగి ఉండడం మంచిదని అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజడ్ ఎండీ కరణ్ అదానీ అంటున్నారు. సౌర, పవన, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, స్వచ్ఛ బొగ్గు వంటి మిశ్రమం భారత్‌కు అవసరమన్నారు. 24 గంటల విద్యుత్ లభ్యత నిమిత్తం 42 గిగావాట్ల బేస్‌లోడ్ విద్యుత్ సామర్థ్యాన్ని రూ.2 లక్షల కోట్లతో నిర్మించనుంది. దీంతో మొత్తం ఇంధన పోర్ట్‌ఫోలియో 90 గిగావాట్లకు చేరుతుంది.

# 6 వేలు పెరిగిన వెండి



గత మూడు రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికమవడంతో కిలో వెండి ఏకంగా రూ.6 వేలు (2.34 శాతం) పెరిగి రూ.2,62,500కి చేరుకున్నది. అలాగే బంగారం కూడా మరో వెయ్యి రూపాయలు పెరిగింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,050 లేదా ఒక్క శాతం అధికమై రూ.1,61,300 పలికింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడం వల్లనే వీటి

ధరలు పెరిగాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసర్చ్ అనలిస్ట్ దిలీప్ పార్మర్ తెలిపారు. రూపాయి పతనం, చమురు ధరలు భగ్గుమనడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 5 వేల డాలర్ల స్థాయిలో కదలాడుతుండగా, వెండి 80.46 డాలర్లుగా ఉన్నది.

# మార్కెట్లోకి డస్టర్ రీ-ఎంట్రీ



భారత వాహన మార్కెట్లో ఎస్‌యూవీలకు క్రేజ్ పెరగడానికి కారణమైన రెనాల్ట్ డస్టర్ మోడల్ తిరిగి దేశంలోని రీ-ఎంట్రీ ఇచ్చింది. మంగళవారం కంపెనీ తన సరికొత్త రెనాల్ట్ డస్టర్ 2026ను అధికారికంగా విడుదల చేసింది. ఈ ఎస్‌యూవీ ధర రూ. 10.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది, అయితే ప్రీ-బుకింగ్‌పై రూ. 10.29 లక్షలకే లభిస్తుందని కంపెనీ తెలిపింది. ప్రీమియం వేరియంట్ ధర రూ. 18.09 లక్షలుగా నిర్ణయించింది. బుకింగ్స్ ప్రారంభవగా, ఏప్రిల్ నుంచి డెలివరీలు మొదలవుతాయి. స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈ-టెక్ 160 వేరియంట్ దీపావళి నాటికి అందుబాటులో ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. రీ-ఎంట్రీ డస్టర్‌లో 6 ఎయిర్‌బ్యాగులతో పాటు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, లెవల్ 2 సహా అనేక రకాల సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి. గ్లోబల్ మోడల్‌తో పోలిస్తే మనదేశంలో విడుదలైన వేరియంట్ హెడ్‌ల్యాంప్ డిజైన్, ఐబ్రో డిజైన్ డీఆర్ఎల్ఎస్ మార్పులతో రావడం గమనార్హం.

# జిడిపికి చమురు దెబ్బ..!




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద పోకడలతో పశ్చిమాసియాలో రేపిన చిచ్చు.. భారత ఆర్థిక వ్యవస్థకు సెగ పెడుతోంది. వేల మైళ్ల దూరంలో ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంయుక్తంగా సాగిస్తోన్న మారణకాండ భారత జిడిపిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటడంతో పాటు దానికి తోడు దేశంలో నెలకొన్న తీవ్రమైన గ్యాస్ కొరత సామాన్యుల వంటగది నుండి భారీ పరిశ్రమల వరకు అన్ని రంగాలను అతలాకుతలం చేస్తోంది. ప్రధానంగా ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేయడంతో భారత్ దిగుమతి చేసుకునే ఇంధన సరఫరాకు పెద్ద విఘాతం కలిగింది. దీనివల్ల దేశ వృద్ధి రేటు మందగించడమే కాకుండా, ద్రవ్యోల్బణం పెరిగి ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఏజెన్సీలు, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం 90 శాతం, వంట గ్యాస్ కోసం సగానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుత సంక్షోభం కారణంగా దిగుమతులు నిలిచిపోవడంతో గోల్డ్‌మన్ శాక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారత 2026 వృద్ధి అంచనాలను 6.5 శాతానికి తగ్గించాయి. ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు తగ్గించి చమురు ధరల భారాన్ని కొంతవరకు భరించగలిగినప్పటికీ, పారిశ్రామిక రంగంపై పడే దెబ్బ వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఇండస్ ఇండ్ బ్యాంక్ ఆర్థికవేత్త గౌరవ్ కపూర్ విశ్లేషించారు. ఇప్పటికే గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో గ్యాస్ కొరత కారణంగా వేలాది ఇంజనీరింగ్ సంస్థలు తమ కార్యకలాపాలను నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రభావం కేవలం పరిశ్రమలకే పరిమితం కాకుండా సామాన్యుల జీవనోపాధిని కూడా దెబ్బతీస్తోంది. ముఖ్యంగా దేశంలో వేగంగా పెరుగుతున్న గిగ్ ఎకానమీలో భాగమైన లక్షలాది మంది డెలివరీ ఏజెంట్ల ఆదాయం ఇంధన ధరలు, గ్యాస్ కొరత వల్ల సగానికి పైగా పడిపోయింది. మరోవైపు గల్ఫ్ దేశాలకు జరిగే సుమారు 200 బిలియన్ డాలర్ల ఎగుమతులు కూడా ప్రమాదంలో పడ్డాయి. దీనివల్ల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయిలో 92.5 వద్దకు పడిపోయింది. ఒకవైపు వృద్ధి తగ్గుతూ.. మరోవైపు ధరలు పెరుగుతుండటంతో భారత ఆర్థిక వ్యవస్థ ఒక క్లిష్టమైన పరీక్షను ఎదుర్కొంటోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# మార్చి 24న సాయి పేరెంటరల్ ఐపిఓ




ప్రముఖ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ కంపెనీ సాయి పేరెంటరల్ వచ్చే వారం ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఓ)కు రానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సెబీకి సమర్పించగా అనుమతులు జారీ అయ్యాయి. మార్చి 24న ఇష్యూ ప్రారంభం కానుందని ఆ కంపెనీ మంగళవారం వెల్లడించింది. మొత్తం రూ.409 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా రూ.285 కోట్ల విలువైన కొత్త షేర్లతో పాటు ఆఫర్ ఫర్ సేల్ కింద 31.57 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. షేర్ల ధరల శ్రేణీని రూ.372-392గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ తమ వృద్ధి ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఎస్‌పిఎల్ సిఎండి అనిల్ కె?కె తెలిపారు. ఐపిఓ ద్వారా సేకరించిన నిధులను గ్లోబల్ ఫార్ములేషన్ బిజినెస్‌ను బలోపేతం చేయడానికి, అలాగే ఇంజెక్టబుల్, ఓరల్ సాలిడ్ డోసేజ్ విభాగాల్లో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (సిడిఎంఓ) సామర్థ్యాలను విస్తరించడానికి వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ఈ పెట్టుబడులు అంతర్జాతీయ మార్కెట్లలో కంపెనీ ఉనికిని మరింత సుస్థిరం చేయనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# కప్పువాము నీరుతో ఆ సమస్యలకు చెక్..



ఉదయాన్నే ఖాళీ కడుపుతో వాము నీటిని తీసుకోవడం వల్ల బరువు తగ్గడం, జీర్ణ సమస్యలైన గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, కీళ్ల నొప్పులు, కొలెస్ట్రాల్, పీరియడ్స్ నొప్పి వంటి అనేక అనారోగ్య సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. ప్రస్తుత ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలామంది అధిక బరువు, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా అనేక వ్యాయామాలు ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించని వారికి.. వాము నీరు ఒక సహజసిద్ధమైన, ప్రభావవంతమైన పరిష్కారం. డయాబెటిస్, అధిక లేదా తక్కువ రక్తపోటు, మోకాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి వంటి అనేక ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందడానికి వాము నీరు ఎంతగానో సహాయపడుతుంది. మన రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి వాము ఒక అద్భుతమైన ఔషధం. ఆయుర్వేద మూల గ్రంథమైన అష్టాంగ హృదయంలో మహర్షి వాగ్భటాచార్య వామును వాత, పిత్త, కఫ నాశకారిణిగా వర్ణించారు. అంటే, కడుపులో ఏర్పడే గ్యాస్ (వాతం), ఎసిడిటీ (పిత్తం), శ్లేష్మం (కఫం) వంటి సమస్యలను ఇది నివారిస్తుంది. వాత దోషం వల్ల వచ్చే కీళ్ల నొప్పులు, శరీర నొప్పులు, గుండెలో నొప్పి వంటి సమస్యలకు వాము నీరు పరిష్కారం చూపుతుంది. వాములో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ప్రోటీన్, కాల్షియం, ఐరన్, నికోటిన్ ఆసిడ్, కార్బోహైడ్రేట్లు, డైటరీ ఫైబర్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. వాము నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. కడుపు నొప్పి, గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యల నుండి తక్షణ ఉపశమనం లభిస్తుంది. మలబద్ధకం కారణంగా వచ్చే పైల్స్ వంటి సమస్యల నివారణకు కూడా ఇది చాలా ఉపయోగపడుతుంది.

వాము నీటిని తయారుచేసే విధానం: రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు నీటిలో అర టీస్పూన్ వామును వేసి నానబెట్టాలి. ఉదయాన్నే వాము పూర్తిగా నానిపోయి, నీరు రంగు మారుతుంది. ఈ నీటిని నేరుగా లేదా గోరువెచ్చగా చేసుకుని తాగవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు గోరువెచ్చగా తాగితే మంచి ఫలితాలు ఉంటాయి. మరొక పద్ధతిలో, వామును నీటిలో వేసి బాగా మరిగించి, ఆ నీటిని చల్లార్చి తాగవచ్చు. ఈ పద్ధతి ముఖ్యంగా పీరియడ్స్ నొప్పి, గొంతు నొప్పి వంటి వాటికి ఉపశమనం కలిగిస్తుంది. వాము నీరు శరీర మెటబాలిజంను పెంచుతుంది. ఆకలి లేని వారికి ఆకలిని కలిగిస్తుంది. దీర్ఘకాలంగా అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలనుకునే వారికి వాము నీరు ఒక అద్భుతమైన సహజ చికిత్స.. అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే ఈ నీటిని తాగడం మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

## రాగిజావ ఎప్పుడు తీసుకుంటే మంచిది?



రాగి జావ అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది క్యాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్‌లతో నిండి ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, బరువు తగ్గడానికి, ఎముకలు దృఢంగా ఉండటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి దోహదపడుతుంది.. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుంది. ఒత్తిడిని తగ్గించి, పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుంది. రాగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ రాగి జావ తాగాలని సూచిస్తుంటారు ఆరోగ్య నిపుణులు.. వాస్తవానికి రాగి జావ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సంప్రదాయ ఆహారం. దీనిని రోజుకొకసారి తీసుకోవడం వల్ల పొట్టలో చల్లదనం లభించడంతో పాటు ఆరోగ్యపరంగా అనేక లాభాలు చేకూరుతాయి. రాగులలో క్యాల్షియం, ఐరన్, ప్రోటీన్, ఫైబర్, మినరల్స్, అయోడిన్ వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కొవ్వులు చాలా తక్కువగా ఉండటం, ముఖ్యంగా అసంతృప్త కొవ్వును కలిగి ఉండటం వల్ల ఇది చాలా సులభంగా జీర్ణమైపోతుంది. అంతేకాకుండా.. ఇది ఎముకలను బలోపేతం చేసి, తక్షణ శక్తిని అందిస్తుంది.

రాగి జావ ఆరోగ్య ప్రయోజనాలు:బరువు నియంత్రణ: రాగుల్లో ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం ఉండటం వల్ల ఇది ఆకలిని తగ్గిస్తుంది. ఫలితంగా, అధిక ఆహారం తీసుకోవడాన్ని నియంత్రించి, బరువును నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి రాగి జావ లేదా సంగటి మంచి ప్రయోజనం అందిస్తుంది. ఎముకల దృఢత్వం: రాగులలో క్యాల్షియం పుష్కలంగా లభిస్తుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి. పిల్లల ఎదుగుదలకు కూడా ఇందులో ఉండే క్యాల్షియం తోడ్పడుతుంది.రక్తహీనత నివారణ: రాగులలో ఐరన్ మోతాదు ఎక్కువగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు దీనిని తరచూ తీసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందవచ్చు.రోగనిరోధక శక్తి పెరుగుతుంది: రాగి పిండిలో విటమిన్ సి కూడా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది.రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ: రాగి జావ వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహగ్రస్తుల్లో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఇది సహాయపడుతుంది.ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది: రాగి పిండిలో పలు రకాల అమినో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మానసిక ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంలో తోడ్పడతాయి.జీవక్రియల మెరుగుదల: రాగిలోని పోషకాలు కండరాల ఆరోగ్యానికి, రక్తం తయారవ్వడానికి, జీవక్రియలు సాఫీగా జరగడానికి దోహదపడతాయి.. ఫైబర్ ప్రయోజనాలు: రాగుల్లోని ఫైబర్ కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. దీని వల్ల అధికంగా ఆహారం తీసుకోవడం తగ్గి, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. రాగి జావను సులభంగా తయారు చేసుకోవచ్చు.. ముందుగా నీటిలో కొంచెం (2-3 స్పూన్ల పిండిని కలుపుకోవాలి.. ముద్దలు కాకుండా చూడాలి.. అలాగే.. రెండు, మూడు గ్లాసుల నీటిని వేడి చేసి.. దానిలో ఈ రాగి పిండి వేస్తూ కలుపుకోవాలి.. సరిపడినంత ఉప్పు వేసుకుంటే సరిపోతుంది.అయితే.. రాగి జావను ఉదయం పూట ఖాళీ కడుపుతో తీసుకోవడం అత్యంత ఆరోగ్యకరం.. టిఫిన్ గా కూడా తీసుకోవచ్చు లేదా.. టిఫిన్ కంటే ముందు కూడా రాగి జావ తాగొచ్చు.. అంతేకాకుండా.. రాత్రి నిద్రకు ముందు కూడా దీనిని తీసుకోవచ్చు. కావాలంటే.. రాగి జావలో మజ్జిగ, పెరుగు కూడా కలుపుకుని తీసుకోవచ్చు.. దీనికి తోడు కొంచెం పచ్చి మిర్చి, ఉల్లి తురుము జోడించుకుంటే.. రుచి పెరుగుతుంది.. ఇలా తీసుకోవడం వల్ల ఎండలో వేడి చేయకుండా శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.

# గ్లాస్ బార్లీ తీసుకుంటే శరీరంలో జరిగే మార్పు..



బార్లీ వాటర్ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. డైలీ ఉదయాన్నే బార్లీ నీరు తాగడం వల్ల బరువు తగ్గుతుంది. ఇంకా శరీరంలోని వేడి తగ్గుతుంది.. అధిక కొలెస్ట్రాల్ తగ్గడంతోపాటు..బాడీ క్లీన్ అవుతుంది. బార్లీ తీసుకోవడం శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. బార్లీ అనేది అనేక పోషకాలను కలిగి ఉన్న ధాన్యం. బార్లీని తరచుగా తీసుకోకపోయినా, ఎండాకాలంలో బార్లీ నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. బార్లీలో ఇనుము, భాస్వరం, మెగ్నీషియం, కాల్షియం, ఫోలేట్, నియాసిన్, విటమిన్లు, సోడియం, పొటాషియం, మాంగనీస్, ప్రోటీన్, శక్తి, రాగి, జింక్ మొదలైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే.. దీనిని గరిబోళ్ల సంజీవని.. లేదా.. పానీయంగా పేర్కొంటారు. ఎందుకంటే ఇది తక్కువ ఖర్చుతో కూడిన, అత్యంత పోషకమైన ఆరోగ్య పానీయం. ఇది శరీరానికి చలువ చేయడంతోపాటు.. పలు అనారోగ్య సమస్యలకు నివారణిగా పనిచేస్తుంది.బార్లీ నీరు తాగడం వల్ల శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇది రుచికరంగా కూడా ఉంటుంది. ఇది పేగు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు బార్లీ నీటిని తమ ఆహారంలో చేర్చుకోవచ్చు.బార్లీ నీరు తాగడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. మీకు కూడా అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు ఉంటే, మీరు ఈ ఆరోగ్యకరమైన నీటిని క్రమం తప్పకుండా తాగవచ్చు. మహిళలు తరచుగా మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటారు. బార్లీ నీరు తాగడం వల్ల యుటిఐలు మరియు ఇతర మూత్ర సమస్యలను నివారించవచ్చు. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి కూడా చాలా ఆరోగ్యకరమైన పానీయం. బార్లీ నీరు తాగడం వల్ల మూత్రపిండాల సమస్యలు నివారిస్తుంది. ఇంకా మూత్రపిండాల్లో రాళ్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. బార్లీ నీటిని ఎలా తయారు చేయాలి: కొంచెం బార్లీని లేదా మూడు నాలుగు స్పూన్ల బార్లీ పొడిని తీసుకొని ఒక పెద్ద గిన్నెలో వేసి దానిలో నీళ్లు పోసి.. 7-8 నిమిషాలు ఉడకబెట్టండి. మరిగిన తర్వాత గ్యాస్ ఆఫ్ చేయండి.. అనంతరం ఒక కప్పులోకి వడకట్టి, నిమ్మరసం వేసుకుని తాగండి.. ఇంకా.. వేడిగా ఉన్నప్పుడు కూడా డీటాక్స్ నీటిని టీ లాగా నెమ్మదిగా తాగవచ్చు.

# పవర్‌ఫుల్ ఎనర్జీ కావాలంటే..






మన శరీరానికి పండ్లు ప్రకృతి ప్రసాదించిన వరాలు. ముఖ్యంగా రాత్రంతా ఖాళీ కడుపుతో ఉన్న శరీరానికి ఉదయాన్నే పండ్లు అందిస్తే ఆ రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అయితే అల్పాహారంలో జామపండు తీసుకోవాలా లేక అరటిపండు తీసుకోవాలా అన్నది చాలా మందిని వేధించే ప్రశ్న. జామపండు: జామపండును పోషకాల పవర్‌హౌస్ అని అంటారు. ఇందులో ఉండే విటమిన్ సి పరిమాణం నారింజ పండు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుంది. కేవలం 100 గ్రాముల జామలో 228 మి.గ్రా విటమిన్ సి లభిస్తుంది. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షిస్తుంది. జామపండులో తక్కువ కేలరీలు, అధిక పీచు పదార్థం ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారికి, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక. దీనిలోని తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అరటిపండు: అరటిపండు తక్షణ శక్తిని ఇచ్చే ఎనర్జీ బాంబ్ లాంటిది. ఉదయాన్నే వ్యాయామం లేదా జిమ్ చేసేవారికి ఇది దివ్యౌషధంలా పనిచేస్తుంది. అరటిపండులో ఉండే సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు శరీరానికి వేగంగా శక్తిని అందిస్తాయి. ఇందులో పుష్కలంగా ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాదు ఇందులోని విటమిన్ బి6 మెదడు పనితీరును మెరుగుపరుస్తూ.. రోజంతా మన మూడ్‌ని ఉత్సాహంగా, ఒత్తిడి లేకుండా ఉంచడానికి దోహదపడుతుంది. ఏది ఎంచుకోవాలి? ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలి అంటే అది పూర్తిగా మీ ఆరోగ్య లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మీరు షుగర్ లేదా బరువు తగ్గడం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లయితే జామపండు ఉత్తమమైనది. అలా కాకుండా రోజంతా శారీరక శ్రమ చేసేవారు లేదా తక్షణమే అలసట నుండి ఉపశమనం పొందాలనుకునే వారు అరటిపండును ఎంచుకోవడం మంచిది. వాస్తవానికి శరీరానికి అన్ని రకాల పోషకాలు అందాలంటే ఒకరోజు జామ, మరొకరోజు అరటిపండు మార్చి మార్చి తీసుకోవడం అత్యుత్తమమైన పద్ధతి. ఉదయం ఖాళీ కడుపుతో పండ్లు తీసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. పండ్లు మరీ పుల్లగా లేకుండా చూసుకోవాలి, లేదంటే ఎసిడిటీ సమస్య వచ్చే అవకాశం ఉంది. అలాగే డయాబెటిస్ ఉన్నవారు అరటిపండు తీసుకునేటప్పుడు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. మీ జీవనశైలికి, శరీర తత్వానికి తగ్గట్టుగా సరైన పండును ఎంచుకుని మీ రోజును ఆరోగ్యంగా ప్రారంభించండి.

# బెండకాయ నీరు తాగితే ఆశ్చర్యపోయే ప్రయోజనాలు!



ఈ వేసవి కాలంలో బెండకాయ విరివిగా లభిస్తుంది. పిల్లలు, పెద్దలు అందరూ ఈ బెండకాయను ఇష్టపడతారు. కానీ, బెండకాయ నీరు కూడా తాగొచ్చని మీకు తెలుసా..? అవును, 4-5 బెండకాయలను చిన్న ముక్కలుగా కోసి రాత్రిపూట ఒక గ్లాసు నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం ఈ నీటిని తాగడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయో మీకు తెలుసా? విటమిన్ ఎ, సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న బెండకాయ నీళ్లు తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఫైబర్ అధికంగా ఉండే ఓక్రా వాటర్‌ను ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ కలిగిన లేడీఫింగర్ వాటర్ ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఆకలి తగ్గుతుంది. దీంతో వేగంగా బరువు తగ్గుతారు.బెండకాయలో సల్యూబుల్ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో గ్లూకోజ్ ఆకర్షణను తగ్గించి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. బెండకాయ నీటిని ప్రతిరోజూ తాగడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుకోవచ్చు. బెండకాయలో ఉండే రసాయనం పొట్టలోని ఆమ్లాలను తటస్థం చేయడంలో సహాయపడుతుంది, తద్వారా గ్యాస్, అజీర్ణం, కడుపు సమస్యలను నివారించవచ్చు. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న ఓక్రా వాటర్ తాగడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. బెండకాయ నీరు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. విటమిన్ కె, కాల్షియం సమృద్ధిగా ఉండే ఓక్రా వాటర్ బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎముకలను బలపరుస్తుంది. ఓక్రా వాటర్ తాగడం వల్ల కంటి చూపు కూడా మెరుగుపడుతుంది. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న లేడీఫింగర్ వాటర్ చర్మానికి కూడా మేలు చేస్తుంది. బెండకాయలో కరిగే, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. ఇది రక్తంలో చక్కెరను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల కార్బోహైడ్రేట్ శోషణ కూడా నెమ్మదిస్తుంది. ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

# వంద రోగాలను తరిమికొట్టచ్చు పసుపు రంగు పుచ్చకాయ..



ఎరుపు రంగు పుచ్చకాయ కంటే పసుపు పుచ్చకాయ తినడమే బెస్ట్ అని వైద్యులు కూడా చెబుతున్నారు. వీటిలో విటిమిన్ ఎ, సి ఎక్కువగా ఉంటాయి. అలాగే, దీని వలన రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఆ రోగాలను ఇట్టే తరిమికొట్టచ్చు పసుపు రంగు పుచ్చకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని కాపాడుతుంది. అలాగే, ఇమ్యూనిటీ పవర్ ను కూడా పెంచుతుంది. చర్మం , కంటి ఆరోగ్యం: దీనిలో ఉండే బీటా కెరోటిన్ చర్మం, కంటి సమస్యల కాపాడుతుంది. అందుకే, దీనిని తినాలని వైద్యులు చెబుతున్నారుహైడ్రేషన్: వీటిలో 90% కంటే నీరు ఎక్కువ ఉంటుంది. ఇది అన్ని రోగాలను నివారిస్తుంది. గుండె ఆరోగ్యం: వీటిలో పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి. ఇవి బ్లడ్ ప్రజర్ ను నియంత్రిస్తాయి. జీర్ణక్రియ: వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను పని తీరును మెరుగుపరుస్తుంది.

# సన్‌రైజర్స్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్.. వైస్ కెప్టెన్‌గా అభిషేక్ శర్మ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) కీలక ప్రకటన చేసింది. రెగ్యులర్ కెప్టెన్, ఆస్ట్రేలియా దిగ్గజం పాట్ కమిన్స్ గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో తొలి కొన్ని మ్యాచ్‌లకు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహిస్తాడని ఫ్రాంచైజీ ప్రకటించింది. యువ సంచలనం అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

"గాయం నుంచి కోలుకుంటున్నందున పాట్ కమిన్స్ కొన్ని మ్యాచ్‌లకు దూరమవుతాడు. అతను తిరిగి వచ్చే వరకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా, అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా ఉంటారు" అని సన్‌రైజర్స్ తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది.

గతేడాది డిసెంబర్ లో వెస్టిండీస్ పర్యటన తర్వాత వెన్ను గాయంతో బాధపడుతున్న కమిన్స్, అప్పటి నుంచి క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఈ గాయం కారణంగానే అతను యాషెస్ సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లు, 2026 టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్ మలి దశలో అతను జట్టుతో చేరే అవకాశం ఉంది.

2025 నుంచి సన్‌రైజర్స్ జట్టులో ఉన్న ఇషాన్ కిషన్, ఇటీవల దేశవాళీ సీజన్‌లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గెలిచిన జార్ఖండ్ జట్టుకు విజయవంతంగా నాయకత్వం వహించాడు. అయితే, ఐపీఎల్‌లో కెప్టెన్‌గా అతనికి ఇదే తొలిసారి కావడం విశేషం. ఐపీఎల్ 2016 విజేత అయిన సన్‌రైజర్స్ హైదరాబాద్, తమ 2026 సీజన్ ను ఈ నెల 28న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB)తో జరగనున్న మ్యాచ్‌తో ప్రారంభించనుంది.ఇక, ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజయంలో ఇషాన్, అభిషేక్ ఇద్దరూ కీలక పాత్ర పోషించారు. అయితే, అనుభవంలో 27 ఏళ్ల ఇషాన్ సీనియర్ కావడంతో అతనికి కెప్టెన్సీ దక్కింది. ఇషాన్ ఇప్పటివరకు 119 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడగా, 25 ఏళ్ల అభిషేక్ 77 మ్యాచ్‌లలో ఆడాడు. కమిన్స్ సారథ్యంలో ఎస్ఆర్‌హెచ్ 30 మ్యాచ్‌లు ఆడి 15 విజయాలు సాధించింది. 2024లో జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లగా, గత సీజన్‌లో ఆరో స్థానంలో నిలిపాడు.

# హేజిల్‌వుడ్ ఔట్, వెంకటేష్ అయ్యర్‌కు నో ఛాన్స్.. SRH మ్యాచ్‌కు RCB తుది జట్టు ఇదే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బరిలోకి దిగబోతుంది. ఈ ఎడిషన్ లో తమ టైటిల్ ని డిఫెన్స్ చేసుకునేందుకు ప్లాన్ చేస్తుంది. మార్చి 28న ప్రారంభం కానున్న తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తో ఎం. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ తలపడనుంది. కాగా గత సీజన్‌లో టైటిల్ సాధించిన జట్టుని ఆర్సీబీ యాజమాన్యం అలాగే కొనసాగించింది. తక్కువ బడ్జెట్‌తో వేలంలో పాల్గొన్నప్పటికీ టీమ్ ని మరింత బలోపేతం చేసేలా పలు నిర్ణయాలు తీసుకుంది. కెప్టెన్‌గా రజత్ పటిదార్ కే మళ్లీ బాధ్యతలు అప్పగించింది. 2025 సీజన్‌లో గాయంతో ఇబ్బంది పడినప్పటికీ ఈసారి మంచి ప్రదర్శన ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఓపెనింగ్‌లో ఫిల్ సాల్ట్--విరాట్ కోహ్లీ జోడీ మళ్లీ జట్టుని ముందుండి నడిపించనుంది. గత సీజన్‌లో ఈ జోడీ జట్టుకు అద్భుతమైన ప్రదర్శనలతో టీమ్ విజయాల్లో కీలక పాత్ర పోషించింది. నెంబర్-3లో దేవదత్ పడిక్కల్ స్థానం దాదాపు ఫిక్స్ కావడంతో.. వెంకటేష్ అయ్యర్‌కు స్టార్టింగ్ మ్యాచ్‌లో అవకాశం దక్కకపోవచ్చు. ఇక మిడిల్ ఆర్డర్‌లో టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రోమారియో షెఫర్డ్ కీలక పాత్ర పోషించనున్నారు. అలాగే ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా కూడా జట్టులో కీలకంగా మారనున్నాడు. అలాగే బౌలింగ్ విభాగంలో ఆర్సీబీకి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ గాయంతో పలు మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం కనిపిస్తుంది. అతని స్థానంలో జాకబ్ డఫీ లేదా నువాన్ తుషారా టీమ్ లోకి వచ్చే ఛాన్స్ ఉంది. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు పేస్ విభాగాన్ని భువనేశ్వర్ కుమార్ నడిపించనున్నాడు. స్పిన్ విభాగంలో సుయాష్ శర్మ కీలక పాత్ర పోషించే ఛాన్స్ ఉంది. యువ ఆటగాళ్లు మంగేష్ యాదవ్, రసీఖ్ సల్మాన్ దార్ కూడా తుద జట్టులో స్థానం కోసం పోటీ పడుతున్నారు. దీంతో గత సీజన్‌లో విజయాన్ని అందించిన ఓపెనింగ్ కాంబినేషన్‌ను కొనసాగిస్తూ, నాలుగు మార్పులతో ఆర్సీబీ కొత్త సీజన్‌కు రెడీ అయింది. టైటిల్ డిఫెన్స్‌లో ఆర్సీబీ ఎలా రాణిస్తుందో వేచి చూడాల్సి ఉంది.




**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అంచనా:**

ఆర్సీబీ జట్టు: ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పటిదార్(కెప్టెన్), టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రోమారియో షెఫర్డ్, కృనాల్ పాండ్యా, జాకబ్ డఫీ, భువనేశ్వర్ కుమార్, సుయాష్ శర్మ.

# టెస్టుల్లో భారత జట్టు వైఫల్యాలు.. గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జాతీయ క్రికెట్ జట్టుకు వైట్‌బాల్ క్రికెట్‌లో గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అద్భుతమైన విజయాలను నమోదు చేసింది. 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, 2025, 2026లలో వరుసగా టీ20 వరల్డ్ కప్ ని కైవసం చేసుకుంది. కానీ టెస్ట్ క్రికెట్‌లో మాత్రం భారత జట్టు ఆశించిన మేర స్థాయిలో ప్రదర్శన చేయడం లేదు. బంగ్లాదేశ్, వెస్టిండీస్‌పై మాత్రమే సిరీస్‌లు గెలిచిన భారత్, స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 3---0తో వైట్‌వాష్‌కు గురి కావడం, 2024- 25 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీను కోల్పోయింది.. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 2- 2తో డ్రా చేసుకున్నప్పటికీ.. దక్షిణాఫ్రికాతో 2- 0 తేడాతో పరాజయం పాలైంది.టెస్టుల్లో భారత జట్టు ప్రదర్శనపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పందిస్తూ.. జట్టు ప్రస్తుతం ట్రాన్సిషన్ దశలో ఉందని పేర్కొన్నారు. న్యూజిలాండ్ సిరీస్ ఆడిన జట్టు, దక్షిణాఫ్రికా సిరీస్ ఆడిన టీమ్ పూర్తిగా భిన్నం.. ఈ రెండు సిరీస్‌లను ఒకేలా చూడటం సరికాదు.. జట్టు ఫలితాల బాధ్యత నాదే.. విమర్శలు స్వాగతిస్తాను.. కానీ జట్టు మార్పు దశలో ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఆయన తెలిపారు. అలాగే ఇంగ్లాండ్‌లో భారత్ సాధించిన విజయాలను కూడా గుర్తు చేశారు. కాబట్టి ఒక్క సిరీస్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం తగదని గంభీర్ సూచించారు. న్యూజిలాండ్ సిరీస్ సమయంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉన్నారు.. వీరిద్దరూ 2025 మేలో టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో రోహిత్ ఫామ్‌లో లేకపోవడంతో చివరి టెస్ట్‌కు తానే తప్పుకున్నాడు.. అనంతరం టెస్ట్ జట్టుకు కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేసిన సెలక్షన్ కమిటీ, శుభ్‌మన్ గిల్ ని కెప్టెన్‌గా, రిషభ్ పంత్ ని వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. గిల్ నాయకత్వంలో ఇంగ్లాండ్‌లో జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చినప్పటికీ, స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో ఘరంగా ఓడిపోయింది.



# అత్యంత ధనవంతుల జాబితాలో సౌత్ లేడీ స్టార్స్.. హైయెస్ట్ ఎవరంటే?

సినీ ఇండ్రస్ట్రీ లో కథానాయికలు కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, బాక్సాఫీస్ వద్ద తమకంటూ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్నారు. సంపాదనలో కూడా హీరోలకు గట్టి పోటీనిస్తూ భారీ ఆస్తులను కూడబెడుతున్నారు. నయనతార నుంచి సమంత వరకు, రష్మిక మందన్న నుంచి త్రిష వరకు టాప్-7 ధనవంతులైన నటీమణుల జాబితా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మార్చి 2026 నాటి అంచనాల ప్రకారం వీరి నికర ఆస్తుల విలువ ఎంత వుందో తెలిస్తే ఆశ్చర్యపోతారు. మరి ఆ వివరాలు చూద్దాం..

**అగ్రస్థానంలో లేడీ సూపర్ స్టార్ నయనతార:**

సౌత్ ఇండియాలోనే అత్యంత ధనవంతురాలైన నటిగా నయనతార మొదటి స్థానంలో నిలిచారు. 41 ఏళ్ల ఈ 'లేడీ సూపర్ స్టార్' నికర ఆస్తి విలువ ప్రస్తుతం రూ. 200 కోట్లకు పైగానే ఉన్నట్లు సమాచారం. ఇక ఫోర్బ్స్ ఇండియా సెలబ్రిటీ లిస్టులో చోటు దక్కించుకున్న ఏకైక సౌత్ నటిగా ఆమె రికార్డు సృష్టించారు. ఆమె తర్వాత 'బాహుబలి' ఫేమ్ అనుష్క శెట్టి రూ. 135 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. స్వీటీ ఒక్కో సినిమాకు రూ. 5 నుంచి 7 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటూ తన హవా కొనసాగిస్తోంది.

**తమన్నా, సమంతల మధ్య గట్టి పోటీ:**



ఇక మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా, స్టార్ బ్యూటీ సమంత రూత్ ప్రభు ఇద్దరూ దాదాపు సమానమైన ఆస్తులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. తమన్నా నికర ఆస్తి రూ. 110-120 కోట్లు ఉండగా, ఆమె ఒక్కో సినిమాకు రూ. 4 నుంచి 5 కోట్లు వసూలు చేస్తోంది. ఇక సమంత కూడా రూ. 110-120 కోట్ల ఆస్తులతో ఆమెకు గట్టి పోటీనిస్తోంది. సమంత క్రేజ్‌ను బట్టి ఒక్కో ప్రాజెక్టుకు రూ. 3 నుంచి 8 కోట్ల వరకు తీసుకుంటోంది. వీరిద్దరూ సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు.


**సీనియర్ భామల సత్తా.. త్రిష, కాజల్:**

ఇక రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న త్రిష కృష్ణన్, కాజల్ అగర్వాల్ కూడా ఈ జాబితాలో టాప్ లో ఉన్నారు. త్రిష ఆస్తుల విలువ రూ. 85 నుంచి 100 కోట్ల మధ్య ఉండవచ్చని అంచనా. ఇక 40 ఏళ్ల కాజల్ అగర్వాల్ కూడా తన టోటల్ కెరీర్‌లో రూ. 85 కోట్ల వరకు ఆస్తులను కూడబెట్టుకున్నారు. అప్పట్లో 'మగధీర' వంటి సినిమాలతో టాప్ రేంజ్‌కు వెళ్లిన కాజల్, పెళ్లయ్యాక కూడా మంచి ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ తన ఆర్థిక స్థితిని పటిష్టంగా ఉంచుకున్నారు.

**నేషనల్ క్రష్ రష్మిక దూకుడు:**

ప్రస్తుతం పాన్-ఇండియా లెవల్లో ఫుల్ డిమాండ్ ఉన్న నటి రష్మిక మందన్న. కేవలం 29 ఏళ్ల వయసులోనే ఆమె రూ. 66 కోట్ల ఆస్తులను సంపాదించారు. 'పుష్ప 2' కోసం రూ. 10 కోట్లు, సల్మాన్ ఖాన్ 'సికిందర్' కోసం ఏకంగా రూ. 13 కోట్లు తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల వివాహం చేసుకున్న రష్మిక, ఈ జాబితాలో అందరికంటే చిన్న వయసులోనే కోట్లకు పడగలెత్తిన నటిగా నిలిచింది.

భవిష్యత్తులో ఆమె ఆస్తుల విలువ ఇంకా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.సౌత్ లేడీ స్టార్స్ తమ కష్టంతో మరియు టాలెంట్‌తో ఈ స్థాయికి చేరుకోవడం నిజంగా అభినందనీయం. కేవలం సినిమాలే కాకుండా వ్యాపార రంగంలో కూడా పెట్టుబడులు పెడుతూ తమ ఆర్థిక భవిష్యత్తును ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ జాబితా చూస్తుంటే దక్షిణాది నటీమణుల స్టార్ పవర్ బాలీవుడ్ భామలకు ఏమాత్రం తీసిపోదని అర్థమవుతోంది.



**శ్రీముఖి యొక్క బోల్డ్ మ్యాడ్‌నెస్: "మేడ్ ఫర్ ఈచ్ అదర్" వైబ్స్**



**ప్రతిభా రంతా యొక్క రాయల్ ప్రకాశం: జాతి సంపద**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965